PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 108 | విజయవాడ, ఆదివారం 19 నవంబర్ 2023 | 8 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 19 November 2023 | Rs

నేడు ప్రపంచకప్ ఫైనల్

- ఆస్ట్రేలియాతో అమీతుమీకి భారత్ సిద్ధం

ప్రతిష్టాత్మకమైన ఐసిసి ప్రపంచకప్ ఫైనల్లో అమీతుమీ తేల్చుకునేందుకు భారత్, ఆస్ట్రేలియా జట్లు సిద్ధమయ్యాయి. ఆదివారం నాడిక్కడి నరేంద్ర మోడి స్టేడియంలో జరిగే ఈ తుదిపోరుకు ఈ టోర్నీలో అపజయమన్నదే ఎరుగని రోహిత్ సేన, అయిదు సార్లు ప్రపంచకప్ ఛాంపియన్ గా నిలిచిన ఆస్ట్రేలియాతో తలపడనుంది. బ్యాటింగ్‌లో విరాట్ కోహ్లి మరోసారి విశ్వరూపం చూపి, బౌలింగ్‌లో మహ్మద్ షమీ మ్యాజిక్ ఫలిస్తే ఆస్ట్రేలియాను ఓడించడం రోహిత్ సేనకు పెద్ద కష్టమేమీ కాదు. అలా అని జగజ్జెట్టీలైన కంగారూలను తక్కువ అంచనా వేయకూడదు సుమా!

• లోపలి పేజీలో.. •

పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు

ఆరు కార్లలో రూ.6 కోట్లు

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లో శనివారం భారీగా నగదు పట్టుబడింది. నగర శివారులో ఒఆర్ఆర్ అప్పా కూడలి వద్ద శనివారం సాయంత్రం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఆరు కార్లలో తరలిస్తున్న రూ.6 కోట్ల నగదు పట్టుబడింది. టోలీచౌక్ రూ.1.40 కోట్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ నగదుకు సంబంధించి సరైన పత్రాలు చూపకపోవడంతో మొత్తం రూ.7.40 కోట్లను ఐటి అధికారులకు అందజేశారు. ఈ డబ్బు ఎవరిదనే దానిపై ఇంకా స్పష్టత ఇవ్వలేదు. ఆరు కార్లలో భారీగా నగదు తరలిస్తున్నట్టు ఫ్లయింగ్ స్క్వాడ్‌కు ముందుగా పక్కా సమాచారం అందడంతో తనిఖీలు నిర్వహించి డబ్బు స్వాధీనం చేసుకున్నారు. కాగా, హైదరాబాద్ నగరంలో ఇప్పటివరకు రూ. 51.54 కోట్ల నగదును పోలీసులు సీజ్ చేశారు.

అరెస్టయిన రెండేళ్ల తర్వాత

- కాశ్మీరీ జర్నలిస్టుకు బెయిల్

• లోపలి పేజీలో.. •

ఇక అంతే..!

కరువు మండలాలపై సర్కారు పట్టు

- ఈ నెలాఖరుకు ఎన్యుమరేషన్
- ఆ తర్వాతే కేంద్రానికి సమగ్ర విజ్ఞాపన
- గడువు దాటితే నిధులు కష్టమే
- పరిహారంపై కొత్త నిబంధనలు
- ఇచ్చేది నామమాత్రం
- దానికీ కఠిన షరతులు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

ఖరీఫ్‌లో కరువు మండలాల పున్ణసమీక్షపై ప్రభుత్వం ససేమిరా అంటోంది. ఎట్టి పరిస్థితుల్లోనూ కొత్తగా మండలాలను ప్రకటించే అవకాశం లేదని పట్టుగా ఉంది. కేంద్ర కరువు మాన్యువల్ డెడ్‌లైన్ ఆఖరి గడియల్లో పరిమిత సంఖ్యలో ప్రకటించిన మండలాల వద్దనే లాక్ వేసినట్లు తెలుస్తోంది. మండలాల పెంపుపై కేంద్రానికి సమాచారం ఇచ్చి అనుమతి పొందాల్సిన గడువు మరో రెండు రోజుల్లో ముగుస్తున్నప్పటికీ రాష్ట్ర సర్కారు అటువంటి ప్రయత్నమేదీ చేయలేదని చెబుతున్నారు. ఇదిలా ఉండగా కరువును గుర్తించాక వారంలో కేంద్రానికి సమగ్ర వివరాలతో ఆర్థిక సహాయం కోరుతూ వినతిపత్రం అందజేయాల్సి ఉండగా, ఇంకా పంట నష్టంపై ఎన్యుమరేషన్ ప్రారంభదశలోనే ఉంది. ఈ నెఖారులోగా లబ్ధిదారుల జాబితాలు రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శనకు ఆదేశించారు. ఆ తంతు ముగిశాకనే నష్టం అంచనాలు ఒక కొలిక్కొస్తాయని సమాచారం. గడువు లోపు కేంద్రానికి ప్రాథమిక విజ్ఞాపన సైతం పంపని స్థితిలో కేంద్ర సహాయంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగా కేంద్ర నిర్ణయాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం రాబోయే మూడేళ్లకు పేర్కొన్న విపత్తు సాయం స్వల్పంగా ఉంది. ఆ పరిహారానికీ కఠిన షరతులు విధించింది.

బుట్టదాఖలు

ఖరీఫ్ పూర్తయ్యేనాటికి రాష్ట్రంలో సుమారు 300 పైన మండలాల్లో తీవ్ర దుర్భిక్షం నెలకొనగా ప్రభుత్వం మాత్రం 103 మండలాలనే ప్రకటించింది. విపక్షాలు, రైతు సంఘాలు, రైతుల నుంచి పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తమవుతున్నా, తమ వద్ద మరిన్ని మండలాల్లో కరువును గుర్తించాలని కింది నుంచి ఎంఎల్‌ఎలు, అధికారపార్టీ నాయకులు, అధికార యంత్రాంగం ప్రతిపాదనలు, వినతులు పంపుతున్నా ప్రభుత్వం బుట్టదాఖలు చేసింది. కేంద్ర కరువు మాన్యువల్ ప్రకారం అక్టోబర్ 31 తర్వాత ఖరీఫ్‌లో కరువును ప్రకటించాలంటే ప్రత్యేకంగా కేంద్రం నుంచి పర్మిషన్ తీసుకోవాలి. ఆ గడువు కూడా మూడు వారాలే. రెండు రోజుల్లో ఆ సమయం ముగుస్తోంది. అయినప్పటికీ కొత్త మండలాల ప్రకటనపై కేంద్రానికి సమాచారం ఇవ్వలేదని తెలుస్తోంది. ప్రకటించిన మండలాలకే పరిమితమై పంట నష్టం అంచనాలు రూపొందించాలని కిందికి శుక్రవారం మెమో పంపారు. రైతుల వారీగా 33 కాలమ్స్‌లో నిర్దిష్ట ప్రొఫార్మాలో ఎన్యుమరేషన్ చేసి ఆర్‌బికెలలో సోషల్ ఆడిట్ చేయించి ఈ నెలాఖరులోపు పైకి పంపాలని ఆదేశించారు. కేంద్ర నిబంధనల ప్రకారం కరువు ప్రకటన అనంతరం వారంలో కేంద్రానికి మెమోరాండం అందజేయాలి. ఈ నెలాఖరు వరకు ఎన్యుమరేషన్ పూర్తికాని స్థితితో కేంద్రానికి ఆలస్యంగా సహాయం కోసం విజ్ఞాపన ఇస్తే ఆశించిన మేరకు నిధులొస్తాయా అన్న అనుమానాలొస్తున్నాయి. అన్నీ బాగుంటేనే కేంద్రం పలు కొర్రీలు పెట్టి నిధులకు నిరాకరిస్తోంది. నిబంధనలు పాటించకపోతే ఇంకెన్ని ఇబ్బందులు పెడుతుందోనన్న ఆందోళన నెలకొంది.

సాయం స్వల్పం

విపత్తు సహాయం దేనికి ఎంతివ్వాలన్న దానిపై నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫండ్ (ఎన్‌డిఆర్‌ఎఫ్) నిబంధనలను ఎట్టకేలకు ఎనిమిదేళ్ల తర్వాత కేంద్రం సవరించింది. దానిపై స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫండ్ (ఎస్‌డిఆర్‌ఎఫ్) నిబంధనలను రాష్ట్ర సర్కారు సవరిస్తూ మొన్న 14న జిఒఎంఎస్ నెం.5 జారీ చేసింది. తాజా ఉత్తర్వుల ప్రకారం వ్యవసాయ పంటలకు ఎకరాకు గరిష్టంగా ఇచ్చే పరిహారం రూ.6,800. ఉద్యానవన పంటలకైతే రూ.10 వేలు. కరువు వలన అత్యధికంగా నష్టపోయిన వరి, వేరుశనగ, పత్తి, మిర్చి, కూరగాయ పంటలకు ఎకరాకు ఇచ్చేది రూ.6,800 మాత్రమే. రైతు పంట వేసేందుకు పెట్టే పెట్టుబడికి, ప్రభుత్వం ఇచ్చే సహాయానికి పొంతనే లేదు. ఇదిలా ఉండగా, కేంద్రం నిర్ణయించిన సహాయం తక్కువగా ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వాలు తమ ప్రాంతాల్లో వ్యవసాయ ఖర్చులను దృష్టిలో ఉంచుకొని ఎంతో కొంత పెంచి ఇచ్చేవి. ఈ తడవ రాష్ట్ర ప్రభుత్వం అటువంటి ఆలోచన చేయలేదు. కేంద్రం ఎంతిస్తే అంతే నిర్ణయించింది. ఉదాహరణకు వరి, వేరుశనగ, పత్తి, ఇత్యాది పంటలకు కేంద్రం గతంలో ఎకరాకు రూ.4 వేలివ్వగా, రాష్ట్రం ఆరు వేలిచ్చింది. ఈ సారి కేంద్రానికి, రాష్ట్రానికి మధ్య తేడా లేదు.

ఐదెకరాలకే...

కరువు సహాయానికి ప్రభుత్వం కఠిన ఆంక్షలు విధించింది. ఒక రైతు ఎన్ని చోట్ల ఎన్ని పంటలు సాగు చేసి నష్టపోయినా ఐదెకరాలకే సహాయం వస్తుంది. కౌలు రైతులకూ అదే వర్తిస్తుంది. తప్పనిసరిగా ఇ-క్రాప్‌లో రైతు పంట వేసినట్లు నమోదై ఉండాలి. లేదంటే పరిహారం ఇవ్వరు. ఈ నిబంధన కౌలు రైతులకు తీవ్ర ప్రతిబంధకం కానుంది.

గవర్నర్లను అడ్డంపెట్టుకుని కేంద్రం కక్ష సాధింపు

- తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్
- గవర్నర్ వెనక్కి పంపిన పది బిల్లులను మళ్లీ ఆమోదించిన అసెంబ్లీ

ప్రజాశక్తి- చెన్నై

బిజెపియేతర పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో గవర్నర్లను అడ్డంపెట్టుకొని కేంద్ర ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ విమర్శించారు. శనివారం అసెంబ్లీని ప్రత్యేకంగా సమావేశ పరిచి, గతంలో తీర్మానించిన 10 బిల్లులను ఏకగ్రీవంగా మరోసారి ఆమోదించారు. బిల్లులపై ఓటింగ్‌కు బిజెపి గైర్హాజరైంది. ఎలాంటి కారణాలు చెప్పకుండా గవర్నర్ ఆర్.ఎన్ రవి పది బిల్లులను ఇటీవల వెనక్కి పంపిన సంగతి తెలిసిందే. ఆసెంబ్లీ రెండవసారి ఆమోదించిన బిల్లుల్లో 2020కి సంబంధించి రెండు, 2022కి సంబంధించి ఆరు, ప్రస్తుత సంవత్సరంలో రెండు ఉన్నాయి. ఇందులో వైస్ ఛాన్సలర్ల నియామకంలో గవర్నర్ అధికారాలను తొలగించేలా తీసుకొచ్చిన తీర్మానం కూడా ఉంది. వర్సిటీల విసిలను రాష్ట్ర ప్రభుత్వమే నియమించేలా తమిళనాడు విశ్వవిద్యాలయాల చట్టంలో సవరణలు చేస్తూ రాష్ట్రప్రభుత్వం ఈ బిల్లు తీసుకొచ్చింది. వ్యవసాయం, ఉన్నత విద్య, న్యాయ వ్యవహారాలకు సంబంధించిన బిల్లులు కూడా వీటిలో ఉన్నాయి.

బిల్లుల నిలిపివేత అప్రజాస్వామికం : స్టాలిన్

బిల్లులపై చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి స్టాలిన్ మాట్లాడుతూ ఎలాంటి కారణం చూపకుండా బిల్లులను నిలిపివేయడం ఆమోదయోగ్యం కాదని అన్నారు. కేవలం వ్యక్తిగత కారణాలతోనే బిల్లులను వెనక్కి పంపారని విమర్శించారు. ఇది అప్రజాస్వామికమని, ప్రజా వ్యతిరేకమని స్టాలిన్ అన్నారు. బిజెపియేతర పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో గవర్నర్లను అడ్డం పెట్టుకొని కేంద్రం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు

- పలు జిల్లాలో అంగన్‌వాడీల రిలే నిరాహార దీక్షలు
- వారి పోరాటం, సమ్మెకు ఐద్వా సంపూర్ణ మద్దతు

ప్రజాశక్తి- యంత్రాంగం

తమ సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అంగన్‌వాడీలు శనివారం ఆందోళనకు దిగారు. ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన ఐసిడిఎస్ కార్యాలయాల వద్ద రిలే నిరాహార దీక్షలు, ర్యాలీలు చేపట్టారు. తమ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదంటూ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. నంద్యాలలోని బిఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం వద్ద నిర్వహించిన రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి సందర్శించి మద్దతు తెలిపారు. విలేకర్లతోనూ మాట్లాడారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకపోతే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పతనం తప్పదని హెచ్చరించారు. గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా జగన్‌మోహన్‌రెడ్డి మోసగించారని విమర్శించారు. న్యాయమైన సమస్యలను పరిష్కరించకపోతే 2024 ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలంతా ముఖ్యంగా మహిళలంతా కలిసి జగన్‌మోహన్‌రెడ్డికి వ్యతిరేకంగా బటన్ నొక్కుతారని హెచ్చరించారు. అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీ ప్రకారం తెలంగాణా కన్నా అదనంగా వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటీ ఇవ్వాలని కోరారు. వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలని, ఫ్రీ స్కూల్‌ను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, హెల్పర్ల ప్రమోషన్లకు వయోపరిమితిని 50 సంవత్సరాలకు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అనేక రకాల యాప్‌లు పెట్టి నివేదిక పంపించాలని అంగన్‌వాడీలను వేధింపులకు గురిచేస్తోందని, దీనివల్ల పిల్లల సంరక్షణ లక్ష్యం నెరవేరడం లేదని అన్నారు. కృష్ణా జిల్లాలో అంగన్‌వాడీ కార్యకర్త గుండెనొప్పితో చనిపోవడం తాజా ఉదాహరణని తెలిపారు. పసి బిడ్డలకు, గర్భిణులకు, బాలింతలకు సరఫరా చేస్తోన్న పోషకాహారం కల్తీ, పురుగులమయంగా మారిందని విమర్శించారు. గత నెలలో చిత్తూరు జిల్లాలో ఖర్జూరం ప్యాకెట్లో పాము రూపంలో ఉన్న రబ్బర్ బ్యాండ్ ప్రత్యక్షమై సోషల్ మీడియాలో వైరల్ అయిందన్నారు. నాణ్యతలేని ఖర్జూరం సరఫరా చేసిన కాంట్రాక్టర్‌ను తొలగించకపోగా నోటీసు ఇచ్చి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. నాణ్యతలేని

మిగతా 2లో

నంద్యాలలో అంగన్‌వాడీలకు మద్దతుగా మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి

అంగన్‌వాడీ, ఆశావర్కర్లకు కేరళలో వేతనాల పెంపు

- ఎల్‌డిఎఫ్ సర్కార్ కీలక నిర్ణయం
- వచ్చే నెల నుంచే అమలు

తిరువనంతపురం : కేరళలోని అంగన్‌వాడీ ఉద్యోగులు, ఆశావర్కర్ల గౌరవ వేతనాలను డిసెంబర్ నుంచి పెంచాలని వామపక్ష ప్రజా తంత్ర కూటమి (ఎల్‌డిఎఫ్) ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిర్ణయంతో 89 వేల మంది లబ్ధిపొందనున్నారు. కేరళ ఆర్థిక శాఖ మంత్రి కెఎన్ బాలగోపాల్ మీడియాతో మాట్లాడుతూ పదేళ్లకుపైగా సర్వీసు ఉన్న అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లకు వెయ్యి రూపాయల చొప్పున వేతనం పెరుగుతుంది. పదేళ్లలోపు అనుభవం ఉన్న వారికి రూ.500 పెరుగుతుంది. ఈ నిర్ణయంతో 62,852 మంది ఉద్యోగులకు ప్రయోజనం కలుగుతుందని మంత్రి బాలగోపాల్ తెలిపారు. ఆశావర్కర్ల గౌరవ వేతనం రూ.వెయ్యి చొప్పున పెరుగుతుంది. ఈ నిర్ణయంతో 26,125 మంది లబ్ధిపొందనున్నారు. అంగన్‌వాడీ ఉద్యోగులు, ఆశావర్కర్లకు గౌరవ వేతనాలు పెంచుతామని ఇచ్చిన హామీని కేరళలోని వామపక్ష ప్రభుత్వం డిసెంబర్ నుంచి అమలు చేయాలని నిర్ణయించడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

ఎసిబి వలలో నలుగురు అధికారులు

- రూ. 50 కోట్లపైగా ఆస్తుల స్వాధీనం
- అధికారుల కన్నుగప్పి పారిపోయిన సబ్ రిజిస్ట్రార్

ప్రజాశక్తిఅమరావతిబ్యూరో

నలుగురు ఉన్నతాధికారుల ఇళ్లలో ఎసిబి అధికారులు జరిపిన దాడుల్లో కోట్లాది రూపాయల ఆస్తులు బయటపడ్డాయి. అధికారులు స్వాధీనం చేసుకున్న ఆస్తుల విలువ 50 కోట్ల రూపాయల పైనే ఉంటుందని అంచనా. దాడులు జరుగుతుండగానే ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రార్‌గా ఉన్న బాల నాగ ధర్మసింగ్(సింగ్) ఎసిబి అధికారుల కళ్లుగప్పి పారిపోవడం కలకలం సృష్టించింది. రెండు,రోజుల పాటు జరిగిన దాడుల వివరాలను ఎసిబి డైరక్టర్ జనరల్ ఒక ప్రకటన రూపంలో శనివారం మీదియాకు తెలిపారు. అధికారులతో పాటు వారి బంధులు,స్నేహితుల ఇళ్లలో ఎసిబి ఏకకాలంలో దాడులు జరిపింది.

ఎన్‌టిఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న లాలా బాలనాగధర్మసింగ్ ఇంటిలో ఎసిబి అధికారుల ప్రత్యేక బృందం రెండురోజులపాటు తనిఖీలు నిర్వహించింది. ఆయనకు చెందిన 11 స్థిరాస్తుల విలువే సుమారు రు.20 కోట్లకు పైగా ఉండొచ్చని అంచనా వేశారు. వీటితో పాటు ఫిక్స్‌డ్ డిపాజిట్లు 69 లక్షలు, బ్యాంక్ బ్యాలెన్స్ రూ.10 లక్షలు, ఎల్ఐసి పాలసీలు రూ.18 లక్షలు, బంగారు ఆభరణాలు కేజీన్నర, వెండి ఆభరణాలు 13.633 కేజీలు, రూ.27 లక్షల విలువచేసే గృహోపయోగమైన ఆర్టికల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీటితోపాటు రూ.20లక్షల విలువజేసే ఇన్నోవా క్రిస్టా, రూ.11లక్షల విలువజేసే టయోటా యారిస్, రూ.7 లక్షల విలువైన టయెటా ఎటియాస్ కార్లను స్వాధీనం చేసుకున్నారు. విలువైన ఆస్తులన్నీ బినామీ పేర్లమీద ఉండగా బినామీలను గుర్తించినట్లు తెలిపారు. విజయవాడలో రెండు భవనాలు, రెండుప్లాట్లు, మరో రూ.23 లక్షల బ్యాంక్ డిపాజిట్లు, నల్లజర్లలో వ్యవసాయ భూమి ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అధికారులు సోదాలు చేస్తుండగానే ఆయన పారిపోయారు.

నంద్యాల జిల్లా మైన్స్ అండ్ జియాలజీ శాఖలో అసిస్టెంట్ జియాలజిస్ట్‌గా విధులు నిర్వహిస్తున్న గండికోట వెంకటేశ్వరరావు ఆదాయానికి మించి ఆస్తులు సంపాదించారనే ఆరోపణల నేపథ్యంలో ఎసిబి అధికారులు సోదాలు నిర్వహించారు. గుంటూరు, పెదకాకాని గుంటూరు రూరల్, నరసరావుపేట మండలాల్లో పెద్దఎత్తున ఇళ్లు, స్థలాలు, పొలాలు ఉన్నట్లు గుర్తించారు. వీటివిలువ రూ.10 కోట్లకుపైనే ఉంటుందని అంచనా వేశారు. నంధ్యాల జిల్లా రోడ్డు రవాణా కార్యాలయంలో ఎఓగా పనిచేస్తున్న కుంపటి సువర్ణకుమారి ఇంట్లోనూ ఎసిబి తనిఖీలు చేపట్టింది. సోదాల్లో కోట్లాది రూపాయల విలువైన

మిగతా 2లో

భారీగా పెరగనున్న విద్యుత్ డిమాండ్

- దేశ వ్యాప్తంగా 250 గిగావాట్లకు చేరొచ్చని అంచనా
- బొగ్గు నిల్వలు పెంచుకోవాలని కేంద్రం ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రానున్న వేసవిలో దేశవ్యాప్తంగా విద్యుత్ డిమాండ్ భారీగా పెరగనుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని ఇప్పటి నుండే సిద్ధం కావాలని అన్ని రాష్ట్రాలను కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. దేశ వ్యాప్తంగా 250 గిగావాట్ల గ్రిడ్ డిమాండ్ ఉంటుందని కేంద్రం అంచనా వేసింది. గత ఏడాది వేసవిలో జరిగిన వినియోగానికి సమానంగా ఈ ఏడాది సెప్టెంబర్ నెలలోనే దేశ వ్యాప్తంగా వినియోగించారు. చలికాలం కావడంతో ఆ తరువాత వినియోగం కొంత తగ్గినా, ఫిబ్రవరి నెలాఖరు నుండి పెరిగి వేసవిలో పతాక స్థాయికి చేరుకుంటుందని భావిస్తున్నారు. ప్రస్తుతం గ్రిడ్ డిమాండ్ 220 గిగావాట్ల వరకు ఉంది. ప్రతి ఏటా విద్యుత్ డిమాండ్ మూడుశాతం నుండి ఐదుశాతం వరకూ పెరుగుతోంది. అయితే ఈ సారి వర్షాభావం వల్ల డిమాండ్ భారీగా పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. జల విద్యుత్ ఉత్పత్తి ఈ ఏడాది గణనీయంగా తగ్గింది. ఇప్పటి వరకూ ఒక మిలియన్ యూనిట్ల విద్యుత్ కూడా ఉత్పత్తి చేయలేని పరిస్థితి ఏర్పడిందని అధికారులు చెబుతున్నారు. శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల ద్వారా గతేడాది సరిపోయినంత రెండువేల మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి జరిగింది. ప్రస్తుతం పవన, సోలార్ విద్యుత్ ఉత్పత్తి కూడా అనుకున్నంత స్థాయిలో జరగడం లేదు. వర్షాలు లేక రిజర్వాయర్లలో నీరు లేకపోవడంతో ఖరీఫ్‌లో బోర్ల మీదే వ్యవసాయం చేయాల్సిన పరిస్థితి చాలా ప్రాంతాల్లో ఏర్పడింది. రబీ సాగు కూడా బోర్లపైనే అధారపడి జరగాల్సి ఉంటుందని అంచనా వేస్తున్నారు. దీంతో ఈసారి డిమాండ్ తారాస్థాయికి చేరుతుందని నిపుణులు భావిస్తున్నారు. దీనిలో భాగంగానే బొగ్గు నిల్వలు పెంచుకునేందుకు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని కేంద్రం రాష్ట్రాలకు సూచించింది. అవసరమైతే విదేశీ బొగ్గును దిగుమతి చేసుకునేలా ప్రణాళికలు చేసుకోవాలని సూచించింది. వ్యవసాయానికి సోలార్ విద్యుత్‌ను వినియోగించేలా చర్యలు తీసుకోవాలనీ సూచించింది. సోలార్ ఉత్పత్తి లేని సమయంలో బొగ్గు ఆధారిత విద్యుత్ ప్లాంట్లపై ఆధారపడాలని సూచించింది. రాష్ట్రాల ఆధ్వర్యంలో నడుస్తున్న జెన్‌కో ప్లాంట్లను పూర్తి సామర్థ్యంతో నడపాలని చెప్పింది. పిఎల్‌ఎఫ్ 85 శాతం ఉండేలా ప్లాంట్లను సిద్ధం చేయాలని పేర్కొంది. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేయాలని, పర్యావరణ, ఇతర అనుమతులు వచ్చేలా, భూమి లభ్యత వంటి వాటికోసం ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించింది.

రబీకి నీరివ్వలేం

- వర్షాభావ పరిస్థితులే కారణం
- ఆరుతడి పంటలకు రాయితీపై విత్తనాలు
- కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల నీటిపారుదల, వ్యవసాయ సలహా మండళ్ల సమావేశంలో కలెక్టర్లు

• లోపలి పేజీలో.. •

సుగంధ ద్రవ్యాలకు డిమాండ్ భళా..

- రూ.1.50 లక్షల కోట్ల విలువ చేసే ఉత్పత్తి
- రూ.32వేల కోట్ల ఎగుమతులు
- గరిష్ట స్థాయి నుంచి దిగొస్తున్న ధరలు
- వాల్డ్ స్పైసీ ఆర్గనైజేషన్ ఛైర్మన్ రామ్ కుమార్ వెల్లడి

డోలీ మోతలు కనబడవా?

- పాలకులారా... మాకు ఎన్నాళ్లీ చీకటి బతుకులు
- విశాఖలో ఆదివాసీల వినూత్న నిరసన

ప్రజాశక్తి- కలెక్టరేట్ (విశాఖపట్నం)

'పాలకులారా... మాకు ఎన్నాళ్లీ చీకటి బతుకులు. డోలీ మోతలు, మా సమస్యలు మీకు కనబడవా?' అంటూ అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం చిన్నకోనిల, బూరుగ తదితర గ్రామాల ఆదివాసీలు విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద శనివారం ఆందోళనకు దిగారు. ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన డోలీలు, కాగడాలు ప్రదర్శిస్తూ, అడ్డాకులు నెత్తిమీద టోపీలుగా పెట్టుకొని వినూత్నంగా నిరసన తెలిపారు. అనంతగిరి మండలం రొంపల్లి పంచాయతీ చిన్న కోనిల, బూరుగ తదితర 20 గ్రామాల్లో వెంటనే విద్యుత్ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. అనకాపల్లి జిల్లా సరిహద్దులోని జాజులబందకు తక్షణం రోడ్డు, విద్యుత్ సదుపాయం ఏర్పాటు చేయాలని నినదించారు. అనంతరం తమ సమస్యలపై శనివారం జరుగుతున్న జిల్లా పరిషత్తు సమావేశంలో చర్చించాలని కోరుతూ జివిఎంసి గాంధీ విగ్రహం నుంచి జిల్లా పరిషత్‌కు ర్యాలీగా బయలుదేరారు. జిల్లా కోర్టు సమీపంలో పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఎంతకీ ఆదివాసీలు పట్టువిడవకపోవడంతో కొందరిని పోలీసులు తమ జీపులో జిల్లా పరిషత్‌కు తీసుకెళ్లారు. అక్కడ వారు జడ్‌పి చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్రకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం ఐదో షెడ్యూల్ సాధన కమిటీ గౌరవాధ్యక్షులు కె.గోవిందరావు, సిపిఎం నాయకులు మర్రి వెంకటరావు మాట్లాడుతూ ఎటువంటి రోడ్డు సదుపాయమూ లేనందున జాజులబంద గ్రామానికి చెందిన గిరిజనులు ఏడు కిలోమీటర్ల దూరంలోని రోలుగుంట మండలానికి కొండకోనల గుండా నడిచి వెళ్లాల్సి వస్తోందన్నారు. రోగులను, గర్భిణులను డోలీలతో మోసుకెళ్లాల్సిన దుస్థితి నెలకొందని తెలిపారు. పాలకులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేకపోతోందన్నారు. బూరుగ, చిన్నకోనిలలోని భూములను రెవెన్యూ అధికారుల అండదండలతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు కాజేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీలు కొర్ర కొండబాబు, సోముల అప్పలరాజు, సింహాచలం, కిల్లో మహేష్, కోనేపర్రి సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద వినూత్నంగా నిరసన తెలుపుతున్న గిరిజనులు

విద్యుదాఘాతంతో కార్మికుడు మృతి

ప్రజాశక్తి- రణస్థలం (శ్రీకాకుళం జిల్లా)

విద్యుదాఘాతంతో కార్మికుడు మృతి చెందిన సంఘటన శ్రీకాకుళం జిల్లా పైడిభీమవరం పారిశ్రామికవాడలోని ఎపిటోరియా ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ (అరబిందో ఫార్మా) పరిశ్రమలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పూసపాటిరేగ మండలం రెల్లివలస గ్రామానికి చెందిన మహంతి బాలకృష్ణ (34) దశరథ్ ప్రొఫెషనల్స్ సర్వీసెస్ కింద పరిశ్రమలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నారు. విధుల్లో భాగంగా పరిశ్రమలోని విద్యుత్ ప్యానల్ బోర్డుకు మరమ్మతులు చేస్తున్నారు. విద్యుత్ షాక్ తగిలి ప్యానల్ బోర్డుపై పడడంతో మృతి చెందారు. జె.ఆర్.పురం ఎస్ఐ రాజేష్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. అరబిందో యాజమాన్యం సరైన భద్రతా చర్యలు తీసుకోకపోవడం వల్లే తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అమ్మన్నాయుడు, తేజేశ్వరరావు అన్నారు. మృతుని కుటుంబానికి రూ.కోటి పరిహారం ఇవ్వాలని వారు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

సెర్ప్‌కు మూడు స్కోచ్ పురస్కారాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఢిల్లీలో స్కోచ్ గ్రూప్ నిర్వహించిన జాతీయ స్థాయి సమ్మిట్‌లో ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధిశాఖ, గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థకు మూడు పురస్కారాలు లభించాయి. వైఎస్‌ఆర్ పెన్షన్ స్కీమ్‌కు ప్లాటినం, వైఎస్ఆర్ చేయూత, మహిళా మార్టులకు గోల్డ్, సంస్థాగత నిర్మాణం-సామర్థ్యాల పెంపునకు సిల్వర్ పురస్కారాలు దక్కాయి. శనివారం న్యూఢిల్లీలో జరిగిన అవార్డుల ప్రధానోత్సవంలో సెర్ప్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎండి ఇంతియాజ్ ఈ పురస్కారాలను స్వీకరించారు. ప్రతియేటా వివిధ రంగాల్లో విశేష సేవలు, ప్రతిభ కనపరిచిన ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు స్కోచ్ సంస్థ ద్వారా అవార్డులు ఇస్తున్న సంగతి తెలిసిందే. రాష్ట్రంలో 90 లక్షల మంది మహిళలతో 8.49 లక్షల స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేసి, వాటిని గ్రామ స్థాయిలో 27,40 గ్రామ సమాఖ్యలు, 660 మండలాల్లో మండల సమాఖ్యలను అనుసంధానం చేస్తూ 26 జిల్లాలో స్థాయిలో జిల్లా సమాఖ్యలు ఏర్పాటు చేసుకున్నారు. సెర్ప్ ఆధ్వర్యంలో ఇవన్నీ నడుస్తున్నాయి. వీటి పనితీరుకు స్కోచ్ పురస్కారాలు దక్కిందని సంబంధిత అధికారులు తెలిపారు.

మళ్లీ పెరిగిన మద్యం ధరలు

- ఎక్సైజ్ శాఖ ఉత్తర్వులు

ప్రజాశక్తి-అమరామతి బ్యూరో

రాష్ట్రంలో మద్యం ధరలు మళ్లీ పెరిగాయి. క్వార్టర్‌పై రూ.10, ఫుల్ బాటిల్‌పై రూ.20 చొప్పున అలాగే విదేశీ బ్రాండ్ల మద్యం ధరలు 20 శాతం మేర పెంచుతూ శనివారం ఎక్సైజ్‌శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇదివరకు రూపాయల్లో వసూలు చేస్తున్న రిటైల్ ఎక్సైజ్ టాక్స్‌ను ఇప్పుడు శాతాల్లోకి మార్చింది. ఎఆర్‌ఇటి శ్లాబులు రూపాయల్లో ఉన్నందున అన్ని బ్రాండ్లపై సమానంగా పన్నులు లేవని ప్రభుత్వం భావిస్తోంది. అన్ని ఒకేలా ఉండటం కోసం నిర్ణీత ధర నుంచి ఎఆర్‌ఇటిని శాతాల్లోకి ఎక్సైజ్‌శాఖ మార్చింది. ఐఎంఎఫ్ఎల్ కనీస ధర రూ.2,500 లోపు ఉంటే దానిపై 250 శాతం పెంచింది. రూ.2,500 దాటితే 150 శాతం వరకు పెంచింది. బీరుపై 225 శాతం, వైన్‌పై 200 శాతం వరకూ పెంచారు. ఒక ఫుల్ బాటిల్ ప్రస్తుతం రూ.570 ఉంటే రూ.590 వరకు పెంచారు. మరో బ్రాండ్ క్వార్టర్ రూ.200 నుంచి రూ.210 పెంచుతున్నట్లు ఎక్సైజ్ శాఖ ఉత్తర్వుల్లో పేర్కొంది.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు

(మొదటి పేజీ తరువాయి)

పోషకాహారాన్ని సరఫరా చేసిన కాంట్రాక్టర్లపై అంగన్‌వాడీ కార్యకర్తలు, లబ్ధిదారులు, మహిళా సంఘాలు అనేక ఫిర్యాదు చేసినా ప్రభుత్వం ఎటువంటి చర్యలూ తీసుకోవడం లేదన్నారు. రాష్ట్ర ఫుడ్ కమీషనర్ పట్టించుకోవడం లేదని విమర్శించారు. అంగన్‌వాడీల సమ్మెకు ఐద్వా సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. దీక్షలను సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు ప్రారంభించారు. ఐద్వా జిల్లా అధ్యక్షులు నిర్మలమ్మ సందర్శించి మద్దతు తెలిపారు. తూర్పుగోదావరి, కాకినాడ జిల్లాల్లోని ఐసిడిఎస్ ప్రాజెక్టు కేంద్రాల వద్ద అంగన్‌వాడీలు ధర్నా, సామూహిక రిలే నిరాహారదీక్ష చేపట్టారు. అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం డివిజన్ పరిధిలోని చింతూరు, కూనవరం, అడ్డతీగల, మారేడుమిల్లి, రాజవొమ్మంగి మండలాల్లో ర్యాలీ, విఆర్.పురంలో తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. చింతపల్లిలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్‌కు వినతిపత్రం అందజేశారు.

'ఆడుదాం ఆంధ్ర'కు 20 నుంచి దరఖాస్తు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల్లోని సామర్థ్యాన్ని వెలికితీసే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించ తలపెట్టిన 'ఆడుదాం ఆంధ్ర' ఆటల పోటీలకు ఈ నెల 20 నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా అధికారిక వెబ్‌సైట్ అందుబాటులోకి తేనున్నట్లు రాష్ట్ర యువజన, క్రీడల మంత్రిత్వ శాఖ శనివారం ఒక ప్రకటనలో పేర్కొంది. గ్రామ స్థాయి నుంచి మొదలై జాతీయ స్థాయి వరకు క్రీడల్లో పాల్గొనే అవకాశం కల్పించనున్నట్లు పేర్కొంది. పోటీలు ఆయా గ్రామాలోలని గ్రామ వార్డు సచివాలయాల పరిధిలో జరుగనున్నాయని వెల్లడించింది. ఇందులో పాల్గొనే వారి క్రీడాకారుల వయసు కచ్చితంగా 15 సంవత్సరాలు నిండి ఉండాలని ఉత్తర్వుల్లో తెలిపారు.

కబడ్డీ, ఖోఖో, క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్ ఆటల్లో ఈ పోటీలు నిర్వహించనున్నారు. వీటితో పాటు అదనంగా 3 కిలోమీటర్ల మారథాన్, యోగ, టెన్నీకాయిట్ పోటీలు కూడా నిర్వహిస్తారు. రాష్ట్ర స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులను జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్రం తరపున అవకాశం కల్పించనున్నారు. విజేతలకు నగదు బహుమతులు కూడా ఉంటాయని క్రీడల శాఖ పేర్కొంది.

ఇదీ షెడ్యూలు

గ్రామస్థాయి : డిసెంబరు 15 నుంచి 20 వరకు	**నియోజకవర్గ స్థాయి :** జనవరి 5 నుంచి 10 వరకు
మండల స్థాయి : డిసెంబరు 21 నుంచి జనవరి 4 వరకు	**జిల్లా స్థాయి :** జనవరి 11 నుంచి 21వరకు
	రాష్ట్ర స్థాయి : జనవరి 22 నుంచి 26 వరకు

22న పుట్టపర్తికి రాష్ట్రపతి

- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏర్పాట్లను సమీక్షించిన సిఎస్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రపతి ద్రౌపదిముర్ము ఈనెల 22న శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తికి రానున్నారు. సత్యసాయి ఇనిస్టిట్యూట్ ఆఫ్ హైయర్ లెర్నింగ్ కేంద్రం 42వ స్నాతకోత్సవంలో ఆమె పాల్గొంటారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను సిఎస్ డాక్టర్ కెఎస్ జవహర్‌రెడ్డి శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ రాష్ట్ర పతి 22న మధ్యాహ్నం 12.30 గంటలకు బెంగుళూరు నుంచి భారత వాయుసేన విమానంలో శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయానికి చేరుకుంటారన్నారు. అక్కడ జరిగే స్నాతకోత్సవంలో పాల్గొంటున్న దృష్ట్యా విస్తృతమైన ఏర్పాట్లను చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. తొలుత సత్యసాయి జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్‌పి మాధవరెడ్డితో పర్యటనలో ప్రొటోకాల్ నిబంధనల ప్రకారం తీసుకుంటున్న చర్యలపై సమీక్షించారు. అనంతరం బందోబస్తు ఏర్పాట్లపై డిజిపి కెవి రాజేంద్రనాథ్‌రెడ్డితో సమీక్షించారు. రాష్ట్రపతి వచ్చే మార్గంలో రోడ్లకు ఇరువైపులా ఆహ్వానం పలికే ఆర్చీలు, హోర్డింగ్‌లు ఏర్పాటు చేయించాలన్నారు.

సిఎస్‌ను కలిసిన ఆసియా రోలర్ స్కేటింగ్ విజేతలు

ఇటీవల బీజింగ్‌లో జరిగిన 19వ ఆసియా రోలర్ స్కేటింగ్ ఛాంపియన్ షిప్‌లో బంగారు పతకాలు సాధించిన పి.చైత్ర దీపిక, కె.కైవల్యలు శనివారం విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో సిఎస్ డాక్టర్ కెఎస్ జవహర్‌రెడ్డిని కలిశారు. పోటీల్లో వారు సాధించిన బంగారు పతకాలు, ప్రశంసాపత్రాలను ఆయనకు చూపించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను సిఎస్ అభినందించారు. రానున్న రోజుల్లో మరింతగా రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించి మరెన్నో పతకాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. సిఎస్‌ను కలిసిన వారిలో స్కేటింగ్ కోచ్ పి.సత్యనారాయణ కూడా ఉన్నారు.

జెవిడి పథకాలకు జాయింట్ ఖాతా వద్దు

- ఫీజు బకాయిలు విడుదల చేయండి
- ఎస్ఎఫ్ఐ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన పథకాలకు విద్యార్థి, తల్లికి ఉమ్మడిగా బ్యాంక్ ఖాతా ఉండాలని రాష్ట్రప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్రకమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్ష కార్యదర్శులు కె ప్రసన్నకుమార్, ఎ అశోక్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యాదీవెన, వసతి దీవెన పథకాల ప్రారంభం నుంచి తల్లి ఖాతాలో నిధులు జమ చేస్తున్నారని తెలిపారు. ఇప్పుడు కొత్తగా విద్యార్థిని కూడా చేర్చి ఉమ్మడి ఖాతా తెరవడం వల్ల కొత్తగా వచ్చే ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వం విద్యాదీవెన పథకాన్ని నాలుగు దఫాలలో చెల్లిస్తామని చెప్పిందని, గత రెండేళ్లుగా నాల్గవ దఫా నిధులను విడుదల చేయడం లేదని తెలిపారు. వసతి దీవెన రూ.20వేలు ఇస్తామని రూ.10వేలే మాత్రమే ఇస్తున్నారని పేర్కొన్నారు. దీనివల్ల రాష్ట్రప్రభుత్వం దాదాపు రూ.1,600కోట్లు మిగుల్చుకుందని తెలిపారు.

కొత్తగా పెట్టిన నిబంధన కూడా పథకాల్లో కోతలు విధించేందుకే అని స్పష్టంగా అర్థమవుతోందని విమర్శించారు. పథకాలు అమలు చేయడంలో చిత్తశుద్ధి లేకుండా కోతలు విధించి నిధులు మిగుల్చుకునే కార్యక్రమం చేయడం సిగ్గుచేటని తెలిపారు. కొత్త నిబంధన వల్ల ప్రయోజనం లేకపోగా తీవ్ర నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉమ్మడి ఖాతా నిబంధనను రాష్ట్రప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని, పెండింగ్‌లో ఉన్న రూ.1600కోట్ల బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఆర్‌డబ్ల్యుఎస్‌కు నిధుల కొరత

- బకాయిలు కూడా విడుదల చేయని ప్రభుత్వం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు ఉద్దేశించి ఆర్‌డబ్ల్యుఎస్ శాఖకు నిధుల కొరత వెంటాడుతోంది. పాత బకాయిలను కూడా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయడం లేదు. దీంతో ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో ఆ శాఖ ఉద్యోగులు పడిపోయారు. గతంలో చేసిన పనులకు గానూ ఈ శాఖకు రాష్ట్ర ప్రభుత్వం నుండి 238 కోట్ల రూపాయలు రావాల్సిఉంది. ఆ మొత్తం ఇంతవరకు విడుదల చేయలేదు. ఈ ఏడాది నీటి సరఫరా పనుల కోసం కనీసం 95 కోట్ల రూపాయలు అవసరమవుతాయని అధికారులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఏప్రిల్ నెలలో లేఖ రాశారు. అయితే, ప్రభుత్వం మాత్రం పాత బకాయిల్లోంచి 75 కోట్ల రూపాయలు విడుదల చేసి ఏరుకుంది. మిగిలిన మొత్తాన్ని కూడా విడుదల చేయాలని ఎన్ని సార్లు కోరినా ఫలితం ఉండటం లేదు. ఇటీవల కరువు మండలాలను ప్రకటించారు.

కరువుతో సంబంధం లేకుండానే ప్రకాశం జిల్లా పొదిలిలో నీటి సమస్య తీవ్రంగా ఉంది.. ప్రభుత్వం డబ్బులు ఇవ్వకపోతే తామెక్కడ నుండి సరఫరా చేయాలని జిల్లా అధికారులూ రాష్ట్రం దృష్టికి తీసుకొచ్చారు. నీటి సరఫరా అంశాన్ని కలెక్టర్ల పరిధిలోకి మార్చామని, రాష్ట్రస్థాయి నుండి కొత్తగా ప్రతిపాదనలు పంపాల్సిన అవసరం లేదని గతంలోనే చెప్పామని ఉన్నతాధికారులు అంటున్నారు. మరోవైపు ప్రకృతి విపత్తుల నిర్వహణ సంస్థకే తాగునీటి సరఫరా బాధ్యత కూడా అప్పగించామనీ చెప్పినట్లు తెలిసింది. అయితే అక్కడి అధికారులుమాత్రం నీటి సరఫరా తమ పరిధిలోది కాదని తేల్చిచెబుతున్నారు. ఇటీవల పొదిలితోపాటు రాయలసీమలో పలు జిల్లాల్లోనూ సమస్య పెరుగుతున్నట్లు గుర్తించినట్లు గ్రామీణ నీటి పారుదల విభాగం అధికారులు చెప్పారు. శ్రీకాకుళం, కర్నూలు, కడప, అనంతపురం, ఎన్‌టిఆర్, పల్నాడు జిల్లాల్లో కొన్ని మండలాల్లో తాగునీటి సమస్య పెరుగుతోందని ఇటీవల జిల్లా అధికారులు గుర్తించినట్లు తెలిసింది. ఇప్పటికే ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్న ప్రాంతాలకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, ఆ బకాయిలు చెల్లించకపోతే ముందు ముందు సమస్య మరింత పెరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిధులు విడుదల చేస్తే సమస్య ఉండదని, లేనిపక్షంలో తాగునీటి సమస్య పెరుగుతుందని అధికారులు చెబుతున్నారు.

మద్యపాన నిషేధం అసాధ్యం : అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సంపూర్ణ మద్యపాన నిషేధం ఎవరి వల్ల సాధ్యం కాదని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు అన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే కల్తీ మద్యం నిషేధించి నాణ్యమైన మద్యం తక్కువ ధరకు లభించేలా చూస్తామని చెప్పారు. ఆ పార్టీ ఎమ్మెల్సీ అశోక్ బాబు, ఎన్ఆర్ఐ విభాగం నాయకులు కోమటి జయరాంతో కలిసి టిడిపి కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మద్యపాన నిషేధ హామీని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తుంగలో తొక్కారని విమర్శించారు.

జగన్ సాగించిన మద్యం దోపిడీపై న్యాయ విచారణ జరిపిస్తుందన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న నాసిరకం మద్యం వ్యాపారానికి కర్త, కర్మ, క్రియా జగన్ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మానిఫెస్టోను మత గ్రంథాలతో సమానమని చెప్పి అందులోని 30 హామీలను కూడా నెరవేర్చలేదని అన్నారు. ప్రభుత్వం అమ్ముతున్న నాసిరకం మద్యం వల్ల రాష్ట్రంలో 35 లక్షల మంది పేదలు తమ ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బతుకుతున్నారని తెలిపారు. కాలేయం, హృద్రోగ, ఊపిరితిత్తుల సంబంధిత సమస్యలతో అస్పత్రులపాలయ్యారని అన్నారు.

విజయసాయి అవినీతి చరిత్ర అందరికీ తెలుసు : వర్ల

రాష్ట్రంలో పులిలా వ్యవహరిస్తూ ఢిల్లీలో పిల్లిలా మారే వైసిపి ఎంపి విజయసాయిరెడ్డి అవినీతి చరిత్ర అందరికీ తెలుసు అని టిడిపి పొలిట్ బ్యూరోసభ్యులు వర్ల రామయ్య విమర్శించారు. చంద్రబాబు గురించి మాట్లాడే నైతిక హక్కు అతనికి లేదని అన్నారు. ఆదాని డిస్టలరీస్‌కు తనకు సంబంధం లేదని విజయసాయి చెప్పే ధైర్యం ఉందా అని ప్రశ్నించారు. దళిత, బిసి, మైనార్టీలపై సాగుతున్న దమనకాండకు వైసిపి నేతల దుర్మార్గాలకు జగన్ అండదండాలే కారణమని టిడిపి నాయకులు తెనాలి శ్రావణ్ కుమార్ విమర్శించారు.

ఆర్‌బిఐ మాజీ గవర్నర్ వెంకిటరమణన్ ఇకలేరు

న్యూఢిల్లీ : ఆర్‌బిఐ మాజీ గవర్నర్ వెంకిటరమణన్ కన్నుమూశారు. 92 ఏళ్ల వయసున్న ఆయన అనారోగ్య కారణంగా ఆదివారం ఉదయం తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆర్‌బిఐ 18వ గవర్నర్‌గా వెంకిటరమణన్ బాధ్యతలు నిర్వహించారు. 1990 డిసెంబర్ 22 నుంచి 1992 డిసెంబర్ 21 వరకూ ఆయన ఆ పదవిలో ఉన్నారు. దేశం తీవ్రమైన చెల్లింపుల సంక్షోభం ఎదుర్కొన్న సమయంలో ఆయన సమర్థవంతమైన సేవలందించారని ఆర్‌బిఐ పేర్కొంది. కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శిగా 1985 నుంచి 1989 వరకు ఆయన పనిచేశారు. ఆర్‌బిఐ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టడానికి ముందు కర్ణాటక ప్రభుత్వ సలహాదారుగా కూడా విధులు నిర్వహించారు. ట్రావెన్‌కోర్ సంస్థానంలో భాగమైన నాగర్‌కోయిల్‌లో 1931లో ఆయన జన్మించారు. ఆయన తిరువనంతపురం యూనివర్సిటీలో చదువుకున్నారు. ఆ సమయంలో స్టూడెంట్స్ ఫెడరేషన్‌లో క్రియాశీలంగా పనిచేశారు. తమిళనాడు మాజీ ప్రధాన కార్యదర్శి గిరిజా వైద్యనాథన్, సుధా ఆయన కుమార్తెలు.

కెటిఆర్‌ను సిఎం చేయాలనుకున్నది వాస్తవం

- ప్రయివేటు సంభాషణను మోడీ బహిర్గతం చేయడం సమంజసమా..?
- సిఎం కెసిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తన కుమారుడు, మంత్రి కెటిఆర్‌ను ముఖ్యమంత్రి చేయాలనుకున్నది వాస్తవమేనని తెలంగాణ సిఎం కెసిఆర్ అన్నారు. ఇదే విషయాన్ని ప్రధానమంత్రి మోడీకి తెలియజేసి కెటిఆర్‌ను ఆశీర్వదించాలని తాను కోరానని చెప్పారు. సిఎం కెసిఆర్ ఇటీవల ఓ జాతీయ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలపై స్పష్టతనిచ్చారు. తన కుమారుడు కెటిఆర్‌ను సిఎం చేయాలని, అందుకు సహకరించాలని ప్రధాని మోడీని కోరింది వాస్తవమేనని సిఎం కెసిఆర్ అంగీకరించారు. ప్రయివేట్‌గా మాట్లాడిన సంభాషణను ప్రధాని స్థాయి వ్యక్తి బహిర్గతం చేయడం ఎంతవరకు సమంజసం..? అని ప్రశ్నించారు. ప్రధానిగా మోడీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆయన మాటలు నమ్మి పలు సందర్భాల్లో మద్దతిచ్చామన్నారు. ఎన్‌డిఎ కూటమిలో చేరాలని మోడీ తనను అడిగారనీ, తెలంగాణకు మంచి చేయడం తర్వాత ఆలోచిస్తామని చెప్పినట్లు తెలిపారు. కెటిఆర్‌ను సిఎం చేయడానికి సహకరించాలని కెసిఆర్ తనను కోరినట్లు ఈనెల ఏడున హైదరాబాద్‌లో బిజెపి నిర్వహించిన బహిరంగ సభలో మోడీ వ్యాఖ్యానించారు. మోడీ వ్యాఖ్యలను కెటిఆర్‌తో సహా పలువురు మంత్రులు తీవ్రంగా ఖండించారు. నాకు పదవి రావాలంటే మోడీ ఆశీర్వాదం ఎందుకు..? అని కెటిఆర్ ప్రశ్నించారు. అప్పుడు కూడా అసలు విషయం చెప్పని కెసిఆర్..ఇప్పుడు మోడీ చెప్పింది వాస్తవమేనని ప్రకటించడంతో కెటిఆర్‌తో పాటు బిఆర్ఎస్ ముఖ్య నేతలు డిఫెన్స్‌లో పడినట్లయింది.

అరెస్టయిన రెండేళ్ల తర్వాత కాశ్మీరీ జర్నలిస్ట్‌కు బెయిల్

న్యూఢిల్లీ : అరెస్టు చేసిన దాదాపు రెండేళ్ల తర్వాత కాశ్మీరీ జర్నలిస్టు ఫహద్ షాకు శుక్రవారం జమ్మూ కాశ్మీర్ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. తన డిజిటల్ మేగజైన్‌లో 2011లో ప్రచురించిన వ్యాసం 'దేశ ద్రోహానికి' సంబంధించినదంటూ పోలీసులు షాపై తీవ్రవాద అభియోగాలు మోపారు. 'బానిస సంకెళ్లు ఛేదించాలి' శీర్షికతో ఆ వ్యాసం ప్రచురితమైంది. ఆ మేగజైన్ ఇప్పుడు మూతపడింది కూడా. కాశ్మీరీ యూనివర్శిటీకి చెందిన స్కాలర్ ఆలా ఫాజిలిని ఈ కేసులో అరెస్టు చేశారు. 2022 ఏప్రిల్ 4న జమ్మూలోని సిఐజె పోలీసు స్టేషన్‌లో జమ్మూ కాశ్మీర్ దర్యాప్తు సంస్థ ఈ కేసు నమోదు చేసింది. మేగజైన్‌లో వ్యాసం ప్రచురితమైన 11 సంవత్సరాల తర్వాత ఈ కేసు నమోదు చేశారు. గతేడాది మార్చిలో చార్జిషీట్ దాఖలు చేశారు. షాపై నమోదైన ప్రజా భద్రతా చట్టం (పిఎస్ఎ)ను ఈ ఏడాది ఏప్రిల్‌లో హైకోర్టు కొట్టివేసింది. జమ్ము కాశ్మీర్ యంత్రాంగం ఆయనపై చేసిన ఆరోపణలు ఊహాజనితంగా వున్నాయని, పైగా అస్పష్టంగా, అరకొరగా వున్నాయని వ్యాఖ్యానించింది. పైగా షా యొక్క రాజ్యాంగబద్ధమైన,చట్టబద్ధమైన హక్కులను అధికారులు లాగేసుకున్నారని వ్యాఖ్యానించింది.

కర్ణాటకలో ఎస్‌సిలపై దాడి కేసులో 10 మందికి జైలు

బెంగళూరు : అగ్రవర్ణాల వ్యక్తులపై ఫిర్యాదు చేసినందుకు గానూ ఎస్‌సిలపై దాడిచేసినందుకు 10మంది వ్యక్తులకు రెండు మాసాల నుండి ఏడాదివరకు జైలు శిక్ష విధిస్తూ కర్ణాటక హైకోర్టు తీర్పు చెప్పింది. తుముకూరు జిల్లాలోని దుండా గ్రామానికి చెందిన నిందితులందరినీ 2011లో ట్రయల్ కోర్టు నిర్దోషులుగా విడిచిపెట్టింది. దిగువ కోర్టు ఇచ్చిన తీర్పును తోసిపుచ్చుతూ హైకోర్టు, సానుభూతి చూపాల్సిందిగా నిందితుడు చేసిన వాదనను తిరస్కరించింది. ఎలాంటి సమర్థనీయమైన కారణమూ లేకుండానే నిందితుడు హరిజన్ కాలనీలోకి ప్రవేశించాడని, ఫిర్యాదుదారుడు, మరో ఇద్దరిపై విచక్షణారహితంగా దాడులు చేశారని కోర్టు పేర్కొంది. ఒకటవ నెంబరు నిందితుడుపై ఫిర్యాదు చేయడానికి వారు పోలీసుల వద్దకు వెళ్లడమే కారణమని పేర్కొంది. డిఆర్ సుదీప్‌పై పోలీసులు ఫిర్యాదు నమోదు చేశారు. ఎస్‌సిలైనప్పటికీ అగ్రవర్ణాలపై ఫిర్యాదు చేయడానికి వెళ్లేంత ధైర్యం వచ్చిందా? అంటూ వారిపై దాడి చేశారని కోర్టు పేర్కొంది. తుముకూరు మూడవ అదనపు సెషన్స్ కోర్టు ఇచ్చిన తీర్పును జస్టిస్ జె.ఎం.ఖాజి కొట్టివేశారు. మొత్తంగా ఈకేసులో 11మంది నిందితులుండగా, విచారణా సమయంలోనే ఒక వ్యక్తి మరణించాడు. 2008లో లక్ష్మమ్మ వీరిపై తొలుత ఫిర్యాదు చేసింది. తమ కులం పేరు చెప్పి మరీ దూషించారని, పైగా తమపై రాళ్లు, కర్రలతో దాడికి దిగారని, అనేకమందికి నెత్తురోడేలా గాయాలయ్యాయని పేర్కొంది. 2011 జూన్ 23న నిందితులందరినీ నిర్దోషులుగా పేర్కొంటూ ట్రయల్ కోర్టు విడిచిపెట్టింది. రాష్ట్ర ప్రభుత్వం అప్పీల్ చేయలేదు. తమకు జరిగిన అన్యాయంపై బాధితురాలు లక్ష్మమ్మ హైకోర్టును ఆశ్రయించారు.

మెగా డిఎస్‌సి ప్రకటించాలి

- డివైఎఫ్ఐ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో నిరుద్యోగులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న మెగా డిఎస్‌సి నోటిఫికేషన్‌ను తక్షణమే విడుదల చేయాలని డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఫెడరేషన్ అధ్యక్ష కార్యదర్శులు జి రామన్న, వై రాము శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో 6 లక్షలకు పైగా నిరుద్యోగులు బిఇడి, డిఎడ్ పూర్తిచేసి శిక్షణ కేంద్రాల్లో ఏళ్ల తరబడి నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 25 వేల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. అధికారంలోకి వచ్చిన ఐదేళ్లల్లో ఒక్క డిఎస్‌సి నోటిఫికేషన్‌ను కూడా జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ఇవ్వలేదని విమర్శించారు. ఖాళీలతో సంబంధం లేకుండా విద్యాశాఖమంత్రి నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. పార్లమెంట్‌లో చెప్పిన లెక్కల ప్రకారం రాష్ట్రంలో 40 వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పారని పేర్కొన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో 8 వేలకు పైగా ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయని తెలిపారు. 1.88 లక్షల ఉపాధ్యాయులు అవసరం కాగా ఇప్పుడు కేవలం 1.69 లక్షల మంది మాత్రమే పనిచేస్తున్నారని వివరించారు. జనవరిలో వేలాది మంది ఉపాధ్యాయులు పదవి విరమణ పొందుతున్నారని తెలిపారు. రేషనలైజేషన్ పేరుతో 10 వేల ఉపాధ్యాయ పోస్టులను ప్రభుత్వం రద్దు చేసిందని విమర్శించారు. తెలుగు మీడియం తీసివేసి మరో 15 వేల ఉపాధ్యాయ పోస్టులను రద్దు చేసిందని పేర్కొన్నారు. నూతన విద్యావిధానం-2020 పేరుతో 5 వేల పాఠశాలలను ప్రభుత్వం మూసివేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుద్యోగులు పట్ల ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా వెంటనే మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. లేదంటే నిరుద్యోగులతో కలిసి ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

గురజాలలో టిడిపి సానుభూతిపరుడు దారుణ హత్య

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి/ అమరావతి బ్యూరో

పల్నాడు జిల్లా గురజాల మండలం కొత్త అంబాపురం గ్రామంలో శనివారం దారుణ హత్య జరిగింది. టిడిపి సానుభూతిపరుడు పత్తి రామారావు (73)ను ఆయన ఇంట్లోనే గుర్తు తెలియని వ్యక్తులు అతి కిరాతకంగా గొంతు కోసి హత్య చేశారు. ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలోనే ఈ దారుణానికి ఒడిగట్టారు. రామారావు ఈ మధ్యనే కొత్త అంబాపురం మెయిన్ రోడ్డు వద్ద ఇల్లు కట్టుకుని జీవిస్తున్నారు. ఆయన కుమారుడు అమెరికాలో ఉద్యోగం చేస్తున్నారు. ఆస్తి తగాదాలే ఈ హత్యకు కారణంగా పోలీసులు భావిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లోకేష్ ఖండన

రామారావు హత్యను టిడిపి జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేష్ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పల్నాడును సస్యశ్యామలం చేయడమంటే రక్తం పారించడమా అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఉద్దేశించి ఆయన ప్రశ్నించారు. రామారావును వైసిపి రౌడీ మూకలే దారుణంగా హత్య చేశారని ఆరోపించారు.

పొందూరు పిఎంసి మాజీ చైర్మన్ ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి- పొందూరు (శ్రీకాకుళం జిల్లా)

నాడు -నేడు పనులకు సంబంధించిన బిల్లులను చెల్లించకపోవడంతో శ్రీకాకుళం జిల్లా పొందూరు ఉన్నత పాఠశాల మానటరింగ్ కమిటీ మాజీ చైర్మన్ శనివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. బాధిత కుటుంబసభ్యుల వివరాల మేరకు.. పొందురూ ఉన్నత పాఠశాలకు నాడు-నేడు ఫేజ్-1లో రూ.1.53 కోట్లు మంజూరయ్యాయి. ఈ పనులను పాఠశాల మానటరింగ్ కమిటీ మాజీ చైర్మన్ హేమలత చేపట్టారు. ఇటీవల పాఠశాల మానటరింగ్ కమిటీ సమావేశాన్ని చైర్మన్‌కు తెలియకుండా నిర్వహించారు. ఈ సమావేశంలో హేమలతను తొలగించి, వేరే వారిని ఎన్నుకున్నారు. నాడు-నేడు పెండింగ్ బిల్లులు చెల్లించాలని, పదవి నుంచి తనను తొలగించడాన్ని ప్రశ్నిస్తూ ప్రధానోపాధ్యాయులు వెంకటరావును ఆమె నిలదీశారు. సరైన సమాచారం ఇవ్వకుండా తనను అవమానించారని పాఠశాల ఆవరణంలోనే హేమలత నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గమనించిన తోటి ఉపాధ్యాయులు ఆమెను హుటాహుటినా జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. అప్పులు చేసి పనులు చేశామని, బిల్లులు చెల్లించకపోవడంతో మనస్తాపం చెంది ఆత్మహత్యాయత్నానికి పాల్పడాల్సి వచ్చిందని మీడియాతో మాట్లాడుతూ బాధితురాలు కన్నీటిపర్యంతమయ్యారు.

లోక్‌సభలో పెండింగ్‌లో 713 ప్రైవేట్ బిల్లులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

లోక్‌సభలో 713 ప్రైవేట్ మెంబర్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిలో చాలా వరకు శిక్షాపరమైన నిబంధనలు, ఎన్నికల చట్టాలను సవరించాలని కోరుతూ బిల్లులు ఉన్నాయి. పార్లమెంటరీ ఎన్నికల తరువాత ప్రస్తుత లోక్‌సభ ఏర్పడిన జూన్ 2019లో ఈ బిల్లుల్లో చాలా వరకు ప్రవేశపెట్టగా, కొన్నింటిని ఈ ఏడాది ఆగస్టులో పార్లమెంట్ వర్షాకాల సమావేశాల సందర్భంగా ప్రవేశపెట్టారు. ప్రైవేట్ మెంబర్ బిల్లులు ఎంపీలు వారి వ్యక్తిగత హోదాలో ప్రవేశపెట్టినవి. ఒక ప్రైవేట్ బిల్లును తీసుకురావడం లక్ష్యం కొత్త చట్టాలను ప్రవేశపెట్టాలని, ప్రస్తుత చట్టాలలో అవసరమైన మార్పులను తీసుకోవాలని సూచించడం వంటివి ఉంటాయి. శుక్రవారం విడుదల చేసిన లోక్‌సభ బులెటిన్ ప్రకారం, లోక్‌సభలో 713 బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ బిల్లులు ఏకరూప సివిల్ కోడ్ తీసుకురావడం, లింగ సమానత్వం, వాతావరణ మార్పు, వ్యవసాయం, ప్రస్తుత క్రిమినల్, ఎన్నికల చట్టాలకు సవరణలు, రాజ్యాంగ నిబంధనలను సవరించడం వంటి అంశాలతో ఉన్నాయి. పార్లమెంట్ సమావేశాలు జరిగినప్పుడు శుక్రవారాల్లో మధ్యాహ్నం ఎంపిలు లోక్‌సభతో పాటు రాజ్యసభలోనూ ప్రైవేట్ మెంబర్ బిల్లులు, తీర్మానాలను ప్రవేశపెట్టడానికి, చర్చించడానికి కేటాయించబడుతుంది. ప్రైవేట్ మెంబర్ బిల్లుపై చర్చ ముగిసిన తరువాత, సంబంధిత మంత్రి స్పందించి, దానిని ఉపసంహరించుకోవాలని సభ్యుడిని అభ్యర్థిస్తారు. చాలా అరుదుగా ప్రైవేట్ మెంబర్ బిల్లు ఓటింగ్‌కు వెళ్తుంది. ఇప్పటి వరకు రెండు మూడు సందర్భాల్లోనే ప్రైవేట్ మెంబర్ బిల్లుపై ఓటింగ్ జరిగింది.

నేలలో జీవశక్తికి ప్రకృతి వ్యవసాయమే మార్గం

- టి. విజయ్‌కుమార్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సహజ సూక్ష్మ జీవుల పరిరక్షణ కోసం నేలలో జీవశక్తిని పెంచాలంటే ప్రకృతి వ్యవసాయమే ఏకైక మార్గమని రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ టి. విజయ్ కుమార్ పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయంపై జిల్లా మహిళా సమాఖ్యల పదాదికారులు (ఆఫీస్‌బేరర్స్)కు విజయవాడలోని సెర్ప్ కార్యాలయంలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ రసాయనాలతో వ్యవసాయం చేయడం వల్లే భవిష్యత్తు తరాల మనుగడ ప్రమాదంలో పడుతోందన్నారు. పంచాయతీ రాజ్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రకృతి వ్యవసాయం దోహదపడుతుందన్నారు. రైతు సాధికారిక సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు బి.రామారావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శామ్యూల్ ఆనంద్ సెర్ప్ అదనపు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు వియకుమారి తదితరులు మాట్లాడారు.

ఎసిబి వలలో నలుగురు అధికారులు

(మొదటి పేజీ తరువాయి)

స్థిర, చరాస్తులు బయటపడ్డాయి. హైదరాబాద్, మార్కాపురం, బనగానిపల్లి, నంధ్యాల, కర్నూలులో ఎట నివాసంతో పాటు మరో ఆరుచోట్ల సోదాలు నిర్వహించారు. కోటి రూపాయలకుపైగా ఆస్తులు ఉన్నట్లు గుర్తించారు.

కాకినాడ జిల్లా బెండపూడి ఆర్‌టిఎ చెక్‌పోస్టులో మోటారు వెహికల్ ఇనెస్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న పెసరమిల్లి రమేష్‌బాబుపై ఎసిబి సోదాలు నిర్వహించింది. ఈయనకు 17 ప్రాంతాల్లో స్థిరాస్తులు ఉన్నట్లు గుర్తించారు. హైదరాబాద్, మెదక్, కంచికచర్ల, విజయవాడ, గుడివాడ, కనుమోలు ప్రాంతాల్లో భూములు, 11 ఇంటి స్థలాల ప్లాట్లు, 2 నివాస గృహాలు, 2 వాణిజ్యదుకాణాలు ఉన్నట్లు గుర్తించారు. మొత్తంగా రూ.20 కోట్లకు పైగా ఆస్తులు వున్నట్లు గుర్తించారు. ఇవి కాకుండా కోటి విలువైన చరాస్తులు ఉన్నట్లు తేల్చారు. వీరుకాకుండా కాకినాడ జిల్లా సామర్లకోట మండలానికి చెందిన ఆర్ఐ ప్రైవేటు అసిస్టెంట్ రమణ అలియాస్ చిన్నారావు బర్త్ సర్టిఫికేట్ కోసం పది వేల రూపాయలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు.

కులవివక్షతో కూడిన నోటిఫికేషన్ రద్దుచేయాలి

- కెవిపిఎస్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తిరుమల ప్రసాదాల తయారీలో కులవివక్ష పాటించడం న్యాయం కాదని, తక్షణం టిటిడి విడుదల చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నల్లప్ప, ఆండ్ర మాల్యాద్రి తెలిపారు. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. తిరుమల పోటులో వైష్ణవ బ్రాహ్మణులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని టిటిడి నోటిఫికేషన్ ఇవ్వడం సరైంది కాదని తక్షణమే రద్దు చేయాలని కోరారు. రామానుజాచార్యులు విశిష్టాద్వైతంతో తిరుమల ఆలయ వ్యవస్థను నడిపారని, కులాలకు అతీతంగా వ్యవహరించిన తీరుకు భిన్నంగా టిటిడి ఫలానా కులం వారే ప్రసాదాలు తయారు చేయాలని ఇతర కులాలను అవమానించడం సరికాదని పేర్కొన్నారు. ఇది మనువాద మతోన్మాద కులాంకార చర్యని విమర్శించారు. గతంలో ఐవైఆర్ కృష్ణారావు ఇలాంటి ప్రకటన ఇచ్చారని, ఇది తీవ్ర వివాదం అయిందని తెలిపారు. వైష్ణవ బ్రాహ్మణులు పోటులో ప్రసాదం తయారు చేస్తే ఇతర బ్రాహ్మణులు దాన్ని గేటు వరకూ తరలిస్తున్నారని, అక్కడ బరువైన ప్రసాదాల ట్రేలను దళితులతో మోయిస్తున్నారని పేర్కొన్నారు. టిటిడి బోర్డు ఈ నోటిఫికేషన్‌ను వెంటనే ఉపసంహరించుకునేలా దేవాదాయ, ధర్మాదాయశాఖ ఉత్తర్వులు ఇవ్వాలని వారు డిమాండు చేశారు.

రబీకి నీరివ్వలేం

- వర్షాభావ పరిస్థితులే కారణం
- ఆరుతడి పంటలకు రాయితీపై విత్తనాలు
- కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల నీటిపారుదల, వ్యవసాయ సలహా మండళ్ల సమావేశంలో కలెక్టర్లు

సలహా మండలి సమావేశంలో మాట్లాడుతున్న ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

ప్రజాశక్తి - విజయవాడ

వర్షాభావ పరిస్థితులు, రిజర్వాయర్లలో నీటి లభ్యత లేకపోవడం, తాగునీటి అవసరాల దృష్ట్యా కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల్లో రబీ పంటలకు సాగునీరు అందించలేమని ఆయా జిల్లాల కలెక్టర్లు ఎస్.ఢిల్లీరావు, పి.రాజాబాబు తెలిపారు. ప్రత్యామ్నాయంగా రైతులు ఆరుతడి పంటలు వేయాలని, ఇందుకు అవసరమైన విత్తనాలను రాయితీపై రైతులకు అందిస్తామని తెలిపారు. కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల నీటిపారుదల, వ్యవసాయ సలహా మండళ్ల సమావేశం విజయవాడలోని రైతు శిక్షణా కేంద్రంలో ఉభయ జిల్లాల కలెక్టర్లు, కమిటీ చైర్మన్లు అయిన ఢిల్లీరావు, రాజాబాబు అధ్యక్షతన శనివారం జరిగింది. కృష్ణానది పరీవాహక ప్రాంతంలో నీటి లభ్యత, రైతులకు అందించాల్సిన సహాయ సహకారాలపై చర్చించారు. అనంతరం మీడియా ప్రతినిధులతో ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ.. వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా కృష్ణానదీ ఎగువన ఉన్న రిజర్వాయర్లలో నీటి నిల్వలు తగినంత లేవన్నారు. ఈ నేపథ్యంలో ఎగువ ప్రాంతం నుంచి దిగువకు సాగునీటిని విడుదలచేసే అవకాశం ఉండదని తెలిపారు. నాగార్జున సాగర్‌లో 26 టిఎంసిల నీరు మాత్రమే నిల్వ ఉందని, ఇందులో 5 టిఎంసిలు కుడి, ఎడమ కాల్వల ద్వారా తాగునీటి అవసరాలకు ఉపయోగించాల్సి ఉందన్నారు. ఈ నేపథ్యంలో రైతులు రబీ పంటల సాగు చేపట్టవద్దని సూచించారు. కృష్ణా జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు మాట్లాడుతూ.. రబీ కార్యాచరణ ప్రణాళిక ప్రకారం కృష్ణా వాటర్ బోర్డు ఆమోదించిన విధంగా కృష్ణా డెల్టాకు 151.20 టిఎంసిల నీటిని కేటాయించినట్లు తెలిపారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా కృష్ణానది పరీవాహక ప్రాంతంలో నీటి లభ్యత లేదన్నారు. దీంతో ఆమోదించిన నీటిని విడుదల చేయలేకపోతున్నామని ప్రకటించారు. ప్రస్తుత పరిస్థితుల దష్ట్యా కాల్వల ద్వారా కేవలం తాగునీటి అవసరాలకు మాత్రమే నీటిని విడుదల చేయగలమని తెలిపారు. సమావేశంలో విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణువర్ధన్, ఎన్‌టిఆర్ జిల్లా జెసి డాక్టర్ పి.సంపత్ కుమార్, విజయవాడ నీటిపారుదల సర్కిల్ పర్యవేక్షక ఇంజనీర్ టిజిహెచ్.ప్రసాద్‌బాబు, ఇఇ కృష్ణారావు, ఎన్‌టిఆర్, కృష్ణా జిల్లాల వ్యవసాయాధికారులు, ఎస్.నాగమణెమ్మ, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి రథోత్సవంలో పాల్గొన్న మేనేజింగ్ ట్రస్టీ రత్నాకర్, ప్రజాప్రతినిధులు

సత్యసాయి 98వ జయంతి ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

శ్రీ సత్యసాయి సాయిబాబా 98వ జయంతి ఉత్సవాలు శనివారం పుట్టపర్తిలో ప్రారంభమయ్యాయి. సాయికుల్వంత్‌హాలులో ట్రస్టు సభ్యుల ఆధ్వర్యంలో వేడుకలను సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ రత్నాకర్ ప్రారంభించారు. జయంతి ఉత్సవాల్లో భాగంగా వేణుగోపాలస్వామి రథోత్సవాన్ని నిర్వహించారు. రథయాత్రలో నృత్యాలు, వేషధారణలు, కోలాటం, చెక్కభజన, గురవయ్యలు, కీలుగుర్రాలు, తదితర ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వేణుగోపాలస్వామి ఆలయం నుంచి వేణుగోపాలస్వామి ఉత్సవ విగ్రహాన్ని సత్యసాయి విద్యార్థులు తిరిగి సాయి కుల్వంత్ హాలుకు తీసుకెళ్లారు. రథోత్సవంలో దేశ, విదేశీ యాత్రికులతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులతో పాటు ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, మాజీమంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి, సత్యసాయి ట్రస్ట్ సభ్యులు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, యాత్రికులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఓట్లను పునరుద్ధరించకుంటే ఆమరణ నిరాహార దీక్ష

- తెలుగు శక్తి అధ్యక్షులు బివి.రామ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

గల్లంతైన తమ ఓట్లను పునరుద్ధరించకపోతే ఆమరణ నిరాహార దీక్షకు దిగుతానని తెలుగు శక్తి అధ్యక్షులు బివి.రామ్ హెచ్చరించారు. శనివారం పాత వెంకోజీపాలెంలోని ఎంవివి ప్రెసిడెన్సీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖ తూర్పు నియోజకవర్గంలో తన ఓటు, తన తల్లిదండ్రుల ఓట్లుతో పాటు మొత్తం 40 వేల ఓట్లు గల్లంతయ్యాయంటూ నేపథ్యంలో రెండు రోజుల క్రితం జిల్లా కలెక్టర్‌ను కలిసినట్టు తెలిపారు. కొందరు అధికారులు తమ ఇంటికి వచ్చి గరుడ యాప్‌లో సాంకేతిక కారణాలవల్ల ఓట్ల తొలగింపు జరిగిందని తెలిపారన్నారు. ఫారం 6 ద్వారా మళ్లీ కొత్తగా ఓటు హక్కు నమోదు చేసుకోవాలని సూచిస్తే తాను నిరాకరించినట్లు తెలిపారు. తనకు కొత్తగా ఓటు అవసరం లేదని, తనకున్న పాత ఓటునే పునరుద్ధరించాలని, లేదంటే డెత్ సర్టిఫికెట్ ఇవ్వాలని తాను చెప్పగా వారంతా వెనుదిరిగారన్నారు. గరుడ యాప్ విషయం ఏమిటో నిగ్గు తేలాల్సిన అవసరం ఉందని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ భారీ సంఖ్యలో ఓట్లు గల్లంతయిన నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం దృష్టి సారించాల్సిన అవసరముందన్నారు. ఓట్ల తొలగింపులో బాధ్యులైన అధికారులను జైలుకు పంపించాలని డిమాండ్ చేశారు. విశాఖ తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో అక్రమాలను సహించేది లేదని అన్నారు.

చెరువుల వినియోగంపై సర్వే

- ప్రణాళిక, రెవెన్యూ శాఖల నిర్వహణ

తాడేపల్లిలో చెరువును పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సాగు, తాగునీటి చెరువులపై ప్రభుత్వం సర్వే చేయిస్తోంది. ఈ నెల ఒకటో తేదీ నుంచి ఈ ప్రక్రియ ప్రారంభమైంది. ప్రధానంగా చెరువు మొత్తం విస్తీర్ణం, ఆక్రమణలు, నీటి నిల్వకు ఉన్న అవకాశాలు, నీటిని ఏయే అవసరాలకు వినియోగిస్తున్నారు? ఎంతమంది రైతులు, ప్రజలు ఈ నీటిని వినియోగించు కుంటున్నారు? అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై రాష్ట్ర రెవెన్యూ, ప్రణాళిక శాఖల ఆధ్వర్యంలో ఈ సర్వే జరుగుతోంది. ఈ నెలాఖరు వరకు ఇది కొనసాగనుంది. ఈ చెరువులను మూడు భాగాలుగా విభజించారు. తటాకం/చెరువు, ఊట చెరువు, చెక్ డ్యామ్‌లను వేర్వేరుగా నమోదు చేయనున్నారు. ఏ శాఖ పరిధిలో వీటిని నిర్వహిస్తున్నారు? ప్రభుత్వ, ప్రయివేటు వ్యక్తుల పరిధిలో ఉన్న వాటి వివరాలు కూడా నమోదు చేస్తున్నారు. ప్రధానంగా నీటిపారుదల శాఖ, సహకార సంఘం, పంచాయతీ, పురపాలక సంఘం, ప్రభుత్వ ఏజెన్సీ, వ్యక్తిగతంగా నిర్వహణ, వ్యక్తుల సముదాయం, ఇతర ప్రయివేటు సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న జలాశయాలను వేర్వేరుగా నమోదు చేస్తారు. సాగునీటికి వినియోగిస్తున్నారా? లేక ఇతర అవసరాలకు వినియోగిస్తున్నారా? నీటిపారుదల, పారిశ్రామిక, మత్స్య ఉత్పత్తి, గృహలకు తాగునీటి అవసరాలు, వినోదానికి, మతపరమైన, భూగర్భ జలాల పెంచేందుకు, ఇతర అవసరాలను కూడా నమోదు చేయాలని ప్రభుత్వం మార్గదర్శకాల్లో పేర్కొంది. సాగు నీటికి వినియోగిస్తే ఎంత ఆయకట్టు, ఏయే పంటలు పండిస్తున్నారు? వివరాలు సేకరిస్తున్నారు. వినియోగించకపోతే కారణాలు కూడా నమోదు చేయాలని సూచించారు. ఎండిపోవడం, చెరువు స్థలంలో నిర్మాణాలు పెరగడం, పూడిక తీయకపోవడం, మరమ్మతులు చేయడానికి వీలులేకపోవడం, పారిశ్రామిక వ్యర్థాలు కలవడం, ఉప్పునీరు చేరడం తదితర కారణాల వల్ల వినియోగంలో లేకపోతే ఆ వివరాలు నమోదు చేయాలి. చెరువు నిర్మాణ స్వరూపం, మట్టి కట్టలు, సిమెంట్ సైడ్ వాల్స్, కాంక్రీట్ నిర్మాణం తదితర వివరాలు నమోదు చేస్తున్నారు. చెరువులు పునర్ నిర్మించిన పరిస్థితి, ఎప్పటి నుంచి వినియోగించకుండా నిరుపయోగంగా ఉంచారో వివరాలు నమోదు చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. తాగునీటి చెరువుల కింద ఉన్న గ్రామాల సంఖ్య, ప్రజల సంఖ్య, చెరువులపై ఉన్న ఆక్రమణలు, గట్ల పరిస్థితి, నీటి వనరులను ఎక్కడి నుంచి తీసుకుంటున్నారు? ప్రధాన నదులు, భారీ జలాశయాల ద్వారా నీరు వస్తున్న తీరు తదితర వివరాలను కూడా నమోదు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

కరువుపై ప్రభుత్వానికి చిత్త శుద్ధి లేదు : సిపిఐ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

రాష్ట్రంలో నెలకొన్న కరువుపై రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. కేంద్రానికి కరువు నివేదికలు పంపాలని డిమాండ్ చేశారు. నంద్యాలలో ఎపి మహిళా సమాఖ్య రాష్ట్ర మహాసభకు వచ్చిన ఆయన శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలోని 446 మండలాల్లో కరువు ఉంటే కేవలం 103 మండలాలనే ప్రకటించడం దారుణమని తెలిపారు. రాష్ట్రంలో కరువు లేదని వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి ప్రకటించడం సిగ్గుచేట న్నారు. శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టులలో నీళ్లు అడుగంటాయని తెలిపారు. రాష్ట్రంలో వలసలను నివారించి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాల్సింది పోయి కరువుపై అవాకులు, చవాకులు పేలడం దారుణమన్నారు. ఛీఫ్ సెక్రటరీ, ప్రిన్సిపల్ సెక్రటరీలు కరువు నివేదికలు సిద్ధం చేసి కేంద్రానికి పంపడానికి వెనుకడుగు వేయడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. కరువుపై ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఈ నెల 20, 21న విజయవాడలో 30 గంటల నిరసన ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. నూజివీడు భూముల పట్టాల పంపిణీలో జగన్‌మోహన్‌రెడ్డే భూములు పంచి పట్టాలు ఇచ్చినట్లు గొప్పలు చెప్పుకుంటున్నారని, జగన్ పార్టీ, ఆయన పుట్టకముందే కమ్యూనిస్టులు పోరాటాలు చేసి సాధించుకున్న భూములను పేదలకు పంచి పట్టాలు ఇప్పించిన విషయాన్ని గుర్తు చేశారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రామాంజనేయులు, నంద్యాల జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు, పట్టణ కార్యదర్శి ప్రసాద్ పాల్గొన్నారు.

సంఘటిత పోరాటాలతోనే హక్కులు సాధ్యం

- సంప్రదాయం, కట్టుబాట్ల పేరుతో శ్రమ దోపిడీ
- ఎపి మహిళా సమాఖ్య మహాసభలో రమాదేవి

సౌహార్ద సందేశం ఇస్తున్న రమాదేవి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

సమాజంలో మహిళల పట్ల హింస, అగాయిత్యాలు, శ్రమ దోపిడీ పెరిగిపోతున్నాయని వాటిని అరికట్టాలంటే సంఘటిత పోరాటాలతోనే సాధ్యమని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి అన్నారు. నంద్యాలలో జరుగుతున్న ఎపి మహిళా సమాఖ్య రాష్ట్ర 15వ మహాసభలో శనివారం ఆమె సౌహార్ద సందేశం ఇచ్చారు. తన మనుగడ కోసం సామ్రాజ్యవాద కాంక్షతో ప్రపంచ వ్యాప్తంగా యుద్ధాలను అమెరికా ప్రేరేపిస్తోందన్నారు. అందుకు గాజా, ఉక్రెయిన్ యుద్ధాలే నిదర్శనమని తెలిపారు. భారతీయ గణంకాల ప్రకారం మహిళలు చేస్తున్న పనిని 82 శాతం లెక్కించడం లేదన్నారు. ఒక్కసారి మహిళలు సమ్మె చేస్తే వారి విలువ ప్రభుత్వాలకు తెలుస్తుందని తెలిపారు. మహిళలు బలహీనులంటూ బిజెపి ప్రభుత్వం సంప్రదాయ భావజాలన్నీ పెంచుతోందని విమర్శించారు. స్త్రీలు మగవారి కంటే తక్కువ అని సనాతన ధర్మం చెబుతోందని, కులాల మధ్య తక్కువ, ఎక్కువ అని తేడాలు చూపిస్తున్న అలాంటి సనాతన ధర్మాన్ని మహిళా లోకం తిరస్కరించాలన్నారు. అంబేద్కర్ రాజ్యాంగాన్ని అమలు చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. మహిళల్లో చైతన్యం పెరుగుతుంది కాబట్టే కేంద్ర ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ల చట్టం చేస్తుందని తెలిపారు. ప్రశ్నించడం నేర్చుకోవాలని, హక్కుల కోసం మహిళా సంఘాలు ఐక్యంగా ఉద్యమించాలని కోరారు. మహాసభకు ఎపి మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు జయలక్ష్మి అధ్యక్షత వహించారు. ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు ఎపి మహిళా సమాఖ్య జాతీయ నాయకులు వనజ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గభవాని, వర్కింగ్ ప్రెసిడెంట్ అత్తిలి విమల, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఖనిజ సంపదను దోచుకుంటున్న సిఎం : బిజెపి

ప్రజాశక్తి- కడియం

ఉభయ గోదావరి జిల్లాల్లో సహజ సిద్ధంగా లభిస్తున్న ఖనిజ సంపదను సిఎం జగన్‌మోహన్‌రెడ్డి అక్రమంగా దోచుకుపోతున్నారని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు దగ్గుపాటి పురందేశ్వరి ఆరోపించారు. తూర్పు గోదావరి జిల్లా కడియం మండలం బుర్రిలంకలోని ఇసుక ర్యాంపులను జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు కందుల దుర్గేష్‌తో కలిసి శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా పురందేశ్వరి మాట్లాడుతూ.. ర్యాంపులో అవినీతి భారీగా జరుగుతోందని ఆరోపిం చారు. ఎక్కడా డిజిటల్ పేమెంట్లు లేవని, వారు ఇచ్చే బిల్లులో రాష్ట్ర ప్రభుత్వం పేరు లేదని గుర్తించామని చెప్పారు. స్థానిక రైతులను ఇబ్బందులకు గురి చేస్తూ వారికి రహదారి లేకుండా చేస్తున్నారని తెలిపారు. ఇసుక ర్యాంపు నిర్వాహకులకు అధికార యంత్రాంగం సహకరిస్తోందని ఆరోపించారు. సహజ సిద్ధంగా లభిస్తోన్న ఇసుకకు రాష్ట్ర ప్రభుత్వం డిమాండ్ సృష్టించి పేదలకు అందుబాటులో లేకుం డా చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనివల్ల నిర్మాణ రంగంపై భారం పడి, లక్షలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని చెప్పారు. కనీసం పర్యావరణ నిబంధనలు కూడా పాటించడం లేదని, నిబంధనల ప్రకారం ఇసుక తవ్వకాలు జరగాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు బొమ్ముల దత్తు, ఆకుల శ్రీధర్, ముద్రగడ జెమి, బొర్రు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

రాష్ట్రంలో అరాచక పాలన : పురందేశ్వరి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో అరాచక, విద్వేషపూరిత పాలన సాగుతోందని బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. విజయవాడ ఎ కన్వెన్షన్‌లో శనివారం నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర హోమ్ శాఖ మంత్రి తానేటి వనిత ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో ఎస్‌సి యువకుడు పురుగుమందు తాగి చనిపోయిన ఘటనకు ప్రభుత్వం ఏమి సమాధానం చెబుతుందని పశ్నించారు. ఈ తరహాపాలనను అరాచక పాలన అని అనక ఇంకేమి అనాలన్నారు.

బాలికపై అత్యాచారం

- నిందితుడిపై పోక్సో కేసు

ప్రజాశక్తి-వేటపాలెం (బాపట్ల జిల్లా)

బాలికపై అత్యాచారానికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసుల వివరాల మేరకు.. బాపట్ల జిల్లా వేటపాలెం మండలం, చల్లారెడ్డిపాలెం పంచాయతీ, జబ్బర్‌కాలనీలో స్థానిక బిబిహెచ్ డిగ్రీ కాలేజీ ఎదురుగా సిమెంట్ రాయి కార్ఖానా ఉంది. ఈ కార్ఖానా నిర్వహిస్తోన్న తిరుమలశెట్టి వెంకటేశ్వర్లు తన పక్క ఇంట్లోని బాలికపై తరచూ లైంగిక చర్యలకు పాల్పడేవాడు. బాలిక శరీరంలో మార్పులను గమనించిన కుటుంబసభ్యులు ఆమెను ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్య పరీక్షల అనంతరం బాలిక ఐదు నెలల గర్భవతి అని నిర్ధారణవ్వడంతో తల్లిదండ్రులు విచారించగా అసలు విషయం బయట పడింది. జిల్లా ఎస్‌పికి బాధిత తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు. శనివారం కోర్టులో హాజరపరచగా.. కోర్టు రిమాండ్ విధించినట్లు వేటపాలెం ఎస్సై సురేష్ తెలిపారు.

164 స్టోర్లకు రాయల్ ఓక్ విస్తరణ

హైదరాబాద్ : ప్రముఖ ఫర్నిచర్ బ్రాండ్ అయిన రాయల్ ఓక్ ఫర్నిచర్ దేశంలో 164 స్టోర్లకు విస్తరించినట్లు ప్రకటించింది. నాచారంలో తమ కొత్త స్టోర్‌ను తెరవడం ద్వారా ఈ మార్క్‌కు చేరినట్లు పేర్కొంది. నూతన స్టోర్ ప్రారంభోత్సవంలో రాయల్ ఓక్ ఫర్నిచర్ చైర్మన్ విజయ్ సుబ్రమణ్యం, ఎండి మథన్ సుబ్రమణ్యం, హోమ్ డెకర్ ఇరినా మోసెస్, తెలుగు రాష్ట్రాల హెడ్ నరేష్ పాల్గొన్నారు. దాదాపు 9వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఈ స్టోర్ లివింగ్ రూమ్‌లు, బెడ్‌రూమ్‌లు, డైనింగ్ రూమ్‌లు విస్తృతమైన ఫర్నిచర్ కలెక్షన్‌ను అందుబాటులో ఉంటాయని ఆ సంస్థ తెలిపింది.

సుగంధ ద్రవ్యాలకు డిమాండ్ భళా

- రూ.1.50 లక్షల కోట్ల విలువ చేసే ఉత్పత్తి
- రూ.32వేల కోట్ల ఎగుమతులు
- గరిష్ట స్థాయి నుంచి దిగొస్తున్న ధరలు
- వాల్డ్ స్పైసీ ఆర్గనైజేషన్ ఛైర్మన్ రామ్ కుమార్ వెల్లడి

న్యూఢిల్లీ : భారత్‌లో సుగంధ ద్రవ్యాలను విరివిగా వాడటంతో పాటు ఎగుమతులతో భారీ ఆదాయం నమోదవుతుందని వాల్డ్ స్పైసీ ఆర్గనైజేషన్ ఛైర్మన్ రామ్‌కుమార్ మీనన్ అన్నారు. శనివారం హైదరాబాద్‌లో జాతీయ సుగంధ ద్రవ్యాల కాన్ఫరెన్స్ ప్రారంభమైంది. "ఆహార భద్రతా సుగంధ ద్రవ్యాలు - స్థిరమైన ఆదాయానికి ముందుకు వెళ్ళే మార్గం" అను నేపథ్యంలో ఈ సదస్సు జరిగింది. ఈ రంగానికి సంబంధించిన కీలకమైన సమస్యలపై చర్చించారు. కాన్ఫరెన్స్ ప్రారంభోత్సవం అనంతరం రామ్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ.. గతేడాది దేశంలో 10.3 మిలియన్ టన్నుల సుగంధ ద్రవ్యాల ఉత్పత్తి జరిగిందన్నారు. వీటి విలువ రూ.1.50 లక్ష కోట్లుగా ఉందని అంచనా వేశారు. కాగా ఇందులో దాదాపుగా రూ.32 కోట్ల (4 బిలియన్ డాలర్ల) విలువ చేసే ఎగుమతులు జరిగాయన్నారు. మొత్తం ఉత్పత్తిలో 85 శాతం దేశీయంగా వినియోగించగా.. మిగితా 15 శాతం ఎగుమతులు అవుతున్నాయన్నారు. 2025 నాటికి 5 బిలియన్ డాలర్లు, 2030 నాటికి 10 బిలియన్ డాలర్ల విలువ చేసే ఎగుమతులు చేయాలని తాము లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇందుకోసం వ్యాల్యూ యాడెడ్ ఉత్పత్తులపై దృష్టి పెట్టామన్నారు. మరిన్ని రెడీ టు ఈట్, రెడీ టు కుక్‌కు వీలుగా ఉత్పత్తులను ఆవిష్కరించాల్సి ఉందన్నారు. ప్రతీ ఏడాది సగటు ఎగుమతుల వృద్ధి 6 శాతంగా చోటు చేసుకుంటుందన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ - ఆగస్ట్ ఎగుమతుల్లోనూ ఆరు శాతం పెరుగుదల చోటు చేసుకుందన్నారు. గతేడాది వాతావరణ సమస్యలతో సుగంద ద్రవ్యాల దిగుబడి తగ్గిందన్నారు. దీంతో జీలకర్ర కిలో ధర ఓ దశలో రూ.250 నుంచి రూ.700కు ఎగిసిందన్నారు. క్రమంగా తగ్గుతూ ప్రస్తుతం రూ.400-500 మధ్య పలుకుతుందన్నారు. మిర్చీ, పసుపు ఉత్పత్తి, ఎగుమతుల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు కీలక వాటా కలిగి ఉన్నాయన్నారు. పరిశ్రమలోని ప్రతి ఒక్కరికీ మరింత స్థిరమైన ఆదాయానికి అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ మంత్రిత్వ శాఖకు చెందిన డైరెక్టరేట్ అఫ్ అరెకనట్ అండ్ స్పైస్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ హోమి చెరియన్, స్పైసెస్ బోర్డు రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ ఎబి రీమాశ్రీ, ఆ పరిశ్రమ నిపుణులు, రైతులు పాల్గొన్నారు.

ఒరాఫో జ్యుయల్స్ ఇ-స్టోర్ ఆవిష్కరణ

హైదరాబాద్ : వెండి ఆభరణాల బ్రాండు ఒరాఫో జ్యుయల్స్ వచ్చే ఏడాది ఏప్రిల్ లేదా అక్షయ తృతీయ నాటికి మరో ఆరు కొత్త స్టోర్లను తెరువనున్నట్లు ప్రకటించింది. శనివారం హైదరాబాద్‌లో ఒరాఫో జ్యుయల్స్ ఆన్‌లైన్ పోర్టల్ ఇ- స్టోర్‌ను బలగం సినిమా నటీ కావ్య కళ్యాణ్ రామ్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ డైరెక్టర్ కళ్యాణ్ రామ్ మీడియాతో మాట్లాడుతూ.. నగరంలో తమకు ప్రస్తుతం మూడు స్టోర్లు ఉన్నాయన్నారు. వచ్చే మూడేళ్లలో దక్షిణాదిలో 25 స్టోర్లకు విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇందులో ఫ్రాంచైజీ పద్ధతిలో ఔత్సాహికవేత్తలకు అవకాశం కల్పించనున్నామన్నారు. ఫ్రాంచైజీ అవుట్‌లెట్‌కు రూ.1.2 నుంచి రూ.1.5 కోట్ల పెట్టుబడి అవసరం అవుతుందన్నారు. వచ్చే అక్షయ తృతీయ నాటికి హైదరాబాద్‌లో మరో రెండు, వైజాగ్, రాజమండ్రి, తిరుపతి తదితర నగరాల్లో కొత్త స్టోర్లను ఏర్పాటు చేయనున్నామన్నారు.

ఓపెన్ ఎఐ ప్రెసిడెంట్ రాజీనామా

న్యూయార్క్ : చాట్‌జిపిటి సృష్టికర్త, ఓపెన్ ఎఐ కో-ఫౌండర్, ప్రెసిడెంట్ గ్రెగ్ బ్రాక్‌మన్ ఆ సంస్థకు అనుహ్యంగా రాజీనామా చేశారు. ఓపెన్ ఎఐ సిఇఒ 'శామ్ ఆల్ట్‌మన్'ను తొలగించిన నేపథ్యంలో బ్రాక్‌మన్ ఈ నిర్ణయం తీసుకోవడం విశేషం. ఆల్ట్‌మన్ బోర్డులో తీసుకునే నిర్ణయాలకు అతడు అడ్డుపడుతున్నాడని.. సంస్థకు సారథ్యం వహించే సామర్థ్యం లేదని ఆయన్ను తొలగించింది. కాగా.. ఆల్ట్‌మన్‌ను కంపెనీ తొలగించిన కొన్ని గంటల వ్యవధిలోనే బ్రాక్‌మాన్ సోషల్ మీడియాలో తన రాజీనామాను ప్రకటించడం గమనార్హం.

అమెజాన్ అలెక్సాలో ఉద్యోగులపై వేటు

న్యూయార్క్ : గ్లోబల్ ఐటి కంపెనీల్లో ఉద్యోగాలు గాల్లో దీపంలా మారాయి. దిగ్గజ ఇ-కామర్స్ కంపెనీ అమెజాన్ తన వాయిస్ అసిస్టెంట్ అలెక్సాలో వందలాది మంది ఉద్యోగులపై వేటు వేయాలని నిర్ణయించింది. ఎఐపై దృష్టి సారించడంతో పాటుగా పొదుపు చర్యల్లో భాగంగా సిబ్బందిని తొలగిస్తున్నట్లు అలెక్సా, ఫైర్ టివి విభాగాల వైస్ ప్రెసిడెంట్ డేనియల్ రౌశ్ తెలిపారు. ఇదే విషయమై శుక్రవారం ఆయన ఉద్యోగులకు మెయిల్ చేశారు. ఖచ్చితమైన సంఖ్య చెప్పనప్పటికీ.. వందలాది మందిని ఇంటికి పంపిస్తున్నట్లు వెల్లడించారు. మారుతున్న వ్యాపార ప్రాధాన్యతల్లో భాగంగా మరింత మెరుగ్గా రాణించే ప్రయత్నంలో కొన్నింటిలో మార్పులు చేపడుతున్నామని లేఖలో పేర్కొన్నారు. తాజా నిర్ణయంతో అమెరికా, కెనడా, భారత్‌లోని ఉద్యోగులపై ఈ ప్రభావం పడనుంది. గడిచిన ఏడాది కాలంలో అమెజాన్ తన వివిధ విభాగాల్లోని దాదాపు 27వేల మంది ఉద్యోగులపై వేటు వేసింది.

వెలువడినవి

సాహిత్యంలో విప్లవం
చరిత్ర,శిల్పం, స్వీయానుభవాలు
రూ. 250/-



వెయ్యేళ్ళ చరిత్ర
1000-2000 ప్రపంచ పరిణామాలు
రూ. 250/-

ప్రతులకు
ప్రజాశక్తి బుక్‌హౌస్
డోరు నెం.27-1-54, కారల్‌మార్క్స్‌రోడ్,
విజయవాడ - 2
ఫోన్ : 9490099061, 9490099057

బ్రాంచీలు
విశాఖపట్నం, ఏలూరు,
విజయవాడ, గుంటూరు, ఒంగోలు,
నెల్లూరు, కర్నూలు, అనంతపురం

సంపాదకీయం

మరుగుదొడ్డి

'కొత్తగా పెళ్లి చేసుకొని అత్తగారింటికి వచ్చిన షమీమ్‌కు ఎక్కడా లెట్రిన్ కనిపించలేదు. ఇంటెనక్కి పోయింది. అక్కడా కనపడలేదు. చుట్టూ చూసింది. ఒక మూలన నాలుగు కర్రలు పాతి, చుట్టూ గోనె సంచులు, తాటి కమ్మలు కట్టివున్న గుడారం లాంటిది కనిపించింది. దానికి తలుపులాగా ఒక కర్ర అడ్డంగా ఉంది. దానికి గోనె పట్టా వేళాడుతోంది. అంతలో ఆ గోనె పట్టాను జరుపుకుంటూ ఒకామె బైటకొచ్చింది లోటా బట్టుకొని'...అంటూ మరుగుదొడ్డి బాహ్యరూపాన్ని, లోపలి భయానక పరిస్థితినీ, పేదరికం తీవ్రతను షాజహానా 'సండాస్' అనే కథలో వర్ణిస్తుంది. ఇదోక బాధాకరమైన పరిస్థితి అయితే, అంతకంటే దారుణమైన స్థితిని 'బ్లాక్' అనే కథలో ఎం.ఎం.వినోదిని చెబుతారు. 'యింటోళ్లందరి యేరుగుడు పాతికేళ్లు నుంచి యెత్తీయెత్తీ సేతులు రేకులయినాయ్. డబ్బులడిగితే ముడ్లో సెగ్గడ్డలు మొలుచుకొత్తయ్. వొకటా రెండా? పాతికేల్ల బట్టి సేత్తన్నా? యిన్నేల్ల బట్టి యీల్ల ఆస్తులు బెరిగినాయ్! లోకంలో దరలు బెరిగినాయ్! నా బిడ్డ బెరిగ... సివరికి యీడింట్లో యేరిగే ముడ్లు కూడా బెరిగినాయ్. నా బత్తెం మాత్తరం బెరగలా...' అంటూ 'బ్లాక్' కథలో మాన్యువల్ స్కావెంజర్ల దైన్యాన్ని కళ్లకు కడతారు వినోదిని. మాన్యువల్ స్కావెంజింగ్ మానవాళికి ముప్పు అని, 98 శాతం మాన్యువల్ స్కావెంజర్లలో మహిళలు, బాలికలు అతి తక్కువ వేతనం పొందుతున్నారని... అదే వర్గం నుంచి వచ్చిన మెగాసెసే అవార్డు గ్రహీత బెజవాడ విల్సన్ అంటారు. మన దేశ అభివృద్ధి గ్రాఫ్‌ను అద్దంలో చూపే కథలివి. వాస్తవ జీవితానికి ప్రతిబింబాలు. దేశంలోని సగానికి పైగా జనాభా నిత్యం అనుభవించే మరుగుదొడ్డి సమస్యలు.

140 కోట్ల జనాభా వున్న భారత్‌లో 53 శాతం మందికి పైగా మరుగుదొడ్లు లేవంటే నమ్మగలమా? గ్రామీణ ప్రాంతాలలో 66 శాతం మంది ఇప్పటికీ బహిర్భూమిలోనే కాలకృత్యాలు తీర్చుకుంటున్నారనేది నిష్టుర సత్యం. ఎస్సీల్లో దాదాపు 66.1 శాతం, ఇతర కులాల్లో 53.1 శాతం మందికి ఈ సౌకర్యం అందుబాటులో లేదు. ప్రపంచ వ్యాప్తంగా ఆరుబయట మలవిసర్జన చేసే వారిలో 60 శాతం మంది మన దేశానికి చెందినవారేనని లెక్కలు చెబుతున్నాయి. బాలీవుడ్ నటి విద్యాబాలన్ టాయిలెట్ అంబాసిడర్‌గా చేసిన ఓ ప్రకటనలో 'ఒక యువ వధువు ఆమె ముఖాన్ని కప్పిన ముసుగు పైకెత్తి గ్లాసుతో నీళ్లు తాగుతుంది. ముసుగు దించి తాగాలని, అది గౌరవమని అత్తగారు చెబుతుంది. విద్యాబాలన్ ఆ తర్వాత ఇంట్లో మరుగుదొడ్డి లేదని తెలుసుకుని గుక్కెడు నీటి కోసం తన ముసుగు ఎత్తడం సరైంది కానప్పుడు, బహిరంగ ప్రదేశంలో టాయిలెట్‌కు వెళ్లడం ఎలా గౌరవమో ఆలోచించమంటుంది. మీ ఇంట్లో మరుగుదొడ్డి ఉంటే మీరు, మీ కోడలు గౌరవాన్ని కాపాడుకోవచ్చు' అని చెబుతుంది. 'స్వచ్ఛ భారత్ అభియాన్' పేరుతో కోట్లాది రూపాయలు ప్రకటనలకే ఖర్చు చేస్తోంది. 2014లో గ్రామీణ ప్రాంతాల్లో మరుగుదొడ్లు నిర్మిస్తామని ప్రధాని మోడీ చేసిన వాగ్దానం అమలు ఇప్పటికీ లక్ష్యానికి ఆమడ దూరంలో వుంది. ప్రచారానికి చేసే ఖర్చు... మరుగుదొడ్ల నిర్మాణానికి చేస్తే ఎంతో ప్రయోజనం చేకూరేదని జనం చెబుతున్న మాట.

మరుగుదొడ్లు అనేది మనుషుల గౌరవానికి సంబంధించిన ముఖ్యమైన అంశం. మరుగుదొడ్ల సమస్య కారణంగా మహిళలు, బాలికలు లైంగిక దాడులకు, హత్యలకు గురైన సంఘటనలు అనేకం. అంతేకాదు, గత ఐదేళ్ల కాలంలో సెప్టిక్ ట్యాంక్, మురుగు కాల్వల్లో పడి 399 మంది మాన్యువల్ స్కావెంజర్లు చనిపోయారని ప్రభుత్వ అధికారిక సమాచారం. వాస్తవానికి ఈ సంఖ్య ఇంకా ఎక్కువగానే వుంటుందని, మృతుల కుటుంబాలను సైతం ప్రభుత్వాలు ఆదుకోవడం లేదని స్కావెంజర్లు చెబుతున్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్లు కావస్తున్నా పరిశుభ్రమైన మరుగుదొడ్ల కోసం కూడా అంగలార్చాల్సి రావడం అత్యంత శోచనీయం. ముఖ్యంగా ప్రభుత్వ స్కూళ్లు, హాస్టళ్లలోను, పేదలు, దిగువ మధ్యతరగతికి చెందినవారు ఈ సమస్యను తీవ్రంగా ఎదుర్కొంటున్నారు. భారతదేశం బహిరంగ మలవిసర్జన రహిత దేశంగా మారాలంటే ఇంకా చాలా దూరం ప్రయాణించాల్సి వుంది. మరుగుదొడ్లపై అవగాహన కల్పించేందుకు 'ప్రపంచ మరుగుదొడ్డి దినోత్సవం' ప్రతియేటా నవంబర్ 19న జరుపుతున్నారు. 'మార్పును వేగవంతం చేయడం' ఈ ఏడాది థీమ్. ఇప్పటికైనా ప్రభుత్వాలు ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి వుండేలా చర్యలు తీసుకోవాలి. ఆ దిశగా ప్రజలను చైతన్యవంతం చేయాలి. ఈ మార్పు వేగవంతం కావాలి.

మహనీయుల మాట

సమాజంలో దోపిడీకి, అణచివేతకు గురవుతున్న కార్మికుల ప్రయోజనాలు అన్ని దేశాల్లోనూ ఒకే విధంగా ఉంటాయి.

- క్లారా జెట్కిన్

బడా పార్టీల నిధుల గుట్టు కార్పొరేట్లకెరుక!

ప్రస్తుతం

దేశంలో ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రాలలో ఎక్కడికక్కడ సోదాలు చేస్తుంటారు. వాహనాలను నిలబెట్టి గంటల తరబడి గాలించడంతో ఆలస్యమేగాక రాకపోకలకు అంతరాయం కూడా ఏర్పడుతుంటుంది. పత్రికలు చూస్తే పట్టుబడిన లెక్కలు గొప్పగా ఇస్తుంటారు. ఇదంతా చూడ్డానికి చాలా ఆసక్తిగా వుంటుంది. పోలీసులు ఎంత శ్రద్ధగా అక్రమ నగదును పట్టుకుంటున్నారు కదా అనిపిస్తుంది. అయితే కథలో అసలు ట్విస్టు ఇక్కడే వుంటుంది. రోడ్డు మీద కొన్ని కోట్లు పట్టుకోవడానికి ఇంత హంగామా చేసే మన వ్యవస్థ రాజమార్గంలో వేల కోట్లు పాలక పార్టీలకు కట్టబెట్టే కార్పొరేట్ కుబేరులను లాబీయిస్టులను మాత్రం అసలు ముట్టుకోదు! పైగా అందుకోసం వివరాలు చెప్పనవసరం లేని ఎన్నికల బాండ్ల వ్యవస్థ (ఎలక్టోరల్ బాండ్స్ సిస్టం-ఇ.బి.ఎస్) ప్రవేశపెట్టింది. దీనిపై ఇటీవల సుప్రీంకోర్టు విచారణ జరిపిన సందర్భంలో కేంద్రం అభిప్రాయం అడిగింది. ఓటర్లకు అన్ని వివరాలు తెలుసుకోవలసిన అవసరమేమీ లేదని మోడీ ప్రభుత్వం తాను దాఖలు చేసిన అఫిడవిట్‌లో సెలవిచ్చిందంటే ఆశ్చర్యం కలగొచ్చు గాని పచ్చి నిజం.

తెలకపల్లి రవి

ఎందుకంటే తెలుసుకుంటే తెలిసేవి ముందు తమ పార్టీ వివరాలే గనక అంత ఆశ్చర్యపోవలసిన అవసరం వుండదు. 2018-2023 మధ్య కాలంలో దేశంలో 27 దఫాలుగా రూ.13,791 కోట్ల విలువైన 24,012 ఎన్నికల బాండ్లు అమ్ముడుపోయాయి. 31 రాజకీయ పార్టీలకు మొత్తం రూ.9,188 కోట్ల విరాళాలు అందాయి. ఇందులో బిజెపి ఒక్కదానికే రూ.5,272 కోట్ల విలువైన బాండ్లు లభించాయి. బిజెపికి 74 శాతం వస్తే కాంగ్రెస్‌కు 11 శాతం మాత్రమే దక్కాయి. తర్వాతి స్థానంలో బిజూ జనతాదళ్, వైఎస్‌ఆర్ కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ వున్నాయి. నిజానికి ఈ మాత్రం నిధులతోనే ఆ పార్టీలు ఎన్నికలు, ఇతర వ్యవహారాలు నడుపుతున్నాయనుకుంటే పొరబాటే. 2019 ఎన్నికలకు దేశవ్యాపితంగా మొత్తం రూ.55,000 కోట్ల నుంచి రూ.60 వేల కోట్ల వరకూ ఖర్చయి వుంటుందని ప్రజాస్వామ్య సంస్కరణల వేదిక (అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్ (ఎడిఆర్) అంచనా వేసింది. ఇందులో చాలా భాగం లెక్కకు రాని నగదులోనే జరుగుతాయి. తప్పనిసరిగా అధికారికంగా చేయాల్సిన ఖర్చులకే ఈ నిధులు ఉపయోగిస్తాయవి. అంటే మౌలిక సదుపాయాలు, ప్రచార సామగ్రి, వివిధ రకాల మీడియాలో ప్రచార ఖర్చు వంటి వాటి కోసం ఈ బాండ్ల నుంచి వచ్చే మొత్తాన్ని చూపిస్తాయి. బిజెపి ప్రధాని అభ్యర్థిగా నరేంద్ర మోడీని ముందుకు తెచ్చిన నాటి నుంచి ప్రచార సరళి ఎలా మారిపోయిందో! వేల స్క్రీన్ల ధగధగలు, ఇంటర్వ్యూలు, డిజిటల్ మీడియా మాయలు ఏ స్థాయిలో జరుగుతున్నాయో చూస్తున్నాం. తెలంగాణ ఎన్నికలలో బిఆర్‌ఎస్ కూడా భారీ ఎత్తునే ప్రచారం సాగిస్తున్నది, మంత్రి కెటిఆర్ ఈ కొత్త తరహా చిట్కాలను విస్తారంగా ఉపయోగిస్తున్నారు.

ఎన్నికల బాండ్ల రహస్యం

ఎన్నికల బాండ్లలో వుండే సౌలభ్యం ఏమంటే వాటిని ఎవరు ఎవరికి ఇచ్చారో లెక్క చూపనవసరం లేదు. వివరాలు ఇవ్వక్కర్లేదు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) బేరర్ బాండ్ల రూపంలో అమ్మేవాటిని ఎవరైనా కొని ఎవరికైనా ఇవ్వొచ్చు. 2018 జనవరిలో ఎలక్టోరల్ బాండ్ల పద్ధతిని ప్రవేశపెట్టారు. అది కూడా రాజ్యాంగ సవరణ లేదా వివరణ లేకుండా ద్రవ్య బిల్లుగా దొడ్డిదోవలో తీసుకొచ్చారు. నిజానికి 2013లో యుపిఎ పాలన చివరి ఘట్టంలో పార్టీలకు విరాళాలిచ్చే కార్పొరేట్ కుబేరుల వివరాలు బయటపడకుండా ఏదో ఏర్పాటు తీసుకొచ్చింది. అది సరిగ్గా లేదు కనక పారదర్శకత అవసరమన్న వాదనతో మోడీ సర్కారు మొదటికే మోసం తెచ్చింది. దేశ విదేశాలకు చెందిన బడా కంపెనీలు రాజకీయ పార్టీలకు విరాళాల రూపంలో పెట్టుబడులు పెట్టి చెప్పుచేతల్లో పెట్టుకోవడానికి ద్వారాలు తీసింది. ఇందుకోసం ఫైనాన్స్ చట్టంలో విదేశీ విరాళాల క్రమబద్ధీకరణ చట్టాన్ని 2016 నుంచి వర్తించేలా సవరణ చేసింది. తద్వారా విదేశాల నుంచి నిధులు తీసుకున్నా తప్పు కిందకు రాకుండా కాపాడింది. దీని వెంటనంటి మరిన్ని సవరణలు. ప్రజాప్రాతినిధ్య చట్టం, కంపెనీల చట్టం, ఆదాయపు పన్ను చట్టం, రిజర్వు బ్యాంకు చట్టం...వీటన్నిటినీ 2017 ఫైనాన్స్ చట్ట సవరణతో మార్చివేసింది. ఆర్‌బిఐ, ఎన్నికల సంఘం, ప్రతిపక్షాలు విమర్శకులు ఎంతగా ఆక్షేపించినా బేఖాతరు చేసి ఫైనాన్స్ బిల్లుగానే ఆమోదించేసింది. రాజ్యసభ బెడద లేకుండా చేసుకుంది. ఈ తతంగమంతా ఎంత పకడ్బందీగా జరిగిందో చూస్తే మోడీ ప్రభుత్వ ప్రచ్ఛన్న ఎజెండాల అమలు లోతుపాతులు తెలుస్తాయి. ఈ పథకం సరైంది కాదని సిపిఎం వంటి పార్టీలు ఆదిలోనే విమర్శించాయి. తాము కార్పొరేట్ నిధులు తీసుకోవడానికి నిరాకరించాయి కూడా.



ఎన్నికల వ్యవస్థ ఖరీదైపోయిందని సన్నాయి నొక్కులు నొక్కే హైక్లాస్ మేధావులు, వ్యాఖ్యాతలు తెర వెనక కార్పొరేట్ల చెలగాటం గురించి వారితో బడా పార్టీల బ్రహ్మ ముడి గురించి ఎప్పుడూ చెప్పరు. ఎన్నికలను ఖరీదైన వ్యవహారంగా మార్చి సామాన్య ప్రజలకూ శ్రమజీవుల కోసం పని చేసే కమ్యూనిస్టులు సామాజిక కార్యకర్తలకూ దూరం చేసిన పాలక వర్గాల కుట్రల గురించి చెప్పవు. ఇలాంటి నేపథ్యంలోనూ టాటాలు విరాళం పంపితే తిరస్కరించిన, కోర్టులో ఈ బాండ్లకు వ్యతిరేకంగా వాదించిన సిపిఎంను గురించి చెప్పరు.

తలకిందులు తర్కాలు

సుప్రీం కోర్టులోనూ దీనిపై ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు నడిచాయి. రాజ్యాంగ ధర్మాసనం విచారించింది. 2018 నుంచి నడుస్తున్నా కేంద్రం తన వైఖరి చెప్పకపోవడంతో కేసు ముందుకు నడవలేదు. సుప్రీంకోర్టు కూడా దాన్ని తేల్చకపోవడం విమర్శకు గురైంది. ఎట్టకేలకు ఈ మధ్యనే విచారణ జరిగింది, ఆ సమయంలో అఫిడవిట్ దాఖలు చేయాలని కోరితే కేంద్రం ఏకపక్షంగా సమర్ధించుకుంది. పార్టీలకు ఎవరు విరాళాలు ఇచ్చారో చెబితే వారిని వేధింపులకు గురిచేసే అవకాశం వుంది గనక బయటపెట్టడం మంచిది కాదన్నట్టు వాదించింది. అసలు ఆ వివరాలు తెలుసుకోవడం సామాన్య ప్రజల ప్రాథమిక హక్కు కాదని కూడా వాదించింది. విరాళాలు ఇవ్వడంలో గోప్యత కార్పొరేట్ల హక్కు గనక దాన్ని భంగపరిస్తే వాటి ప్రాథమిక హక్కుకు హాని అని వితండవాదన చేసింది. ఇదో తలకిందులు తర్కం. ఎందుకంటే కార్పొరేట్లు ఎప్పుడూ పాలక పార్టీలకే పెట్టుబడులు పెడతాయి. అందులోనూ ఆ సమయంలో అధికారంలో వున్న పార్టీని తమ విరాళాలతో లోబర్చుకుని ప్రయోజనాలు నెరవేర్చుకుంటాయనేది అందరికీ తెలిసిన విషయమే. దాన్ని దాచిపెట్టడమంటే నిధులు ఇచ్చేవారికి ప్రత్యేకంగా లాభం చేకూర్చే నిర్ణయాలు చేశాయేమో తెలుసుకోకుండా చేయడమే జరిగేది. అంతకుముందు రోజుల్లో నగదు విరాళాల వల్ల నల్ల డబ్బు విచ్చలవిడిగా చలామణిలోకి వచ్చిందని బాండ్లు తెచ్చామన్నారు. కానీ అప్పట్లో రూ.20 వేల పైన విరాళమిస్తే దాతల పేర్లు తప్పక చెప్పాల్సి వచ్చేది. ఇదే సూట్‌కేస్ సంస్కృతి అని, దీన్ని అంతమొందిస్తామని చెప్పిన మోడీ సర్కార్ వాస్తవంగా చేసింది రూ.వేల కోట్లు గుమ్మరించిన వారిని కూడా బయటపెట్టకుండా చేయడమే. కాంగ్రెస్ హయాంలో అంబానీలు, మోడీ వచ్చాక అదానీ చక్రం తిప్పుతున్న తీరుకు మూలం ఇదే. ఎన్నికల బాండ్లు కొన్న కంపెనీల వెనక ఎవరున్నారో కూడా ఎప్పటికి తెలియదు. పాశ్చాత్య దేశాల్లోనైతే అధ్యక్షులుగా పోటీ చేసే వారు ఇంత విరాళం సమకూర్చాలని ముందే షరతులుంటాయి. ఉదాహరణకు బుష్ హయాంలో ఇంధన కంపెనీల కోసం ఎలా పనిచేసిందీ అనేక రకాలుగా బహిర్గతమైంది, అలా బయటపడకుండానే కేంద్రం ఇప్పుడు బాహాటంగా అదానీ అక్రమాలను దాచిపెట్టడం ఆరోపణలకు గురవుతున్నది. క్విడ్‌ప్రోకో తరహాలో కార్పొరేట్లు లోపాయికారిగా నిధులు వెదజల్లి పాలకులను లోబర్చుకుని ఇష్టానుసారం ఆడిస్తూనే వుండొచ్చు. ఎన్నికల వ్యవస్థ ఖరీదైపోయిందని సన్నాయి నొక్కులు నొక్కే హైక్లాస్ మేధావులు, వ్యాఖ్యాతలు తెర వెనక కార్పొరేట్ల చెలగాటం గురించి వారితో బడా పార్టీల బ్రహ్మ ముడి గురించి ఎప్పుడూ చెప్పరు. ఎన్నికలను ఖరీదైన వ్యవహారంగా మార్చి సామాన్య ప్రజలకూ శ్రమజీవుల కోసం పని చేసే కమ్యూనిస్టులు సామాజిక కార్యకర్తలకూ దూరం చేసిన పాలక వర్గాల కుట్రల గురించి చెప్పవు. ఇలాంటి నేపథ్యంలోనూ టాటాలు విరాళం పంపితే తిరస్కరించిన, కోర్టులో ఈ బాండ్లకు వ్యతిరేకంగా వాదించిన సిపిఎంను గురించి చెప్పరు. నిన్నగాక మొన్న పుట్టిన ప్రాంతీయ పార్టీలే విచ్చలవిడిగా వందల కోట్ల రూపాయలు కుమ్మరిస్తుంటే 35 ఏళ్లు బెంగాల్‌ను, త్రిపురనూ, మరెన్నో సార్లు కేరళను పాలించిన సిపిఎం విలువలు పాటించిందో ప్రస్తావించరు. ఎన్నికల పోరాటం రాజకీయ విధానాల సవాలుగా గాక కోట్ల బేరంగా మార్చిన పాలక వర్గాల కుట్రలను వదలిపెట్టి కమ్యూనిస్టులు దెబ్బతిన్నారని అపహాస్యం చేస్తుంటారు. ధనాఢ్య శక్తుల విలయ విహారం మధ్యలోనూ విలువల గురించి విధానాల గురించి పోరాడుతూ సమాంతర వాణిని వినిపిస్తున్నది ప్రజల ఎజెండాను బతికిస్తున్నది వారేనన్న వాస్తవాన్ని మరుగు పరుస్తుంటారు. అలాటి నిబద్ధ రాజకీయాలను ప్రజాస్వామికవాదులు, జన సామాన్యం ఆదరిస్తున్నారు గనకే కమ్యూనిస్టులు సమరశీల సైద్ధాంతిక పథంలో కొనసాగ గలుగుతున్నారు. తెలుగు రాష్ట్రాలలో విలక్షణ విధానంతో సిపిఎం ముందుకు సాగుతున్న తీరును గతవారం ఈ శీర్షికలో చెప్పుకున్నాం, అననుకూలతల మధ్య కూడా పోరాటం సాగుతూ వుండాల్సిందే.

తీర్పు ఎలా వున్నా...

డబ్బు సంచుల గుమ్మరింపుతో రాజకీయ సమానతను దెబ్బ తీయడమే ఈ వ్యవస్థ సారాంశం. రాజ్యాంగంలో సోషలిజం అనే పదం ఇంకా కొనసాగుతూనే వుండగా రాజకీయ సమానత్వానికి కూడా ఎసరు పెట్టే పరిస్థితి ఇదని కాళేశ్వరం రాజ్ అనే ప్రముఖ న్యాయవాది ఇటీవలే రాశారు. మోడీ రాజ్యాంగం నాల్గవ భాగంలోని ఆదేశిక సూత్రాలు, మూడవ భాగంలోని సమానతా సూత్రాలు కూడా అధికారికంగా దెబ్బ తీసే పరిస్థితి. ఎన్నికలలో కుబేర వర్గాలు రాజకీయ సమానతకు తెచ్చే ప్రమాదం గురించి అంబేద్కర్ ఆనాడే హెచ్చరించారు. రాత్రికి రాత్రి ప్రభుత్వాలు కూలిపోవడానికి, ఎవరికి ఎక్కువ సీట్లు వచ్చినా మేమే ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని బిజెపి నేతలు ప్రకటించడానికి వెనకవున్న ధీమా ఇదే. సుప్రీంకోర్టులో ఎన్నికల బాండ్ల కేసు ఆరేళ్లుగా ఎడతెగని నిరీక్షణలో వుండగానే ఒకసారి లోక్‌సభ ఎన్నికలు, 30 సార్లు శాసనసభల ఎన్నికలు జరిగిపోయాయి. చట్టం వ్యవస్థపై ఆధారపడి వుంది గాని వ్యవస్థ చట్టంపై ఆధారపడి వుండదు. కనక వచ్చే తీర్పుతోనే మొత్తం మారిపోతుందని ఆశించడానికి కూడా లేదు. ఆ తీర్పులో చేసిన విమర్శలను సాంకేతికంగా దాటవేస్తూ మరో చట్టం చేయొచ్చు. ఓటర్లను, ఆ యా పార్టీలనూ, మీడియాను కూడా కొనుగోలు చేయగల కార్పొరేట్ రాజకీయాలకు ఎన్నికలు మొదటి మెట్టవుతాయి. పాక్షిక దామాషా పద్ధతి ఓటింగు, ఎన్నికల ఖర్చును పరిమితం చేసి అది కూడా వస్తు రూపంలో ప్రభుత్వమే భరించడం జరిగితే కొంతవరకైనా నిజమైన సమాన పోటీ సాధ్యమవుతుంది. మన ప్రజాస్వామ్యం పటిష్టం కావాలంటే ముందు ఎన్నికల సంస్కరణలు మొదటి అడుగు. లోక్‌సభ ఎన్నికలలోగా వాటి మీద మరోసారి సమగ్రమైన చర్చ జరపాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌పై వుంది. అయితే కేంద్రం ఒత్తిడి మధ్య అదెంతవరకు సాధ్యమో సందేహమే. ఈలోగా సుప్రీంకోర్టు తీర్పు ఏం చెబుతుందో చూద్దాం. ★

> **కార్పొరేట్లు ఎప్పుడూ పాలక పార్టీలకే పెట్టుబడులు పెడతాయి. అందులోనూ ఆ సమయంలో అధికారంలో వున్న పార్టీని తమ విరాళాలతో లోబర్చుకుని ప్రయోజనాలు నెరవేర్చుకుంటాయనేది అందరికీ తెలిసిన విషయమే. దాన్ని దాచిపెట్టడమంటే నిధులు ఇచ్చేవారికి ప్రత్యేకంగా లాభం చేకూర్చే నిర్ణయాలు చేశాయేమో తెలుసుకోకుండా చేయడమే జరిగేది. అంతకుముందు రోజుల్లో నగదు విరాళాల వల్ల నల్ల డబ్బు విచ్చలవిడిగా చలామణిలోకి వచ్చిందని బాండ్లు తెచ్చామన్నారు. కానీ అప్పట్లో రూ.20 వేల పైన విరాళమిస్తే దాతల పేర్లు తప్పక చెప్పాల్సి వచ్చేది. ఇదే సూట్‌కేస్ సంస్కృతి అని, దీన్ని అంతమొందిస్తామని చెప్పిన మోడీ సర్కార్ వాస్తవంగా చేసింది రూ.వేల కోట్లు గుమ్మరించిన వారిని కూడా బయటపెట్టకుండా చేయడమే. కాంగ్రెస్ హయాంలో అంబానీలు, మోడీ వచ్చాక అదానీ చక్రం తిప్పుతున్న తీరుకు మూలం ఇదే. ఎన్నికల బాండ్లు కొన్న కంపెనీల వెనక ఎవరున్నారో కూడా ఎప్పటికి తెలియదు.**

కవిత్వం

ధర్మగుణం

వివక్షతా?
అదేంటి?
మాకలాంటిదేంలేదు
అదేమిటో కూడా తెలియదు
మాకందరూ సమానమే
శత్రువులూ లేరు
మిత్రులూ లేరు
ఏ గట్టయినా ఒకటే
వాటమెటుంటే అటే
ఆయారాం గయారాం పాత మాట
మేం ఆధునీకులం
ప్రజాసేవే మా పరమావధి,
మేమే
రాములమ్మలం
చిన్నమ్మలం
అన్నలం, అమ్మలం
ధర్మగుణ సంపన్నులం.

- ఎ. అజ శర్మ

మనమే ఫస్ట్

అభివృద్ధిలో న్యూయార్క్‌తో
పోటీ అంట...
ఉచితాలు ఎందుకో మరి
తెలియదంట !
మేడిపండు చూడ
మేలిమై ఉండు నగర పొట్ట
విచ్చి చూడ - వీధులన్నీ
డ్రైనేజీల పొంగు పొర్లు...!

- న్యాలకంటి నారాయణ

మీ వ్యాసాలు 5000 క్యారెక్టర్లు లేదా 700 పదాలు వుండాలి.

పంపాల్సిన మెయిల్ :

editpageps@gmail.com

అభిప్రాయం

ఎవరికి చెందితే వారికి

మొన్న మా బెజవాడలో ప్రజారక్షణ భేరి పేరిట సిపియం ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన, బహిరంగ సభ జరిగాయి. ఆ సందర్భంగా సిపియం పొలిట్‌బ్యూరో సభ్యుడు బి.వి.రాఘవులు ప్రసంగం గురించి ఒక్కో దినపత్రిక ఒక్కో రకంగా రాసుకొచ్చింది. మోడీ, జగన్ ప్రభుత్వాలను గద్దె దించాల్సిందే అని ఆంధ్రజ్యోతి వార్తాకథనం. ఇంగ్లీష్ మీడియం వలన ప్రయోజనం లేదు: బి.వి.రాఘవులు అని సాక్షి పేపరు కథనం.

సాక్షి పేపరు వార్తా కథనం ఆధారంగా ఫేస్‌బుక్‌లో చాలా మంది రాఘవులు మీదా సిపియం పార్టీ మీదా తమదైన శైలిలో విరుచుకుపడ్డారు. ఆలోచనాపరులు, అభ్యుదయవాదులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయన్సర్లుగా ఉన్నవాళ్ళు కూడా ఈ దాడిలో ముందు పీఠిన ఉండడం నాకు కొంత ఆశ్చర్యం కలిగించింది. పై రెండు పత్రికలు ఏ రాజకీయ పార్టీల కొమ్ము కాస్తాయో ఆంధ్ర రాష్ట్ర ప్రజానీకానికి కొత్తగా ఎవరూ చెప్పాల్సిన అవసరం లేదు. పత్రికా వార్తా కథనాల మీద ఆధారపడి స్పందించడం కన్నా ఏ యూట్యూబ్ లోనో, గూగుల్ చేసో రాఘవులు పూర్తి ప్రసంగ పాఠం వినో చదివో విమర్శ చేస్తే బాగుండేది. సాక్షి ప్రచురించిన రాఘవులు వ్యాఖ్యను చూసి దొరికాడురా నాయాలా అన్నట్లు కమ్యూనిస్టులను దళిత ద్రోహులుగానో, పేదల వ్యతిరేకులుగానో ముద్ర వేసేందుకు పోస్టుల మీద పోస్టులు పెడుతున్నారు. సహజంగానే కమ్యూనిస్టు వ్యతిరేకులు కామెంట్ల రూపంలో ఆ పోస్టుల కింద తమ వ్యతిరేకతనూ అచ్చొత్తేస్తున్నారు.

సరే సాక్షి కథనం ప్రకారమే రాఘవులు ఇంగ్లీష్ మీడియం వలన ప్రయోజనం లేదు అన్నారు అనుకుందాం. దాని అర్థం ఎవరినీ ఇంగ్లీష్ నేర్చుకోవద్దని కాదే. ఇంగ్లీష్ మాధ్యమంలో చదువులు సరి కాదు అని చెప్పడానికి, అసలు ఇంగ్లీష్ వలన ఉపయోగం లేదని రాఘవులు అన్నారని చెప్పడానికి ఎంత తేడా ఉంది? ఏ ప్రయోజనాలు ఆశించి ఇలా టంగ్ ట్విస్టింగ్‌కు పాల్పడుతున్నారు. పత్రికలకు ఉన్నట్లే ఈ వాదన చేసేవాళ్లకూ రహస్య ఎజెండా ఏదో అన్నట్లు లేదూ వ్యవహారం. ఇంగ్లీష్ రానిదే, లేనిదే లోకం తెల్లారదు అన్నట్లు చేస్తున్న వాదన ఎబ్బెట్టుగా లేదూ. సకల వివక్షతల నుండి, దోపిడీల నుండి విముక్తి కావడానికి ఇంగ్లీష్ మాధ్యమంలో చదవడం ఒక్కటే మార్గం అన్నట్లు ఉన్నాయి ఈ వాదనలు.

మాతృభాషలోనే ప్రాథమిక విద్యాబోధన జరగాలి, సెకండరీ స్థాయి నుండి ఇంగ్లీష్ బోధన ఉండాలి, అలానే మన రాష్ట్రంలో ఉర్దూ, తమిళం, మలయాళం వంటి మైనారిటీ భాషల బోధన కూడా కొనసాగాలి అనేది సిపియం పార్టీ వైఖరి. ఇది ఏ రకంగా తప్పో విమర్శించండి, తప్పు లేదు. శ్వేత జాతి దేశాలయిన అమెరికా, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా-వీటి ఉపగ్రహ దేశాలు కొన్నింటి మినహా యూరప్, ఆసియా (సింగపూర్ వినా), మధ్య ప్రాచ్యం మొదలైన దేశాలన్నింటా ప్రాథమిక విద్యాబోధన మాతృభాషలోనే జరుగుతుంది. ఉన్నత విద్య, వృత్తి విద్యల కోసం చైనా, జర్మనీ వంటి దేశాలకు ఇతర దేశస్తులు ఎవరు వెళ్లినా వాళ్లకు ఆరు నెలల పాటు అక్కడి మాతృభాష అయిన మాండరీన్, జర్మనీ భాషలు ఉచితంగా, నిర్బంధంగా నేర్పిస్తారు. అట్లాంటిది మన దేశంలో అందునా మన రాష్ట్రంలోనే ప్రాథమిక విద్య నుండి ఆంగ్ల మాధ్యమంలోనే విద్యా బోధన జరగాలి అన్న వాదనకు ప్రాతిపదిక ఏమిటో వివరించి సిపియం వైఖరిని ఎండగట్టొచ్చు. స్వీపింగ్ కామెంట్స్, ఓవర్ జనరలైజేషన్లు సకారాత్మక విమర్శ ఎలా అవుతాయి?

చంద్రబాబు నాయుడు ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రాన్ని ప్రపంచ బ్యాంకు సంస్కరణలకు ప్రయోగశాలగా మార్చేసిన కాలం నుండి మన విద్యా వ్యవస్థ దారి తప్పింది. హయ్యర్ సెకండరీ స్థాయి నుండి మాత్రమే ప్రయివేటు విద్యా సంస్థల ప్రవేశానికి అనుమతి ఉండేదల్లా ప్రాథమిక విద్యా స్థాయి నుండి ప్రయివేటుకు అవకాశం కల్పించారు. చైతన్య, నారాయణ, రవీంద్రభారతి, కేశవరెడ్డి సంస్థలు ఇంగ్లీష్ మాధ్యమంలో చదివితే తప్ప పిల్లలు ఎందుకూ కొరగారు అనే స్థాయిలో పౌర సమాజాన్ని ప్రభావితం చేశాయి. ఇందుకు ప్రభుత్వ వత్తాసూ ఉంది. అదే చంద్రబాబు నాయుడు మరో అడుగు ముందుకేసి సోషల్ సైన్సెస్ చదువులు దండగ అని తేల్చేశారు. ఇంజనీరింగ్ ఒక్కటే రాచబాట అని నిర్ణయించేసి మండలానికో ఇంజనీరింగ్ కాలేజీ ఇచ్చేశారు. ఎక్కువలో ఎక్కువ ఇవి తెలుగుదేశం శాసన సభ్యులవో, ఆ పార్టీ రాజపోషకులవో కావడం గమనార్హం. ఒక్క మన రాష్ట్రంలోనే 272 ఇంజనీరింగ్ కాలేజీలు ఏటా సుమారు రెండు లక్షల మంది ఇంజనీర్లను జాబ్ మార్కెట్ లోకి గుమ్మరించేవి. ఇందులో 10 శాతం మందికి ఉద్యోగాలు దక్కితే గొప్ప. ఆ పది శాతం మందికి చంద్రబాబు గొప్ప దార్శనికుడు అయ్యాడు. కానీ రాష్ట్ర విద్యా వ్యవస్థ అస్తవ్యస్థమయిపోయింది. ఇదంతా చంద్రబాబు బుర్రకు పుట్టిన బుద్ధి కాదు. ప్రపంచబ్యాంకు ఆదేశించింది. చంద్రబాబు ఆచరించాడు. అందుకే నాడు ప్రజాతంత్రవాదులు, సామాజిక అభ్యుదయం కాంక్షించేవారు చంద్రబాబును ప్రపంచ బ్యాంకు జీతగాడు అని ఘాటుగా విమర్శించేవాళ్ళు.

ఇవాళ జగన్ కూడా ప్రాథమిక విద్య నుండి ఆంగ్ల మాధ్యమంలో బోధనా పద్ధతిని ప్రవేశపెడుతున్నారు. అంటే అక్కడికి జగన్ దళితులను, పేదలను ఉద్ధరించడానికి చేస్తున్నారని ఎవరైనా విశ్వసిస్తుంటే వాళ్లు పొరబడినట్లే. 'సపోర్టింగ్ ఆంధ్రప్రదేశ్‌స్ లెర్నింగ్ ట్రాన్స్ఫార్మేషన్' (సాల్ట్) పేరిట ప్రపంచ బ్యాంకు 2000 కోట్ల రూపాయల అప్పు ఇచ్చి మన విద్యా వ్యవస్థలో ఎలాంటి మార్పులు తీసుకురావాలో ఆదేశించింది (ఆసక్తి ఉన్నవాళ్ళు గూగుల్ చేస్తే 97 పేజీల డాక్యుమెంట్ నెట్‌లో దొరుకుతుంది.). ఆ ఆదేశాల్లో భాగమే ప్రాథమిక విద్య నుండి ఆంగ్ల మాధ్యమ బోధన, విలీనాల పేరిట స్కూళ్ల మూసివేతలు, బ్రిడ్జ్ స్కూళ్ల ఎత్తివేతలు.

ప్రపంచ బ్యాంకు తన యాభై ఏళ్ళ చరిత్రలో ఏ దేశానికి, ఏ రాష్ట్రానికి అప్పు ఇచ్చినా దాని వెనుక పశ్చిమ దేశ ప్రయోజనాలే ఉన్నాయే తప్ప ఫలానా దేశంలో, ఫలానా రాష్ట్రంలో అణగారిన ప్రజానీకాన్ని ఉద్ధరించాయి అని ఒక్కటంటే ఒక్క రుజువు చూపించగలరా ఎవరైనా?! అప్పుడు 'సాల్ట్' పథకంలో భాగంగా జగన్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ప్రాథమిక విద్యా స్థాయి నుండి ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన అచ్చంగా మన రాష్ట్రంలోని పేదలు, దళితులు, అణగారిన వర్గాల ప్రజల ప్రయోజనాల కోసం అని నమ్మేద్దాం. రాఘవులు విమర్శలు తాలో పొల్లో తేల్చేద్దాం.

వైసిపి ప్రభుత్వం పట్ల అభిమానం ఉందీ, మంచిది, ఉంచుకోండి, పొగుడుకోండి, పేదలు-దళితుల పాలిటి పెన్నిధి అని ప్రచారం చేసుకుంటారా చేసుకోండి. ఎవరికీ ఏ అభ్యంతరం ఉండాల్సిన పని లేదు. అది మీ హక్కు. జగన్ మీ దృష్టిలో గొప్ప సామాజిక విప్లవకారుడిగా అనిపిస్తున్నాడా దానితో కూడా మాకు పేచీ లేదు. కాకపోతే నిరాధారమైన ఆరోపణలతో కమ్యూనిస్టుల మీద అక్కసు ప్రదర్శిస్తున్నారు చూడండీ అది మాత్రం మా ఎబ్బెట్టుగా ఉంది. కమ్యూనిజం మంచిదే కానీ ఇక్కడ కమ్యూనిస్టులు ఉన్నారే అని సన్నాయి నొక్కులు నొక్కుతున్నారే.. నాయనలారా మీ విప్లవానుకూల విప్లవ వ్యతిరేక పెంపుడు సిద్ధాంతాలు ఉన్నాయే అవి మాత్రం కట్టిపెట్టండి. ఈ దేశపు ఫ్యూడల్ సమాజంలో కొన్ని దశాబ్దాలుగా కంబారితనంలో మగ్గిపోయిన అణగారిన ప్రజానీకం పోరుబాట నడిచి కూలీ, జీతం, కరువుభత్యం లాంటివి సాధించుకుంది ఈ దేశపు ఎర్రజండా అండతోనే. సమరశీల పోరాట స్ఫూర్తితో అణగారిన ప్రజలు సాధించుకున్న ఫలితాలను అంబేద్కర్ రాజ్యాంగ హక్కుగా స్థిరపరిచాడు. సామాజిక చలన సూత్రాల చరిత్రను విస్మరిస్తే మేధావులు దారి తప్పడం, వారి అభిమానులు గొర్రె దాటుకు అలవాటు పడడం ఖాయం. ఇది నివారించదగ్గ విషాదం. కాస్త తట్టుకోండి ప్లీజ్. లెట్ అజ్ హోప్ ఫర్ ద బెస్ట్.

- కె. సత్యరంజన్ ,
సాహితీ స్రవంతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్.

ప్రపంచ బ్యాంకు తన యాభై ఏళ్ళ చరిత్రలో ఏ దేశానికి, ఏ రాష్ట్రానికి అప్పు ఇచ్చినా దాని వెనుక పశ్చిమ దేశ ప్రయోజనాలే ఉన్నాయే తప్ప ఫలానా దేశంలో, ఫలానా రాష్ట్రంలో అణగారిన ప్రజానీకాన్ని ఉద్ధరించాయి అని ఒక్కటంటే ఒక్క రుజువు చూపించగలరా ఎవరైనా?! అప్పుడు 'సాల్ట్' పథకంలో భాగంగా జగన్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ప్రాథమిక విద్యా స్థాయి నుండి ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన అచ్చంగా మన రాష్ట్రంలోని పేదలు, దళితులు, అణగారిన వర్గాల ప్రజల ప్రయోజనాల కోసం అని నమ్మేద్దాం. రాఘవులు విమర్శలు తాలో పొల్లో తేల్చేద్దాం.



నిరుపయోగంగా చెత్త సంపద కేంద్రాలు

- స్వచ్ఛ భారత్ పథకం అమల్లో నిర్లక్ష్యం
- వ్యర్థాల నిర్వహణలో కనిపించని చిత్తశుద్ధి

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

పలు గ్రామపంచాయతీల్లో స్వచ్ఛ భారత్ పథకం అమలు సక్రమంగా లేదు. ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయిలో నిధులు విడుదల కాకపోవడం, ఆర్థిక సంఘాల నిధులు ఖర్చుపై ఆంక్షలు విధించడం, ఉన్న కాస్త సాధారణ నిధులు అభివృద్ధి పనులకు సైతం సరిపోకపోవడం వంటి అనేక కారణాల వలన పల్లెల్లో పారిశుద్ధ్యం బాగా క్షీణిస్తోంది. దీంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. చెత్త నుంచి సంపద తయారు చేసే విధంగా పలు పంచాయతీల్లో కేంద్రాలను ఏర్పాటు చేసినప్పటికీ నిరుపయోగంగా మారాయి. రూ.కోట్లు ఖర్చు చేసి వీటిని నిర్మించిన అక్కరకు రాకుండా పోతున్నాయి. దీంతో రోగాలతో సహవాసం చేయాల్సి వస్తుందని పల్లె ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాకినాడ జిల్లాలో 385 గ్రామ పంచాయతీలుండగా 4,85,089 కుటుంబాలున్నాయి. 15,00,798 మంది జనాభా నివసిస్తున్నారు. 290 గ్రామాలకు చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాలుండగా ఇంకా 95 కేంద్రాలు నిర్మాణాలు జరగాల్సి ఉంది. అధికారుల లెక్కల ప్రకారం 262 కేంద్రాల్లో మాత్రమే సంపద తయారవుతుంది. 28 పంచాయతీల్లో నిరుపయోగంగా మారాయి. అన్ని పంచాయతీల్లో రోజుకి సుమారు 16 టన్నులు ప్లాస్టిక్, కాగితాలు వంటి పొడి చెత్త, 30 టన్నుల తడి చెత్త, మరో 10 టన్నుల హానికరమైన వ్యర్థాలు ఉత్పత్తి జరుగుతోంది.

లక్ష్యంపై నిర్లక్ష్యం

స్వచ్ఛ భారత్ లక్ష్యం క్షేత్రస్థాయిలో నీరుగారిపోతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పల్లెలు పరిశుభ్రంగా ఉండడంతో పాటు, వ్యర్థాలతో పంచాయతీలకు సంపద సష్టించాలన్న ప్రభుత్వ ఆశయం అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంతో ముందుకు సాగడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వ్యర్థాల సేకరణ, నిర్వహణకు ఉద్దేశించిన చెత్త సంపద కేంద్రాలు అనేక చోట్ల నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. కొన్ని చోట్ల నిర్మాణం జరగలేదు. వీటిని మొదటి విడతలో మండల కేంద్రాల్లో, తరువాత క్రమంగా అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసి తద్వారా పంచాయతీకి ఆదాయం సమకూరేలా ప్రణాళిక రూపొందించినా ఆశించిన ఫలితం రావడం లేదు. స్వచ్ఛ భారత్ పథకం ద్వారా రూ.14 లక్షలు, ఉపాధి పథకం ద్వారా రూ.2 లక్షలు 2015లో కేటాయించారు. తరువాత పూర్తిగా ఉపాధి నిధులే వెచ్చించారు. సిమెంటు ప్లాట్ ఫామ్, వర్మీ కంపోస్టు తయారీకి పిట్లు, తడి, పొడి వ్యర్థాలు వేరు చేసేందుకు కంపార్టుమెంట్లు నిర్మించారు. వ్యర్థాల రవాణాకు ట్రాక్టర్, రిక్షా కొనుగోలు చేశారు. దీనిపై సిబ్బందికి శిక్షణ కూడా ఇచ్చారు. కానీ అనేక చోట్ల వాహనాలు రక్షణ లేక మరమ్మతులు గురై మూలకు చేరాయి. సిబ్బందికి సకాలంలో వేతనాలు ఇవ్వడం లేదు. నెలల తరబడి పెండింగ్ పెడుతున్నారు. దాంతో వ్యర్థాల రవాణా పనిచోట్ల సక్రమంగా సాగడం లేదు.

అధ్వాన్నంగా పారిశుధ్యం

పలు పంచాయతీల్లో పారిశుధ్యం పూర్తిగా క్షీణిస్తున్న పరిస్థితులు నెలకొన్నాయి. శివారు గ్రామాల్లో పారిశుధ్య పనులు అసలు జరగడం లేదని స్థానికులు విలపిస్తున్నారు. కరప మండలంలోని వేపకాయలపాలెం, గురజనాపల్లి, యు.కొత్తపల్లి మండలంలోని ఉప్పాడ, వాకతిప్ప, అమీనాబాద్, కొత్తపల్లి, కొమరగిరి, గొల్లప్రోలు మండలం చేబ్రోలు, వన్నెపూడి, చిన్న జగ్గంపేట, దుర్గాడ, చెందుర్తి, తాటిపర్తి, కాకినాడ రూరల్ మండలంలోని ఇంద్రపాలెం, చీడిగ, కొవ్వాడ, రేపూరు, కొవ్వూరు, రమణయ్యపేట, వాకలపూడి, వలసపాకల, సూర్యారావుపేట, పి.వెంకటాపురం, పెదపూడి మండలంలోని శహపురం, పెదపూడి, సంపర, వేండ్ర, కాండ్రేగుల, ఏలేశ్వరం మండలంలోని ఎర్రవరం, పిఠాపురం మండలంలో గోకివాడ, మాధవపురం, చిత్రాడ, విరవాడ, మంగితుర్తి తదితర గ్రామాల్లో పారిశుద్ధ్య పరిస్థితులు తీవ్రంగా ఉండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఓ పక్క చెత్త నుంచి సంపద కేంద్రాలు అక్కరకు రాక మరోవైపు అధికారుల నిర్లక్ష్యం వెరసి గ్రామాల్లో పోగుబడిన చెత్తను ఊరు శివారున, బహిరంగ ప్రదేశాల్లోనూ, రోడ్లకు ఇరువైపుల వేస్తున్నారు. దీంతో ప్రజలు రోగాలతో సతమతమవుతుండడమే కాకుండా తీవ్ర దుర్వాసనతో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. దీనిపై తక్షణం స్పందించి అధికారులు చెత్త నిర్వహణపై పూర్తిస్థాయిలో దష్టి సారించి ప్రజలు రోగాలు బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు. స్వచ్ఛ భారత్ లక్ష్యాన్ని ముందుకు తీసుకువెళ్లాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

జెడ్‌పి సమావేశానికి ఎమ్మెల్యేలు డుమ్మా!

- తూతూమంత్రంగా జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం
- కనీసం పట్టని మంత్రులు, 15 మంది ఎంఎల్ఎలకు ఇద్దరే హాజరు
- తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ రాకపోవడంపై సభ్యుల అసంతృప్తి
- ఇళ్ల నిర్మాణం, కరువు, సాగునీటి సమస్యలపై స్థానిక ప్రజాప్రతినిధుల ఏకరువు

ప్రజాశక్తి- ఏలూరు ప్రతినిధి

జిల్లాలోని సమస్యలకు పరిష్కార వేదికగా కొనసాగే జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం తూతూమంత్రం అన్నట్లు మారిపోయింది. మంత్రులు, ఎంఎల్ఎలు జెడ్‌పి సమావేశాన్ని పూర్తిగా పట్టించుకోని పరిస్థితి కన్పిస్తోంది. దీంతో ప్రజా సమస్యల పరిష్కారానికి వేదికగా ఉండాల్సిన సమావేశం నామకేవాస్తే అన్నట్లు తయారైందనే విమర్శలు విన్పిస్తున్నాయి. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ అధ్యక్షతన జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉమ్మడి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. సమావేశం తీరు చూసిన వారందరిలో జెడ్‌పి సమావేశం ఇలా తయారైందేమిటనే చర్చ సాగింది. గత ప్రభుత్వ హయాంలో జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి ప్రత్యేక స్థానం ఉండేది. ఉదయం నుంచి సాయంత్రం వరకూ సమావేశం సాగేది. మంత్రులు, ఎంఎల్ఎలు అంతా హాజరై ప్రజాసమస్యలపై సుదీర్ఘంగా చర్చించి నిర్ణయాలు తీసుకునేవారు. అలసత్వంగా వ్యవహరించే అధికారులను సమావేశంలోనే నిలదీసేవారు. ఇప్పుడు అటువంటి పరిస్థితి లేకుండాపోయింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 15 మంది ఎంఎల్ఎలు ఉండగా జిల్లా పరిషత్ సమావేశానికి దెందులూరు ఎంఎల్ఎ అబ్బాయిచౌదరి, ఉంగుటూరు ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు మినహా ఏఒక్క ఎంఎల్ఎ హాజరు కాలేదు. ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎంఎల్‌సి షేక్ సాబ్జీ హాజరయ్యారు. ఉమ్మడి జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉండగా జిల్లాల విభజన జరిగాక ఒక్క మంత్రి కూడా జిల్లా పరిషత్ సమావేశానికి హాజరు కావడం లేదు. జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, పశ్చిమ కలెక్టర్ పి.ప్రశాంతి సమావేశానికి హాజరై సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. జిల్లాలోని తొమ్మిది మండలాలు విభజనలో తూర్పుగోదావరి జిల్లాలో కలిశాయి. అక్కడి స్థానిక ప్రజాప్రతినిధులు లేవనెత్తే సమస్యలకు సమాధానం చెప్పేందుకు ఆ జిల్లా నుంచి కలెక్టర్‌గాని, జాయింట్ కలెక్టర్‌గాని ఏఒక్కరూ రాలేదు. దీంతో అక్కడి స్థానిక ప్రజాప్రతినిధులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అదే కృష్ణా జిల్లా జెడ్‌పి సమావేశానికి ఇక్కడి అధికారులు వెళ్లకపోతే అక్కడి ప్రజాప్రతినిధులు తీవ్ర అభ్యంతరం తెలపడమే కాకుండా, ముఖ్యమంత్రి కార్యాలయం వరకూ సమస్యను తీసుకెళ్లిన సంగతి తెలిసిందే. మంత్రులు, ఎంఎల్ఎలు సమావేశాలకు రాకపోవడంతో అధికారులను నిలదీసే పరిస్థితి లేకుండాపోయింది. దీంతో సమస్యలపై సభ్యులకు సంతృప్తికరమైన సమాధానాలు రావడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కొన్ని విధానపరమైన నిర్ణయాల విషయంలో మంత్రులు ఉంటే తర్వాత సిఎంతో మాట్లాడే అవకాశం ఉంటుంది.

మంత్రులు రాకపోవడంతో సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. జిల్లా పరిషత్ సమావేశంలో లేవనెత్తిన సమస్యలకు ప్రత్యేకత ఉంటుంది. మినిట్స్‌లో నోట్ అవుతాయి. తర్వాత సమావేశంలోపు పరిష్కరించకపోతే అధికారులు సమాధానం చెప్పాల్సి ఉంటుంది. అంతటి ప్రాధాన్యత కలిగిన ఈ సమావేశానికి మంత్రులు, ఎంఎల్ఎలు రాకపోవడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. రోజంతా జరగాల్సిన సమావేశం మధ్యాహ్నం 2.30 గంటలకు ప్రారంభించి మమ అన్పించేస్తున్నారు. జెడ్‌పిటిసి, ఎంపిపిలు లేవనెత్తిన ఒకటి, రెండు సమస్యలపై ముక్తసరిగా సమాధానాలు

ఎండిపోతున్న చేలు...

- పశువుల మేతకు వరిపంట

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

వరి సాగు ఎంతో ఆశాజనకంగా ఉంటుందని ఆశించిన రైతులకు ఈఏడాది వర్షాలు అనుకూలించకపోవడం, సాగునీటి వనరులు అందుబాటులో లేక తమ కళ్లముందే పంటలు ఎండిపోతున్నాయి. దీంతో మండలంలోని పలు గ్రామాల్లో రైతులు తమ పంటపొలాల్లోకి పశువులను తోలేస్తున్న దయనీయమైన పరిస్థితి ఎక్కడికక్కడే కనబడుతుంది. మండలంలోని ఎమ్మార్ నగరంలో రొంపిల్లి జగన్నాథం అనే రైతు ఎండిన చేలను కళ్లతో చూడలేక దగ్గర ఉండి మరీ పశువులను పొలాల్లో తోలి వాటికి మేతగా వేశారు. మండలంలో 18వేల ఎకరాల్లో వరి సాగుకు అనువైనప్పటికీ సకాలంలో వర్షాలు కురవకపోవడంతో ఈ ఏడాది కేవలం 15వేల ఎకరాల్లో నాట్లు పడ్డాయి. దాదాపు 2వేల ఎకరాల వరకూ రైతులు వెదజల్లే పద్ధతిలో విత్తనాలు జల్లుకున్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌సీజన్ ప్రారంభం నాటి నుంచి వర్షాభావ పరిస్థితులు ఏర్పడినప్పటికీ సెప్టెంబర్ మొదటివారం నుండి మూడో వారం వరకూ ఎడతెరపిలేకుండా కురిసిన వానలకు రైతులు ఎంతో ఆశతో వరిసాగును కొనసాగించారు. కాస్త ఆలస్యంగానైనా ఉభాలు కొనసాగించారు. అయితే సెప్టెంబర్ శివారు వారం నుంచి ఇప్పటికీ చినుకుల జాడలేకపోవడంతో తమ పంటలను కాపాడుకోలేక రైతులు చేతులు ఎత్తేశారు. నీటివనరులు ఉన్న రైతులు దిగుబడికి మించి ఖర్చు చేస్తూ డీజల్ ఇంజన్లతో దూరాబారాల నుంచి నీళ్లు తోడించుకుంటున్నారు. చెరువుల కింద, ఆయకట్ట రైతులు ఆ మాత్రం నీటితడులు ఇచ్చి పంటను రక్షించుకున్నప్పటికీ దాదాపు 30 శాతం మంది రైతుల పొలాలకు నీటికి కటకటలాడాల్సిన పరిస్థితి. ఈ పరిస్థితిపై వ్యవసాయ అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలు ప్రకారం మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించడం కుదరదని, ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు వర్షాలు అనుకూలించక పోవడంతో పంటలు ఎండిపోవడమన్నది యధార్థమని, మండలంలో దాదాపు 92శాతం ఇ-క్రాప్ నమోదైనందున నష్టపోయిన భూముల వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. తప్పకుండా వాటికి పరిహారం అందించి తగు న్యాయం చేస్తామంటున్నారు. ఈ ఏడాది అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని మండలానికి జీవాధారమైన జంఝావతి ఎగువకాలువ, అడారు ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తి చేసి రైతులను అదుకోకపోతే భవిష్యత్తులో రైతాంగం తీవ్రమైన దుర్భిక్ష పరిస్థితులు చూడాల్సి ఉంటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రోలర్ స్కేటింగ్‌లో హాసినికి 2 బంగారు పతకాలు



ప్రజాశక్తి-విజయనగరం

1	**అప్లికెంట్/ ఋణగ్రహీత : 1) శ్రీ బొల్లా రాజశేఖర్ రెడ్డి, తండ్రి : బొల్లా కృష్ణారెడ్డి, యూనిట్ నెం.1205, 12వ ఫ్లోర్, వాల్‌నట్ బ్లాక్, రెయిన్ ట్రీ పార్క్ ద్వారకా కృష్ణ అపార్ట్‌మెంట్, నంబూరు గ్రామ పంచాయతి, గుంటూరు జిల్లా.**	**ఆస్తి వివరాలు షెడ్యూలు ఎ:** ది.09-01-2017 నాటి విక్రయ దస్తావేజు నెం.82/2017 ప్రకారం గుంటూరు జిల్లా, పెదకాకాని సబ్ జిల్లా, నంబూరు గ్రామ పంచాయతి, నంబూరు గ్రామ ఆర్.ఎస్ నెం.214/1(7.30 సెంట్లు), ఆర్.ఎస్ నెం.217(2-68 సెంట్లు), ఆర్.ఎస్ నెం.216/2 (9-34 సెంట్లు), ఆర్.ఎస్ నెం.213/ఎ1 (0.77 సెంట్లు), ఆర్.ఎస్ నెం.213/బి1 (1-02 సెంట్లు) డోర్ నెం.25-212 దగ్గర, రెయిన్ ట్రీ పార్క్ ద్వారకా కృష్ణ అపార్ట్‌మెంట్, 102172.40 చ॥గ॥లు లేదా 21-11 సెంట్ల విస్తీర్ణములోని స్థలములోని అవిభాజిత వాటా 18.50 చ॥గ॥ల లేదా 15.46 చ॥మీ॥ల విస్తీర్ణము గల స్థలము. **దీనికి హద్దులు : తూర్పు :** శ్రీ విశ్వరూప శ్రీనివాస క్షేత్ర ట్రస్ట్ ఆస్థి కొంత మేర మరియు ఇతరుల ఆస్తి కొంతమేర, **దక్షిణం :** లింగమనేని టౌన్‌షిప్ ప్రైవేట్ లిమిటెడ్ ఆస్తి కొంత మేర, ఎన్.హెచ్.ఎ.ఐ ఆస్తి కొంత మేర మరియు శ్రీ విశ్వరూప శ్రీనివాస క్షేత్ర ట్రస్ట్ ఆస్థి కొంతమేర, **పడమర :** కంతేరు రోడ్డు ఆస్తి కొంత మేర, లింగమనేని టౌన్‌షిప్ ప్రైవేట్ లిమిటెడ్ ఆస్తి కొంత మేర మరియు ఇతరుల ఆస్తి కొంతమేర, **ఉత్తరం :** లింగమనేని టౌన్‌షిప్ ప్రైవేట్ లిమిటెడ్ యొక్క ఆస్తి. **షెడ్యూలు ఆస్తి బి :** రెయిన్ ట్రీ పార్క్ ద్వారకా కృష్ణ అపార్ట్‌మెంట్, 12వ ఫ్లోర్, వాల్‌నట్ బ్లాక్, 1279 చ॥అ॥లు + 1450 చ॥అ॥ల ప్లింత్ ఏరియా మరియు 268 చ॥అ॥ల కార్ పార్కింగ్ గల యూనిట్ నెం.1205కు సంబంధించిన యావదాస్తి. **దీనికి హద్దులు : తూర్పు :** శూన్యాకాశము, **దక్షిణం :** యూనిట్ నెం.1204 మరియు శూన్యాకాశము, **పడమర :** వరండా, **ఉత్తరం :** శూన్యాకాశము.	లోన్ అకౌంట్ నెం. 710800004657, డిమాండ్ నోటీసు తేది: 31-08-2023 రూ.33,98,166.12 పై॥ ది.01-09-2023 నుండి భవిష్య వడ్డీ + ఇతర ఖర్చులతో సహా యఫ్‌యుపి తేది : 10-04-2023
2	**అప్లికెంట్/ ఋణగ్రహీత : 1) శ్రీ పులగం ప్రసాద్(అప్లికెంట్), తండ్రి : శ్రీ పులగం శామ్యూల్ (2) శ్రీమతి శోభారాణి బిట్రా(కో-అప్లికెంట్), భర్త : శ్రీ పులగం ప్రసాద్, ఫ్లాట్ నెం.301, 3వ అంతస్థు, అఖిల్ ఆర్కేడ్ అపార్ట్‌మెంట్, డి.నెం.25-14-70, నగరంపాలెం, ఆర్. అగ్రహారం, గుంటూరు, 3) శ్రీ జెట్టి దేవ కాంతయ్య (హామీదారు), తండ్రి : శ్రీ లూథర్, కుంకలగుంట, నకరికల్లు, గుంటూరు జిల్లా-522615.**	**ఆస్తి వివరాలు షెడ్యూలు ఎ:** ది.19-06-2007 నాటి విక్రయ దస్తావేజు నెం.9196/2007, అగ్రిమెంట్ కన్‌స్ట్రక్షన్ దస్తావేజు నెం.9199/2007ల ప్రకారం ఆంధ్రప్రదేశ్, గుంటూరు జిల్లా, గుంటూరు సబ్ జిల్లా, గుంటూరు మునిసిపల్ కార్పోరేషన్, రామచంద్రపుర అగ్రహారం, నగరంపాలెం, పాత మున్సిపల్ వార్డు నెం.17, కొత్తవార్డు నెం.22, బ్లాక్ నెం.18, టి.ఎస్.నెం.510/1, సమీప డోర్ నెం.25-14-70 నందు మొత్తం 712.2/3 చ॥గ॥లు లేదా 595.47 చ॥మీ॥ల స్థలంలో అవిభాజ్యపు భాగమైన 35 చ॥గ॥లు లేదా 29.26 చ॥మీ॥ల విస్తీర్ణముగల భూమికి సంబంధించిన యావదాస్తి. **దీనికి హద్దులు : తూర్పు :** జోరిగ ఏడుకొండల రావు ఆస్తి, **దక్షిణం :** నక్రికంటి నాగేశ్వరరావు ఆస్తి, **పడమర :** 40 అడుగుల వెడల్పు గల మున్సిపల్ కార్పోరేషన్ రోడ్డు, **ఉత్తరం :** జి.టి. రోడ్డు. **షెడ్యూలు బి :** గుంటూరు మునిసిపల్ కార్పోరేషన్, ఆర్. అగ్రహారం, నగరంపాలెం, అఖిల్ ఆర్కేడ్, 3వ అంతస్థులోని 835 చ॥అ॥ల (ప్లింత్ ఉమ్మడి ఏరియా) గల ఫ్లాట్ నెం.301 యావదాస్తి. **దీనికి హద్దులు : తూర్పు :** శూన్యాకాశము, **దక్షిణం :** శూన్యాకాశము, **పడమర :** ఉమ్మడి కారిడార్, **ఉత్తరం :** శూన్యాకాశము & లిఫ్ట్.	లోన్ అకౌంట్ నెం. 710800007197, డిమాండ్ నోటీసు తేది: 05-08-2023 రూ.11,13,688/- ది.06-08-2023 నుండి భవిష్య వడ్డీ + ఇతర ఖర్చులతో సహా, యఫ్‌యుఐ తేది :10-04-2023
3	**అప్లికెంట్/ ఋణగ్రహీత : 1) కుమారి గుత్తికొండ అరుణ (అప్లికెంట్/ఋణగ్రహీత), తండ్రి : శ్రీనివాసరెడ్డి, డి.నెం.109/1, అంకమ్మతల్లి గుడి దగ్గర, మంచాల గ్రామము మరియు పంచాయతీ, గుంటూరు జిల్లా, చేబ్రోలు మండలం, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522002,** **2) కుమారి గుత్తికొండ అరుణ (అప్లికెంట్/ఋణగ్రహీత), తండ్రి : శ్రీనివాసరెడ్డి, హెచ్.నెం.484, అన్నయ్యరెడ్డి బిల్డింగ్, 4వ క్రాస్, రామాంజనేయ లేఅవుట్, బెంగుళూరు, మారతాహళ్ళి బ్రిడ్జి, బెంగుళూరు, కర్నాటక-560037.**	**ఆస్తి వివరాలు షెడ్యూలు ఎ:** ది.07-12-2019 నాటి విక్రయ దస్తావేజు నెం.11247/2019 ప్రకారం గుంటూరు జిల్లా, చేబ్రోలు సబ్ జిల్లా, చేబ్రోలు మండలం, మంచాల గ్రామపంచాయతీ ఏరియా, మంచాల గ్రామము, డి.నెం.109/1, అసెస్‌మెంట్ నెం.321, డోరు నెం.3-49 నందు మొత్తం 284 చ॥గ॥ల విస్తీర్ణమునకు సమానమైన 238.56 చ॥మీ॥ల విస్తీర్ణముగల స్థిరాస్తి రెసిడెన్షియల్ స్థలమునకు సంబంధించిన యావదాస్తి. **దీనికి హద్దులు : తూర్పు :** బొల్లిముంత సత్యనారాయణ యొక్క ఆస్తి, **దక్షిణం :** పంచాయతీ బజారు, **పడమర :** పోగుల సత్యనారాయణ యొక్క ఆస్తి, **ఉత్తరం :** సోమరౌతు శివయ్య మరియు ఇతరుల యొక్క ఆస్తి.	లోన్ అకౌంట్ నెం. 710800008106 డిమాండ్ నోటీసు తేది: 25-09-2023 రూ.35,51,016.38 పై॥ ది.26-09-2023 నుండి భవిష్య వడ్డీ + ఇతర ఖర్చులతో సహా, యఫ్‌యుఐ తేది :10-05-2023
4	**అప్లికెంట్/ ఋణగ్రహీత : 1) శ్రీ చింతా రాంబాబు (అప్లికెంట్/ఋణగ్రహీత), తండ్రి : చింతా దుర్గారావు, 2) శ్రీమతి చింతా భవాని (కో-అప్లికెంట్/(కో-ఋణగ్రహీత), భర్త : చింతా రాంబాబు, డి.నెం.395యఫ్, దక్షిణం వైపున గల రిజిస్టర్ విక్రయ దస్తావేజు నెం.2451/1986 లోని 300 చ॥గ॥లు, ప్రక్కన డోరు నెం.136-11-613, యమ్‌జి ఇన్నర్ రింగ్ రోడ్, శ్రీ నిలయం అపార్ట్‌మెంట్ దగ్గర, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522005.**	**ఆస్తి వివరాలు షెడ్యూలు ఎ:** ది.31-03-2022 నాటి దస్తావేజు నెం.4682/2022 ప్రకారం, గుంటూరు జిల్లా, గుంటూరు జిల్లా రిజిస్ట్రార్ యిలాకా, గుంటూరు మునిసిపల్ కార్పోరేషన్ ఏరియా, గుంటూరు గ్రామము, డి.నెం.395యఫ్, డి.నెం.395/యఫ్2, సమీప పాత డోరు నెం.7-6-848, సమీప ప్రస్తుత డోరు నెం.136-11-613 నందు 238 చ॥గ॥ల విస్తీర్ణమునకు సమానమైన 198.99 చ॥మీ॥ల విస్తీర్ణముగల స్థిరాస్తి రెసిడెన్షియల్ స్థలము (మొత్తం 300 చ॥గ॥లలో దక్షిణంవైపు పోర్షన్) నకు సంబంధించిన యావదాస్తి. **దీనికి హద్దులు : తూర్పు :** 30 అ.ల వెడల్పు గల రోడ్డు, **దక్షిణం :** 20 అ.ల వెడల్పు గల రోడ్డు, **పడమర :** డోరు నెం.136.11-613 యొక్క ఆస్తి, **ఉత్తరం :** యస్.కన్యక విజయరాణి యొక్క మిగిలిన ఆస్థి.	లోన్ అకౌంట్ నెం. 710800010474 డిమాండ్ నోటీసు తేది: 08-08-2023 రూ.26,00,732/- ది.09-08-2023 నుండి భవిష్య వడ్డీ + ఇతర ఖర్చులతో సహా, యఫ్‌యుఐ తేది :10-04-2023

స్థలము : గుంటూరు, తేది : 18-11-2023
సం/- అధీకృత అధికారి, ఎల్ఐసి హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న విజయ రాఘవన్

రాజస్థాన్‌లో పోటా పోటీ ప్రచారం

• కాంగ్రెస్, బిజెపిలకు అసమ్మతి నేతల దెబ్బ • ఇండిపెండెంట్లుగా పలువురు రంగంలోనే !

అత్యంత కీలక రాష్ట్రమైన రాజస్థాన్ శాసనసభ స్థానానికి ఎన్నికలు మరో వారం రోజుల్లో.జరగనున్నాయి. ఇక ప్రచారానికి ఐదారు రోజులు మాత్రమే ఉండడంతో ప్రధాన పార్టీల ప్రచారం ఊపందుకుంది. ఇప్పటికే కాంగ్రెస్ తరఫున సోనియా, రాహుల్, ఖర్గే, ప్రియాంక, బిజెపి తరఫున మోడీ, నడ్డా, అమిత్‌షా వంటి నేతలు విడతల వారీగా ప్రచారం నిర్వహించి రాజకీయ వేడిని పెంచారు. ప్రస్తుతం ఇక్కడ ...అశోక్ గెహ్లాట్ నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తుండగా, ఈసారి ఎలాగైనా పాగా వేయాలని బిజెపి ఉవ్విళ్లూరుతోంది. రాజస్థాన్‌లో మొత్తం 200 శాసనసభ స్థానాలకు ఈనెల 25న ఒకే విడతలో పోలింగ్ జరగనున్నది. నామినేషన్ల ఉపసంహరణ అనంతరం 1875 మంది బరిలో ఉన్నారు. వీరిలో 183 మంది మహిళలు. జోత్వారాలో అత్యధికంగా 18 మంది, దౌసా జిల్లా లాల్‌సోట్‌లో ..అత్యల్పంగా.. ముగ్గురు మాత్రమే పోటీలో ఉన్నారు.

రాజస్థాన్‌లోని భద్ర అసెంబ్లీ నియోజకవర్గంలో సిపిఎం సిట్టింగ్ ఎమ్మెల్యే బల్వాన్ పునియాకు మద్దతుగా తరలివచ్చిన వేలాదిమంది ప్రజలు

సామాజిక తరగతుల ప్రాబల్యం ఎక్కువే !

సామాజిక తరగతుల ప్రాబల్యం ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో రాజస్థాన్ కీలక రాష్ట్రంగా చెప్పవచ్చు. జాట్‌లు, గుజ్జర్లు, రాజ్‌పుత్‌లు, ఎస్సీలు రాష్ట్ర జనాభాలో కీలకంగా ఉన్నారు. ఒకవైపు మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాల ప్రభావం ఈసారి గణనీయంగా ఉండొచ్చని రాజకీయ పరిశీలకులు చెపుతున్నారు. ఏ పార్టీ అయినా వరుసగా రెండోసారి అధికారంలోకి రాదన్న ఆనవాయితీని బ్రేక్ చేయాలని కాంగ్రెస్ భావిస్తుండగా, ఆనవాయితీ కొనసాగి ప్రజలు తమకే పట్టం కడతారని బిజెపి భావిస్తోంది. ప్రత్యేకించి ఫలానా సామాజిక తరగతి వారు తమకే ఎప్పుడూ మద్దతుగా ఉన్నారని పాలక పార్టీలు చెప్పుకుంటున్నా.. అది వాస్తవం కాదు..ఏ సామాజిక తరగతికి చెందిన వారైనా గుంపగుత్తగా బిజెపిని గానీ, కాంగ్రెస్‌ను గానీ ఏకపక్షంగా గెలిపించిన సందర్భాలు లేవు. జాట్‌లు, గుజ్జర్లు, రాజ్‌పుత్‌లు....ప్రధానంగా ..వీరు తమ సామాజిక తరగతికి చెందిన వారే సిఎంగా ఉండాలని, శాసనసభలో అత్యధిక మంది సభ్యులుగా ఉండాలని కోరుకుంటున్నారు. దీనికి అనుగుణంగా ఆయా సామాజిక తరగతులకు చెందిన వారు గత కొన్ని నెలల కాలంలో సభలు నిర్వహించి రాజకీయంగా వత్తిడి తేవడం ప్రారంభించారు. ఉదాహరణకు ...మార్వాడ్, శెఖావట్ ప్రాంతాల్లో ప్రాబల్యం ఎక్కువగా ఉన్న జాట్‌కు చెందిన వారు రాష్ట్ర అసెంబ్లీకి గత ఎన్నికల్లో 42 మంది ఎన్నికయ్యారు. ప్రస్తుతం ఆ సంఖ్యను 50కి పెంచుకోవాలని వారి సభల్లోనే బహిరంగంగానే పిలుపునిచ్చారు. జాట్‌ల కోడలైన వసుంధరారాజేకు ప్రాధాన్యత తగ్గించడం, ఆ సామాజిక తరగతికే చెంది, బిజెపి సిఎం అభ్యర్థిగా ప్రచారంలో ఉన్న సతీష్ పునియాను బిజెపి రాష్ట్ర అధ్యక్షుడి బాధ్యతల నుండి తప్పించడం పట్ల బిజెపి పట్ల ఈ సామాజిక తరగతి వారు వ్యతిరేకంగా ఉన్నారన్న ప్రచారమూ జరుగుతోంది. అలాగే కొంత కాలం ఎన్‌డిఎతో సంబంధాలు నెరపి ...ఆ తరువాత బయటకొచ్చిన రాష్ట్రీయ లోక్ తాంత్రిక్ పార్టీ (ఆర్ఎల్‌పి), జననాయక్ జనతాపార్టీ (జేజేపి) ...ఈ సామాజిక ఓట్లను కొంత వరకు బిజెపికి పడకుండా చీల్చవచ్చని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. అలాగే తూర్పు రాజస్థాన్‌ప్రాంతంలోని కరోలి, టోంక్, దౌసా, హిండౌన్ ప్రాంతాల్లో గుజ్జర్ల ప్రభావం గణనీయంగా ఉంది. 2018లో సచిన్‌పైలెట్‌ను సిఎం చేస్తారనే ఉద్దేశ్యంతో వారు కాంగ్రెస్ వైపు మొగ్గుచూపారనీ, అయితే ఆ తరువాత డిప్యూటీ సిఎంకే పరిమితం చేసి...ఆ తరువాత దానినీ వెనక్కితీసుకున్నందున....కాంగ్రెస్ పట్ల ఈ సామాజిక తరగతి వారు గుర్రుగా ఉన్నారని చెపుతున్నారు.

రెండు పార్టీలకూ అసమ్మతి బెడద

బిజెపిలోనూ, కాంగ్రెస్‌లోనూ అసమ్మతినేతల ప్రభావం ఈసారి ఆయా పార్టీలపై గణనీయంగా ఉండొచ్చని చెపుతున్నారు. బిజెపి తరఫున గత ఎన్నికల్లో ఒకే ఒక ముస్లిం అభ్యర్థికి మాత్రమే పోటీకి అవకాశం కల్పించారు. ఇప్పుడాయనకూ మొండిచేయే చూపించింది. దీంతో....వసుంధర రాజేకు ముఖ్యఅనుచరుడిగా ఉన్న ఆయన ఇండిపెండెంట్‌గా ఈసారి బరిలో ఉన్నారు. అలాగే మాజీ స్పీకర్, బిల్వారా జిల్లాలోని షాపూరా నియోజకవర్గం నుండి ఆరుసార్లు గెలిచిన కైలాష్ మేఘవాల్‌కు సీటు ఇవ్వలేదు. దీంతో ఆయన ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తున్నారు. కేంద్ర మంత్రి అర్జున్‌రామ్ మేఘవాల్‌పై అవినీతి ఆరోపణలు చేసినందుకు ఆయనకు సీటు ఇవ్వలేదనే ప్రచారం జరుగుతోంది.

అశోక్‌గెహ్లాట్‌కు సచిన్‌పైలెట్, ఆయన అనుయాయుల నుండే ఇబ్బంది ఎదురయ్యే పరిస్థితి కన్పిస్తోంది. సిఎం పదవికి సంబంధించి కాంగ్రెస్ అధిష్టానం....నిర్దిష్టమైన హామీ ఇస్తే తప్ప గెహ్లాట్‌కు సచిన్ పూర్తిస్థాయిలో సహకరించే పరిస్థితి లేదు. అలాగే...ఇండిపెండెంట్లుగా రంగంలో ఉండడం లేదా అధికార పార్టీ అభ్యర్థులకు సహకరించని దాదాపు 49 మందిని ఆ పార్టీ ఆరేళ్లపాటు బహిష్కరించింది.

తాజా ఎన్నికల్లో రాష్ట్రీయ లోక్ తాంత్రిక్ పార్టీ (ఆర్ఎల్‌పి), జననాయక్ జనతాపార్టీ (జేజేపి)ల ప్రభావం కూడా కొంతవరకు ఉంటుందని రాజకీయ పరిశీలకులు చెపుతున్నారు. 17 స్థానాల్లో . సిపిఎం అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. వీరి తరఫున ఇప్పటికే బృందాకరత్, సీతారాం ఏచూరి...వంటి నేతలు ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ఈ పార్టీకి అసెంబ్లీలో రెండు స్థానాలున్నాయి.

తగ్గుతున్న బిజెపి గ్రాఫ్

బిజెపి గ్రాఫ్ కూడా గత కొన్నేళ్లుగా ఈ రాష్ట్రంలో తగ్గుతోంది. గత సాధారణ ఎన్నికల తరువాత జరిగిన కొన్ని ఉప ఎన్నికల్లో సైతం బిజెపిని ప్రజలు ఓడించారు. నిత్యావసర సరుకుల ధరలు పెరగడం, వ్యవసాయ చట్టాలు తేవడం, మతోన్మాద చర్యలు, మోడీ-అమిత్‌షా ఒంటెద్దు పోకడలు, వసుంధరరాజే మినహా .... బిజెపిని గట్టెక్కించగల రాష్ట్రస్థాయి నేతలు లేకపోవడం ఆ పార్టీని దెబ్బతీయవచ్చని రాజకీయ పరిశీలకులు చెపుతున్నారు.

కాంగ్రెస్‌ను వెంటాడుతున్న అవినీతి

కాంగ్రెస్‌లో సచిన్‌పైలెట్ ...అసమ్మతి నేతగా ఉండి పలుమార్లు బహిరంగంగానే రాష్ట్ర ప్రభుత్వ అవినీతిపై రోడ్డెక్కారు. ఒక దశలో కాంగ్రెస్ అధ్యక్షుడిగా గెహ్లాట్‌గా నియమించి పరిస్థితులను చక్కదిద్దాలని ఆ పార్టీ అధిష్టానం భావించింది. అయితే అధ్యక్ష పదవితో పాటు ..సిఎంగానూ కొనసాగించాలని గెహ్లాట్ మొండికేయడంతో ఎన్నికల ఏడాదిలో నష్టం జరుగుతుందేమోనని భావించి ...ఆ పార్టీ ..అప్పటికి ఆ అంకాన్ని ముగించింది. ఇటీవలి కాలంలో మధ్యాహ్న బోజన పథకంలో అవకతవకలు జరిగాయని మంత్రి రాజేంద్రయాదవ్ సహా 9 మంది నేతలు, గెహ్లాట్ కుమారుడు, సోదరుని ఇళ్లపై, కార్యాలయాలపైన ఇడి దాడులు నిర్వహించింది. జలజీవన్ మిషన్‌కు చెందిన 25 ప్రదేశాలపై ఇటీవల దాడులు నిర్వహించింది. కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతి ప్రధానాంశంగా బిజెపి ప్రచారాస్త్రాన్ని ఉపయోగిస్తోంది.

ఏదైమైనా ఈ రాష్ట్రంలో ప్రధాన పార్టీలుగా ఉన్న ఈ రెండింటిలో దేనికి విజయావకాశాలున్నాయో తెలియాలంటే డిసెంబర్ 3 వరకు వేచి చూడాల్సిందే. మిగతా పార్టీలు ఉనికిలో ఉన్నా రాష్ట్రమంతటా ప్రభావం చూపే పరిస్థితి లేదు.

దేశానికి బిజెపి ప్రమాదకరం

- ప్రజల చైతన్యంతోనే అది సాధ్యం
- సెక్యులరిజం కాపాడటమే సిపిఎం లక్ష్యం
- సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు విజయ రాఘవన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశానికి బిజెపి ప్రమాదకరంగా మారిందని, అలాంటి పార్టీని గద్దెదించాల్సిన అవసరం ఎంతైనా ఉందని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీ ఎంపి విజయ రాఘవన్ పిలుపునిచ్చారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో సిపిఎం అభ్యర్థి జూలకంటి రంగారెడ్డి గెలుపును కోరుతూ శనివారం పట్టణంలోని హౌసింగ్ బోర్డు, మండలంలోని గూడూరు, లక్ష్మీపురం గ్రామాల్లో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లలో ఆయన మాట్లాడారు. మతోన్మాద బిజెపి దేశంలో ప్రజల మధ్య విద్వేషాలు సృష్టించి రాజకీయంగా లబ్దిపొందాలని చూస్తుందని విమర్శించారు. దేవుళ్లపై పెట్టిన శ్రద్ధ పేద ప్రజల అభివృద్ధిపై పెట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వరంగ సంస్థలను అమ్మి దేశ సంపదను అదానీ, అంబానీలకు అప్పజెప్పుతూ సామాన్య ప్రజలు జీవించలేని పరిస్థితికి తీసుకొచ్చారని వాపోయారు. మోడీ అధికారంలోకి వచ్చాకే నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయని, దాంతో పేద ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగాన్ని మారుస్తూ ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేసేందుకు కుట్రలు పన్నారని, ఇప్పటికైనా ప్రజలు మేలుకోకపోతే దేశానికి ప్రమాదం ఏర్పడుతుందని చెప్పారు. కేంద్రం, రాష్ట్రం అవలంభిస్తోన్న ప్రజా వ్యతిరేక విధానాల పట్ల ప్రజలు చైతన్యవంతులు కావాలని, ఎన్నికల్లో మోడీతో పాటు కెసిఆర్‌ను ఓడించి గద్దె దింపాలని కోరారు. నిత్యం ప్రజల పక్షాన పేద వర్గాల అభివృద్ధి కోసం జూలకంటి రంగారెడ్డి రాజీలేని పోరాటాలు చేస్తున్నారని చెప్పారు. జూలకంటి రంగారెడ్డిని గెలిపించి అసెంబ్లీకి పంపించినట్టయితే అన్ని వర్గాల ప్రజల సమస్యలపై చట్టసభలో ప్రస్తావించి వాటి పరిష్కారం కోసం కృషి చేస్తారని చెప్పారు. డబ్బు బలంతో వచ్చే బిజెపి, కాంగ్రెస్, బిఆర్ఎస్ అభ్యర్థులను ఓడించి బుద్ధి చెప్పాలన్నారు. సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ.. డబ్బుందన్న అహంకారంతో కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి అభ్యర్థులు వాటిని పంచి గెలవాలని చూస్తున్నారని విమర్శించారు. అలాంటి వారిని గెలిపిస్తే అసెంబ్లీలో చివరి బెంచీలో కూర్చుంటారని, ప్రజాసమస్యలు పరిష్కారం కావాలని తెలిపారు. అదే తనను గెలిపిస్తే ముందు బెంచీలో కూర్చుని ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగర్, తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీ రామ్‌నాయక్, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు నారి ఐలయ్య, రమ, ఎంవీ రమణ, డబ్బికార్ మల్లేష్, ఐద్వా జిల్లా అధ్యక్షులు వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ హక్కుల పరిరక్షణకు సిపిఎంను గెలిపించండి : బృందాకరత్

సభల్లో పాల్గొన్న బృందాకరత్

దుంగార్‌పూర్ : దుంగార్‌పూర్ సిపిఎం అభ్యర్థి గోతమ్ దామోర్‌కు మద్దతుగా బిచ్చివాడలో భారీ బహిరంగ సభ నిర్వహించారు. సభలో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్ మాట్లాడుతూ ఆదివాసీల హక్కులను పరిరక్షించుకునేందుకు, రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకునేందుకు సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. బాపురామ్ బరందా అధ్యక్షతన జరిగిన సభలో దులీచంద్‌మీనా తదితరులు ప్రసంగించారు.

రాజస్థాన్‌లో ఊపందుకున్న ప్రచారం

సభల్లో పాల్గొన్న ఖర్గే

జైపూర్ : మరో వారం రోజుల్లో ఎన్నికలు జరగనున్న రాజస్థాన్‌లో ప్రచారం ఊపందుకుంది. హేమాహేమీలు ఎన్నికల సభల్లో పాల్గొంటున్నారు. రాజస్థాన్‌లోని ప్రచార సభల్లో ప్రధాన మంత్రి నరేంద్రమోడీ, ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్ తదితరులు పాల్గొన్నారు.ఎవరు ఎంతలా ప్రచారం చేసినా అధికారం కాంగ్రెస్‌దేనని మల్లికార్జున ఖర్గే ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ చీఫ్ మల్లికార్జున ఖర్గే జైపూర్ ఎన్నికల ర్యాలీలో ప్రసంగిస్తూ, ప్రధాని మోడీ ఎంతలా ప్రయత్నించినా చివరగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేది కాంగ్రెస్ మాత్రమేనని అన్నారు. సంపన్నులను మరింత సంపన్నులుగా, పేదలను మరింత నిరుపేదలుగా తయారుచేసేందుకే బిజెపి ప్రభుత్వం కృషి చేస్తోందని విమర్శించారు. మిత్రుల కోసం దేశాన్ని తాకట్టు పెట్టేది బిజెపి అయితే, పేదలు, రైతులు, యువత కోసం కష్టపడేది కాంగ్రెస్ అని అన్నారు. పేదల కోసం తాము ఏదన్నా చేస్తే ఉచితాలు అంటూ గోల పెడతారని, కానీ ఆయన మాత్రం సంపన్నులకు రూ.15 లక్షల కోట్ల రుణాలను రద్దు చేశారని విమర్శించారు. యువతను తప్పుదోవ పట్టించేందుకే కేంద్రం అగ్నివీర్ పథకాన్ని తీసుకొచ్చిందన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే దీనికి ఒక మార్గం కనుగొంటామన్నారు.

అవినీతిలో రాజస్థాన్ టాప్ :మోడీ

రాజస్థాన్‌ను అవినీతిలో అందలమెక్కించింది కాంగ్రెస్సేనని ప్రధాని నరేంద్రమోడీ విమర్శించారు.

సభల్లో పాల్గొన్న మోడీ

నేరాలు, అల్లర్ల సంఖ్యలో రాజస్థాన్‌లో టాప్‌లో వుందన్నారు. తన బుజ్జగింపు విధానాలతో నేరస్తులు, సంఘ వ్యతిరేక శక్తులు తప్పించుకునేలా చేస్తోందని అన్నారు. భరత్‌పూర్‌లోని ఒక ర్యాలీలో మోడీ మాట్లాడారు. ఈసారి 'జాదూగర్'కు ఓటు వేయవద్దని రాష్ట్ర ప్రజలు నిర్ణయించుకున్నారని సిఎం అశోక్ గెహ్లాట్‌ను ఉద్దేశించి ఆయన వ్యాఖ్యానించారు. ఈ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ రాష్ట్ర రాజకీయాల నుండి అదృశ్యమైపోతుందన్నారు.

యాంత్రిక లోపంతో నిలిచిపోయిన డ్రిల్లింగ్ పనులు

- చిక్కుకున్నది 41మంది కార్మికులు
- కొండ పై నుండి డ్రిల్లింగ్‌కు అవకాశం?

ఉత్తరకాశి : పాక్షికంగా కూలిపోయిన సిల్క్యారా సొరంగంలో చిక్కుకుపోయిన కార్మికులను రక్షించే ఆపరేషన్ శుక్రవారం నుండి నిలిచిపోయింది. కొత్తగా అమెరికా తయారీ యంత్రాన్ని తెప్పించి దాంతో డ్రిల్లింగ్ చేపడుతుండగా, అందులో యాంత్రిక లోపం తలెత్తింది. దాంతో ఇండోర్ నుండి మరో డ్రిల్లింగ్ యంత్రాన్ని తెప్పించారు. శనివారం సంఘటనా ప్రాంతానికి చేరుకున్న ఈ యంత్రానికి గల మూడు విడిభాగాలను బిగిస్తున్నారు. ఆ తర్వాత డ్రిల్లింగ్ ప్రారంభిస్తామని అధికారులు చెప్పారు. ఇదిలావుండగా గత ఆదివారం నుండి సొరంగంలో చిక్కుకుపోయిన వారి సంఖ్య 41గా సొరంగ నిర్మాణ కంపెనీ అధికారులు సవరించారు. ప్రస్తుత పరిస్థితులను ఎదుర్కొనడానికి ఇతరత్రా మార్గాలు, పద్ధతులు ఏమైనా వున్నాయా అని అధికారులు ఆలోచిస్తున్నారు. ఇందులో భాగంగా నిపుణుల బృందం సంఘటనా స్థలానికి చేరుకుంది. సహాయక చర్యలను సంఘటనా స్థలంలోనే సమీక్షించేందుకు కేంద్రం నుండి అధికారులు కూడా వచ్చారు. శుక్రవారం మధ్యాహ్నం పని నిలిచిపోయే సరికి 24మీటర్ల పొడవునా డ్రిల్లింగ్ చేయగలిగారు. మొత్తంగా 60మీటర్ల పొడవునా డ్రిల్లింగ్ చేయాల్సి వుంది.

ముఖ్యమంత్రి సమీక్ష

ఇదిలావుండగా సొరంగం పనుల్లో పురోగతిపై ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్ దామి శనివారం ఉన్నతాధికారులతో తన అధికార నివాసంలో సమీక్ష జరిపారు. బాధితుల కుటుంబాలకు ప్రభుత్వం బాసటగా వుందని చెప్పారు. త్వరలోనే ఈ ఆపరేషన్ విజయవంతంగా పూర్తికాగలద'ని ఆశిస్తున్నట్లు చెప్పారు. దేశ విదేశాల్లోని అత్యంత అధునాతన యంత్రాలు కార్మికులను కాపాడగలవన్నారు. సొరంగంలో చిక్కుకున్న వారిని రక్షించాలంటూ టన్నెల్ వద్ద కార్మికులు ఆందోళన చేశారు.

పై నుండి డ్రిల్లింగ్ ?

లోపల చిక్కుకుపోయిన కార్మికులను చేరుకునేందుకు కొండ పై భాగం నుండి డ్రిల్లింగ్ జరపడంతో సహా ఇతరత్రా గల మార్గాలను సహాయ బృందాలు అన్వేషిస్తున్నాయని అధికారులు శనివారం ప్రకటించారు. పై నుండి అయితే మొత్తంగా 170మీటర్ల పొడవు వుంది. దానికి డ్రిల్లింగ్‌అంటే మరింత ఎక్కువ సమయం పట్టే అవకాశం వుంది. దీనికన్నా దక్షిణ ప్రవేశమార్గం వైపున శిధిలాలతో నిండిన మార్గం పొడవు 60మీటర్లే వుంది. ఈ రూట్‌లో డ్రిల్లింగ్ జరపడంతోసహా ఇతర రకాల పద్ధతులను కూడా అన్వేషించి, అమలు చేయాలని భావిస్తున్నట్లు సహాయ బృందాలు తెలిపాయి.

సొరంగంలో చిక్కుకున్న వారిని రక్షించాలంటూ టన్నెల్ వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

వరుస ఘటనలు జరుగుతున్నా నిర్లక్ష్యం వీడరెందుకు? : సిపిఎం

ఉత్తరాఖండ్‌లో తరచూ విపత్తులు సంభవిస్తున్నా ముందు జాగ్రత్తలు తీసుకోవడంలో విఫలమవుతున్నారని సిపిఎం విమర్శించింది. తపోవన్ - విష్ణుఘర్ జలవిద్యుత్ ప్రాజెక్టు వరదల్లో ధ్వంసమైందని గుర్తు చేసింది. జోషిమఠ్‌లో భారీ భవనాలు సైతం కుంగిపోయి, కూలిపోయాయని పేర్కొంది. ముందుజాగ్రత్తలు చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే విపత్తు సంభవించిందని తెలిపింది. 4.5 కిలోమీటర్ల రైల్వే సొరంగంలో 40 మంది కార్మికులు ఏడు రోజులుగా చిక్కుకున్నారని, వారిని రక్షించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది.

స్పష్టత లేని తెలంగాణ బిజెపి మేనిఫెస్టో

- నదీ జలాలు పంపిణీ, ఎస్‌సి వర్గీకరణపై నో క్లారిటీ

మ్యానిఫెస్టోను విడుదల చేస్తున్న అమిత్‌షా, కిషన్‌రెడ్డి తదితరులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బిజెపి ప్రకటించిన మేనిఫెస్టోలో స్పష్టత కరువైంది. ఎస్‌సి వర్గీకరణ చేపడతామని స్వయంగా ప్రధానమంత్రి మోడీ ఇటీవల సికింద్రాబాద్‌లో నిర్వహించిన సభలో ప్రకటించినప ్పటికీ.. బిజెపి మేనిఫెస్టోలో దానిపై ఎటువంటి స్పష్టతా ఇవ్వలేదు. తెలంగాణ ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య అంతర్రాష్ట్ర జలవివాదాలపై కూడా మేనిఫెస్టోలో బిజెపి క్లారిటీ ఇవ్వలేదు. డీజిల్, పెట్రోల్ ధరలను తగ్గించాలని దేశ ప్రజలు ఆందోళనలు చేసినా పట్టించుకోని బిజెపి..తెలంగాణ ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు పెట్రోల్, డీజిల్ పై వ్యాట్ తగ్గిస్తామని ప్రకటించింది. ప్రజలకు ప్రధానమైన విద్య, వైద్యం విషయంలో స్పష్టమైన విధానాలను బిజెపి ప్రకటించలేదు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలనే ఇక్కడ కూడా వల్లెవేసింది. వ్యవసాయ రంగం, రైతుల సంక్షేమంపై బిజెపి ఇచ్చిన హామీలు నమ్మశక్యంగా లేవని రైతు సంఘాల నేతలు అంటున్నారు. ఉపాధి అవకాశాలపై కూడా బిజెపి నిర్దిష్టమైన ప్రణాళిక వెల్లడించలేదు. శనివారం హైదరాబాద్‌లో కేంద్ర హోం మంత్రి అమిత్ షా బిజెపి ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేంద్రంలో, రాష్ట్రంలో ఒకే ప్రభుత్వం ఉంటే పథకాలు చక్కగా అమలవుతాయన్నారు. ఈ తొమ్మిదేళ్లలో తెలంగాణకు కేంద్రం రూ.2.15 లక్షల కోట్లు ఇచ్చిందని తెలిపారు.

మేనిఫెస్టోలోని కీలక అంశాలు

ధరణి స్థానంలో 'మీ భూమి' యాప్, పెట్రోల్, డీజిల్‌పై వ్యాట్ తగ్గింపు. బిఆర్ఎస్ ప్రభుత్వం కుంభకోణాలపై విచారణకు కమిటీ ఏర్పాటు. గల్ఫ్ బాధితుల కోసం ప్రత్యేక నోడల్ విభాగం ఏర్పాటు. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రతి నెలా ఒకటిన వేతనాలు, పింఛన్లు. మత రిజర్వేషన్లు తొలగించి.. బిసి, ఎస్‌సి, ఎస్‌టిలకు పెంపు. ఉమ్మడి పౌరస్మృతి ముసాయిదా కమిటీ ఏర్పాటు. అర్హత కలిగిన కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు. ఎరువులు, విత్తనాల కొనుగోలు కోసం రూ.2,500 ఇన్‌పుట్ సబ్సిడీ. పిఎం ఫసల్ బీమా యోజన కింద రైతులకు ఉచిత పంటల బీమా. వరికి రూ.3,100 మద్దతు ధర. ఆసక్తిగల రైతులకు ఉచితంగా దేశీ ఆవుల పంపిణీ. నిజామాబాద్‌ను టర్మరిక్ సిటీగా అభివృద్ధి.

శాంతి చర్చలకు చొరవ చూపండి

- గవర్నర్‌కు పది ప్రతిపక్ష పార్టీల వినతి

న్యూఢిల్లీ : మణిపూర్‌లో శాంతి చర్చలకు చొరవ తీసుకోవాలని ఆ రాష్ట్ర గవర్నర్ అనసూయ ఉయ్‌కేను రాష్ట్రానికి చెందిన పది ప్రతిపక్ష పార్టీలు విజ్ఞప్తి చేశాయి. మణిపూర్‌లో మైతీలు, కుకీల మధ్య నెలకొన్న వివాదాన్ని పరిష్కరించి, శాంతిని నెలకొల్పడానికి ఇరు గ్రూపులతో చర్చలు జరపాలని డిమాండ్ చేశాయి. రాష్ట్రంలోని రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించాలని ప్రధానిని కోరాయి. శాంతిభద్రతల పునరుద్ధరణకు అవసరమైన చర్యలు తీసుకుంటామని గవర్నర్ హామీ ఇచ్చినట్లు రాజ్‌భవన్ ఒక ప్రకటనలో తెలిపింది. మాజీ ముఖ్యమంత్రి ఇబోబిసింగ్ నేతృత్వంలోని ఈ బృందంలో సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్, ఆప్, జెడియు, ఎన్‌సిపి, ఫార్వార్డ్ బ్లాక్, శివసేన (ఉద్ధవ్), ఆర్ఎస్‌పి, టిఎంసి పార్టీల నాయకులు ఉన్నారు. ఆరు నెలలుగా అల్లర్లతో అతలాకుతలమవుతున్నా మణిపూర్‌లో కేంద్రం జోక్యం చేసుకోని సంగతి తెలిసిందే.

గాజాలో స్కూలుపై దాడి : 50మంది మృతి

పొంచివున్న ఆకలిచావులు : ఐరాస

గాజా సిటీ : గతకొద్ది రోజులుగా అల్‌షిఫా అస్పత్రిని లక్ష్యంగా చేసుకుంటూ దాడులు జరిపిన ఇజ్రాయిల్ బలగాలు తాజాగా జాబాలియా శరణార్ధ శిబిరంలో గల స్కూలుపై దాడిచేశాయి. శనివారం ఉదయం అల్-ఫకూరా పాఠశాలపై జరిగిన దాడిలో 50మంది చనిపోయారని గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. మృతుల్లో 19మంది చిన్నారులతో సహా ఒకే కుటుంబానికిచెందిన 32మంది ఉన్నారు. స్కూలుపై బాంబు దాడిని హమస్ తీవ్రంగా ఖండించింది. అభం శుభం తెలియని చిన్నారులను, అమాయకులను బలితీసుకుంటున్న ఇజ్రాయిల్‌ను ఈ దాడులకు, నేరాలకు జవాబుదారీ చేస్తామని పేర్కొంది. మొత్తంగా ఉత్తర గాజా ప్రాంతంలో పాలస్తీనియన్లు ఎవరూ లేకుండా చేయాలన్నది ఇజ్రాయిల్ ఆలోచనగా వుందని, అందుకే ఇలా స్కూలుపై దాడి చేసిందని పాలస్తీనా ఆరోగ్యమంత్రిత్వ శాఖ పేర్కొంది. ఐక్యరాజ్య సమితి నిర్వహించే పాఠశాలపై ఈ దాడి జరిగిందని తెలిపింది. ఈ పాఠశాలలో వేలాదిమంది నిర్వాసితులు తలదాచుకున్నారు. రఫాలోని భవనాలు కూడా బాంబులు వేసి ధ్వంసం చేశారు. నుసైరాత్ శరణార్థుల శిబిరంపై కూడా దాడి జరిగింది. వెస్ట్ బ్యాంక్‌లోని జెనిన్ శరణార్థి శిబిరంపై జరిగిన బాంబు దాడిలో నలుగురు వ్యక్తులు మరణించారు. దక్షిణ గాజాలోని అల్-ఫాలా పాఠశాలపై ఇజ్రాయెల్ బాంబు దాడి చేయడంతో పలువురు మరణించారు. 100 మందికి పైగా గాయపడ్డారు. 42 రోజులుగా గాజాపై ఇజ్రాయిల్ దాడుల్లో మృతుల సంఖ్య 12వేలు దాటింది.

పెద్దాసుపత్రిపై ఇజ్రాయెల్ దాడి
'ఐసీయూలో ఉన్నవారంతా చనిపోయారు'

గాజా నగరంలోని అతి పెద్దదయిన అల్ షిఫా ఆసుపత్రిపై ఇజ్రాయెల్ దళాలు శుక్రవారం రాత్రి జరిపిన క్రూరమైన దాడిలో ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో ఉన్న వారంతా చనిపోయారని ఆసుపత్రి డైరెక్టర్ ముహమ్మద్ అబు సల్మియా తెలిపారు. ఒక్క రాత్రిలో ఆస్పత్రిలో 22 మంది ప్రాణాలు కోల్పోయారు. ఆసుపత్రి పెద్ద కాన్సంట్రేషన్ క్యాంపుగా, సామూహిక సమాధిగా మారిపోయిందని అన్నారు. ప్రస్తుతం ఆస్పత్రిలో తాను, సిబ్బంది, రోగులతో సహా కొద్దిమంది మాత్రమే వున్నామని, అక్కడ నుండి వెళ్లడానికి ఇజ్రాయిల్ బలగాలు అనుమతించడం లేదని తెలిపారు. శుక్రవారం మూడో రోజు కూడా ఇజ్రాయెల్ సైన్యం ఆసుపత్రిలోనే మకాం వేసింది. ఇంధనం, మందులు, ఆహారం లేదా నీరు లేవు. రోగులు, ఆరోగ్య అధికారులు , శరణార్థులు సహా 7,000 మందికి పైగా చిక్కుకున్నారు. ప్రతి నిమిషానికి ఒకరు చనిపోతున్నారు. అంతర్జాతీయ సంస్థలు జోక్యం చేసుకుని, అల్ షిఫా అస్పత్రిలో ఇంక్యుబేటర్లలో వున్న శిశువులను, గాయపడిన చిన్నారులను వెస్ట్ బ్యాంక్ లేదా ఈజిప్ట్‌లోని ఆస్పత్రులకు తరలించి, వారికి మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని పాలస్తీనా ఆరోగ్యమంత్రి మయి అల్-కైలా కోరారు. అల్ షిఫా ఆస్పత్రిని మిలటరీ బ్యారక్స్‌గా మార్చేస్తున్నారని, తుపాకీలు చూపి బెదిరిస్తూ లోపల వున్నవారిని ఖాళీ చేయిస్తున్నారని మంత్రి తెలిపారు. ప్రస్తుతం గాజాలో ఏ ఆస్పత్రిలో కూడా గాయపడినవారికి చికిత్సనందించే సదుపాయాలు లేవన్నారు.

గాజాలో కాల్పుల విరమణ ప్రకటించాలని ఇజ్రాయెల్‌పై అంతర్జాతీయ ఒత్తిడి పెరగడంతో రోజుకు రెండు ట్రక్కులకు ఇంధనాన్ని అనుమతిస్తామని ప్రకటించారు. హమాస్‌కు అందుబాటులో లేకుండా చూసుకోవాలని మంత్రివర్గం కోరింది. అక్టోబరు 7న యుద్ధం మొదలైన తర్వాత గాజా స్ట్రిప్‌లోకి ఇంధనం చేరడం ఇదే తొలిసారి. నీటి సరఫరా మరియు వ్యర్థ పైపులైన్‌లను నిర్వహించడానికి అవసరమైన ఇంధనం మాత్రమే రఫా సరిహద్దు ద్వారా గాజా స్ట్రిప్‌లోకి రవాణా చేయబడుతుందని ఇజ్రాయెల్ ప్రకటన. గాజాలో కమ్యూనికేషన్ వ్యవస్థ కూడా పూర్తిగా మూతపడింది. గాజాలో ఫీల్డ్ హాస్పిటల్ ప్రారంభించడానికి ఐక్యరాజ్యసమితి సుముఖత వ్యక్తం చేసింది.

ఇదిలావుండగా అల్-షిఫా హాస్పిటల్ నుండి స్వాధీనం చేసుకున్న ఆయుధాలుగా చిత్రీకరిస్తూ ఇజ్రాయెల్ సైన్యం విడుదల చేసిన వీడియో నకిలీదని తేలడంతో, మరుసటి రోజు దానిని ఉపసంహరించుకోవాల్సి వచ్చింది. ఇజ్రాయెల్‌లోని బెంజమిన్ నెతన్యాహు ప్రభుత్వం అల్-షిఫా హమాస్ కార్యకలాపాలకు కేంద్రంగా ఉందని చేస్తున్న ప్రచారం ఎంత బూటకమో దీంతో స్పష్టమయింది. కాల్పుల విరమణ జరిగితే గాజాలో ఆస్పత్రులను తాము పునర్నిర్మిస్తామని టర్కీ అధ్యక్షుడు ఎర్డోగన్ ప్రకటించారు. గాజాలో సురక్షితమైన ప్రదేశం అంటూ ఏమీ లేకుండా పోయిందని ఐక్యరాజ్య సమితి ప్రతినిధి తమారా అల్ రిఫాయ్ ఆందోళన వ్యక్తం చేశారు.

ఒక గంట సమయమిచ్చి అల్‌షిఫా ఆస్పత్రి నుండి వెళ్ళిపోవాల్సిందిగా ఆదేశించారని, అలా వెళ్ళేవారినిముఖ్యంగా మహిళలను అమానవీయమైన రీతిలో సోదాచేస్తున్నారని ప్రత్యక్ష

గాజాలోని ఖాన్ యూనిస్ ఆసుపత్రి వద్ద ఇజ్రాయిల్ శనివారం జరిపిన దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన పాలస్తీనా వాసుల మృతదేహాలు

సాక్షులు తెలిపారు. బట్టలూడదీయించి మరీ వారు సోదాలు చేస్తున్నారని, తలెత్తుకోలేని రీతిలో అనేక సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని వారు చెప్పారు. ఆస్పత్రి పై అంతస్తులో అనేకమందిని బందీలుగా వుంచి వారికి ఆహారం, నీరు ఇవ్వకుండా అమానుషంగా ప్రవర్తిస్తున్నారని చెప్పారు.

గాజాలో పొంచివున్న ఆకలిచావులు : ఐరాస హెచ్చరిక

ఇంధన కొరత కారణంగా ఏర్పడిన దయనీయమైన, నిస్సహాయ పరిస్థితులతో ఇప్పటికే ఇబ్బందుల పాలవుతున్న గాజా ప్రజలు ఆకలిచావులను ఎదుర్కొనే అవకాశాలు కూడా పొంచి వున్నాయని ఐక్యరాజ్య సమితి హెచ్చరించింది. శీతాకాలం సమీపిస్తున్నందున పరిస్థితులు మరింత అధ్వానంగా మారతాయని పేర్కొంది. గత ఐదు వారాల కాలంలో గాజాకు కేవలం 10శాతం ఆహారం మాత్రమే వచ్చిందని ఐక్యరాజ్య సమితి ఆహార కార్యక్రమం (డబ్ల్యుఎఫ్‌పి) మధ్య ప్రాచ్య ప్రాంతీయ ప్రతినిధి అబీర్ ఇటెఫా చెప్పారు. దీంతో ప్రజల్లో డీ హైడ్రేషన్, పోషకాహార లోపం బాగా పెరుగుతోందన్నారు. దాదాపు గాజాలో వున్న ప్రతి వ్యక్తీ ఆహార అవసరాన్ని తీవ్రంగా ఎదుర్కొంటున్నాడని తెలిపారు.

మీ కోసం

అల్లం ముక్కల్ని ఎండలో పెట్టి దానిని టీలో వేస్తే మరింత రుచిగా ఉంటుంది.

జీవన సౌరభం

చరిత్రను అసాంతం చదవకపోయినా చరిత్రను సృష్టించవచ్చు.

తేనెలమ్మ

కొండ మీద చందమామ
కొలనులోని కలువ భామ

కొమ్మ మీద కోకిలమ్మ
కమ్మనైన కూనలమ్మ

నింగిలోని సూరీడమ్మ
పొంగి పోయె పంకజమ్మ

కరిమబ్బు చూసి నెమలమ్మ
మైమరచి ఆడె ఓయమ్మ

హాయిగ ఊగే పూలకొమ్మ
వేయిగ మనసే మురిసెనమ్మ

ఝుమ్మని పాడే తుమ్మెదమ్మ
కమ్మని కబుర్లె చెప్పెనమ్మ

తియ్యని తేటల తేనెలమ్మ
తెలుగు మాటల కోయిలమ్మ

- గుండాల నరేంద్రబాబు,
94932 35992.



చుక్కలు కలపండి

పిల్లలూ, ఇక్కడ ఇచ్చిన చుక్కలను వరుసగా కలిపితే అందమైన బొమ్మ వస్తుంది. ట్రై చేయండి మరి!

నేను గీసిన బొమ్మ

ఎస్.రూప,
4వ తరగతి,
దిగువ సాంబయ్య పాలెం,
తొట్టంబేడు మండలం,
తిరుపతి జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

యుద్ధం వద్దు .. వద్దే వద్దు !

'కుల, మతాల పట్టింపులేదు.. దేశవిదేశాలతో పనిలేదు.. అన్యాయం, అక్రమం, దారుణాలు ఎక్కడ జరిగినా స్పందిస్తాం.. సంఘీభావం తెలుపుతాం' అంటూ చిన్నారులు వేసిన చిత్రపటాలివి. పిల్లలపై యుద్ధం ఎంతటి తీవ్ర పరిణామాలను తెస్తుందో వివరించిన వాళ్ల చిట్టి చేతులతో సృష్టించిన అద్భుత కళాఖండాలివి. పాలస్తీనాపై ఇజ్రాయిల్ తలపెట్టిన యుద్ధంలో తమ ఈడు పిల్లలు అశువులు బాయటం చూసి చలించిపోయిన లేత హృదయాల భగ్న ముద్రితలివి..

స్కూలు బ్యాగు, ఆట వస్తువుల మధ్య రక్తంతో తడిసిన చిన్నారి, ఆ పక్కనే కట్టడాల కింద అశువులు బాసిన బుజ్జాయి చేతిలో పాలసీసా చిత్రంలో 'మేము శాంతిని కోరుకుంటున్నాం' అన్న నినాదంతో గాయాలతో రక్తం కారుతున్న బాలుడు, అతని ఒడిలో ఆటబొమ్మ చిత్రం పిల్లలపై యుద్ధ ప్రభావాన్ని కళ్లకు కట్టినట్లు చూపించారు.

'మేము జీవించాలనుకుంటున్నాం' అన్న నినాదం పట్టుకున్న బాలిక చిత్రంలో శాంతి చిహ్నంలా చేతిలో గులాబి పట్టుకున్న గాయపడిన చిన్నారి, ఆ పక్కనే ముఖమంతా రక్తసిక్తమైన బాలుడి చిత్రపటం పిల్లల ఆవేదనను ప్రతిబింబించింది.

యుద్ధ భయంతో ఒకపక్క మోయలేని బరువును మోస్తూ, చంకలో ఒక బిడ్డ, చేత్తో మరోబిడ్డను తీసుకుని తరలిపోతున్న ఓ మాతృమూర్తి చిత్రపటం ఎంతోమంది వెతలను కళ్లకు కట్టినట్లు ఉంది.

ఛిద్రమైన కట్టడాల మధ్య బిడ్డను అక్కునచేర్చుకున్న తల్లిని చిత్రించిన చిత్రపటంలో యుద్ధం పిల్లలు, మహిళలపై చూపించే ప్రభావానికి అద్దం పడుతోంది.

అన్ని మతాలూ సమానమనే సందేశం ఇస్తూ శాంతి కపోతంతో ప్రపంచ శాంతిని కోరుకుంటూ వేసిన చిత్రపటం చిన్నారుల ఆకాంక్షను తెలియజేస్తోంది.

యుద్ధభయంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని విచార వదనాలతో కూర్చొన్న కుటుంబాలను చిత్రించిన చిత్రపటాలు యుద్ధ ప్రభావ ప్రాంతవాసుల వెతలను కళ్లకు కడుతోంది.

ఒకపక్క ఆటబొమ్మలతో ఆడుకుంటూ, మ్యాజిక్ షోలతో సరదాగా గడుపుతున్న చిన్నారులు, మరోపక్క, యుద్ధంలో అమ్మానాన్నను కోల్పోయి, తుపాకులు, ఫిరంగుల మధ్య మారణాయుధాల మధ్య మరణశయ్యపై పిల్లలు, శిథిలాల కింద చిన్నారులు, ఆహ్లాదకర వాతావరణంలో స్వేచ్ఛగా విహరిస్తున్న బుజ్జాయిలు.. అందరికీ శాంతి కావాలన్న ఇతివృత్తంతో ప్రశాంతతకు చిహ్నమైన పావురం అక్కున చేర్చుకున్న ప్రపంచాన్ని చిత్రించారు.



యుద్ధ కాంక్షను వీడి ప్రపంచ దేశాలు శాంతిని కోరుకోవాలని సుడిగుండాల మధ్య అన్ని దేశాల జాతీయపతాలను చుట్టుకున్న చేతితో ప్రపంచాన్ని శాంతికి చిహ్నమైన పావురం వైపు చూపించడం పిల్లల సృజనకు, వారి ఆకాంక్షకు అద్దం పడుతోంది.



గాయాలతో చెట్టుకింద కూర్చొన్న పిల్లాడి బొమ్మలో పిల్లల స్వేచ్ఛ, సంతోషాలను కాలరాస్తున్న యుద్ధాన్ని, ఒకే ఈడు పిల్లల మధ్య యుద్ధం తలపెట్టిన అగాధాన్ని చూపించారు.

మర ఫిరంగులు,

యుద్ధంపై పెద్ద పెద్ద ఉపన్యాసాలు ఇవ్వలేని వయసులో, యుద్ధ ప్రభావం తమని ఎంతలా వేదనకి గురిచేస్తుందో చెప్పలేని ఈడులో తమ ఆకాంక్షలను, ఆశలను బొమ్మల రూపంలో వ్యక్తం చేసిన ఈ చిన్నారులను అభినందించకుండా ఉండలేం. ఇంతటి బృహత్తర కార్యక్రమానికి, ఈ బొమ్మల భాషలో పిల్లల అంతరంగాలను వెలికితీయడానికి నడుం బిగించింది 'ఫోరం ఫర్ ఆర్టిస్ట్'. విజయవాడ కేంద్రంగా ప్రారంభమైన ఈ సంస్థ కొన్నేళ్లుగా రాష్ట్ర వ్యాప్తంగా వివిధ అంశాల్లో బొమ్మల రూపంలో పిల్లల మనోభావాలను వెలికితీయడంలో ముందుంటోంది. అనేక చోట్ల చిత్రకళాపోటీలు, ప్రదర్శనలతో పిల్లల్లో దాగున్న సృజనను వెలికితీస్తోంది. ప్రారంభించిన అనతికాలంలోనే వేలాది మంది చిన్నారులు ఈ కార్యక్రమాల్లో భాగస్వామ్యం అవ్వడం మంచి పరిణామం.

ఈ ఏడాది నవంబరు 14న బాలల దినోత్సవం సందర్భంగా ఇజ్రాయిల్-పాలస్తీనా యుద్ధం.. పిల్లలపై ప్రభావం అంశాన్ని ఇచ్చింది. 6 నుండి 10వ తరగతి పిల్లలకు ఇచ్చిన ఈ అంశంపై అపూర్వ స్పందన వచ్చింది. ఆన్‌లైన్ వేదికగా ప్రకటించిన అతి స్వల్ప కాలంలోనే రాష్ట్ర నలుమూలల నుండి అనేక చిత్రాలు చేరాయి. వాటిలో ఎంపికచేసిన చిత్రాలతో జాషువా సాంస్కృతిక వేదిక భాగస్వామ్యంతో విజయవాడ బాలోత్సవ్ భవన్‌లో కొద్ది రోజుల కిందట ప్రదర్శన ఏర్పాటు చేశారు. యుద్ధంపై చిన్నారుల విశేష స్పందన చూసిన వీక్షకులకు ఆశ్చర్యంతో మాటలు రాలేదు.

ఏ దేశం వారైనా, ఏ మతం వారైనా, రంగులు వేరైనా, జాతులు భిన్నమైనా, భాషలు ఒకటి కాకపోయినా పిల్లలు శాంతికి చిహ్నాలు. స్వేచ్ఛకు ప్రతిరూపాలు. వారి ఆకాంక్షలను, ఆశలను పెద్దలు గౌరవించాలి. ఎంతో భవిష్యత్తు ఉన్న పిల్లలను యుద్ధం పేరుతో ఊచకోత కోయడం అమానవీయం. ఈ దారుణాన్ని, పిల్లల దీనత్వాన్ని తమ చిత్రాలలో ప్రతిబింబించిన ఈ పిల్లలు, ప్రపంచంలోని కోట్లాది చిన్నారుల ఆశలకు, ఆకాంక్షలకు ప్రతిరూపాలు.

- జ్యోతిర్మయి

ప్రాణాలు తీస్తున్న విద్యుత్ వైర్లు!

వెలుగులు నింపాల్సిన విద్యుత్ తీగలు నిండు ప్రాణాన్ని బలిగొన్నాయి. విద్యుత్ స్తంభానికి కనెక్షన్ బాక్స్ లేకపోవడంతో వేలాడుతున్న వైర్లు తగలడంతో విజయవాడలోని ఎస్ఆర్ఆర్ కళాశాల వద్ద శనివారం ఉదయం ఓ వృద్ధుడు ప్రాణాలు కోల్పోయాడు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఫొటో : టివి రమణ

విజయం కోసమే మూడేళ్లు ఎదురుచూశా : పాయల్

'ఈరోజు నా జీవితంలో ఎంతో ముఖ్యమైనది. 'మంగళవారం' సినిమాపై మీరు చూపిస్తోన్న ఆదరణకు నేను ఆనందిస్తున్నా. సంతోషాన్ని తెలియజేయడానికి మాటలు రావడం లేదు. టాలీవుడ్‌లో హీరోయిన్‌గా నన్ను మరోసారి లాంచ్ చేసిన అజయ్‌కు ధన్యవాదాలు. నా శ్రమకు తగిన ఫలితం దక్కింది. గత మూడు, నాలుగేళ్లగా ఇలాంటి ఆదరణ కోసమే నేను ఎదురుచూస్తున్నా. ఈ సినిమాతో మళ్లీ నాకు అంతటా మంచి రెస్పాన్స్ వచ్చింది' అంటూ నటి పాయల్ ఉద్వేగానికి గురయ్యారు. 'మంగళవారం' చిత్ర బృందం సక్సెస్‌మీట్ హైదరాబాద్‌లో శనివారం నిర్వహించింది. ఈ సభలో భావోద్వేగానికి గురయ్యారు నటి పాయల్ రాజ్‌పుత్. సినిమాకు వస్తోన్న స్పందన పట్ల ఆమె ఆనందం వ్యక్తం చేశారు.

'టెస్ట్' నయనతార

నయనతార నటిస్తున్న కొత్త చిత్రం 'టెస్ట్'. లేడీ ఓరియంటెడ్ కథతో రానున్న ఈ చిత్రంలో ఆమె లుక్‌ని తాజాగా చిత్రబృందం విడుదల చేసింది. శనివారం నయనతార పుట్టినరోజు సందర్భంగా ఆమెకు శుభాకాంక్షలు తెలుపుతూ ఈ లుక్ విడుదల చేశారు. ఈ చిత్రంలో ఆర్.మాధవన్, సిద్ధార్థ్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. వై నాట్ స్టూడియోస్ పతాకంపై చక్రవర్తి రామచంద్రన్, శశికాంత్ సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. మధ్య తరగతి కుటుంబాలకు చెందిన ముగ్గురి జీవితాలు క్రికెట్‌తో ఎలా ముడిపడ్డాయనేది ఈ సినిమా స్టోరీ అని చిత్రబృందం ఓ ప్రకటనలో తెలిపింది.



'సైరెన్' టీజర్ విడుదల

జయం రవి, కీర్తి సురేష్, అనుపమ పరమేశ్వరన్ హీరోహీరోయిన్లుగా నటించిన చిత్రం 'సైరెన్'. ఆంటోనీ భాగ్యరాజ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్ర టీజర్ తాజాగా విడుదలైంది. దిల్ రాజు విడుదల చేసిన ఈ టీజర్‌లో ప్రధానంగా రెండు పాత్రల మధ్య నడిచే కథ చూపించారు. పెరోల్‌పై జయం రవి జైలు నుంచి బయటకు వచ్చే సీన్ ద్వారా హీరో క్యారెక్టర్‌ను రివీల్ చేశారు. ఖైదీ పాత్రలో జయం రవి నటిస్తుండగా, పోలీస్ ఇన్‌స్పెక్టర్ పాత్రలో కీర్తి సురేష్ నటిస్తున్నారు. జీవీ ప్రకాష్ కుమార్ ఈ చిత్రానికి సంగీతం అందించారు. హోమ్ మూవీ మేకర్స్ బ్యానర్‌పై సుజాత విజయ్ కుమార్ ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. త్వరలోనే సినిమా ట్రైలర్, ఆడియో, మూవీ రిలీజ్ డేట్‌కు సంబంధించిన వివరాలను తెలియజేస్తామని చిత్రబృందం తెలిపింది.

థియేటర్‌లో సల్మాన్-కత్రినా డ్యాన్స్ సందడి

బాలీవుడ్ స్టార్స్ సల్మాన్-కత్రినా ముంబైలోని ఓ థియేటర్‌కు వెళ్లి ఆడి, పాడారు. వీరు ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'టైగర్-3' ఇటీవల విడుదలైన విషయం తెలిసిందే.

చిత్రబృందం ముంబైలోని థియేటర్‌కు వెళ్లి అక్కడ అభిమానులతో ముచ్చటించింది. అభిమానుల కోరిక మేరకు ఆ సినిమాలోని ఓ పాటకు హుషారైన స్టెప్పులు వేసి కత్రినా-సల్మాన్ అలరించారు. దీనికి సంబంధించిన వీడియోను యశ్ రాజ్ ఫిల్మ్ ఎక్స్‌లో పంచుకుంది. ప్రస్తుతం ఆ వీడియో వైరల్‌గా మారింది.

కప్పు ఎవరికి దక్కేనో !

- ఐసీసీ ప్రపంచకప్ ఫైనల్ నేడు
- మూడో టైటిల్‌పై ఆతిథ్య భారత్ గురి
- ఆరో ట్రోఫీ రేసులో ఆస్ట్రేలియా

అహ్మదాబాద్ మొతెరా మైదానం. 1.30 లక్షల మంది అభిమానులు. బరిలో 21వ శతాబ్దపు అత్యుత్తమ జట్లు. లక్ష్యం ఐసీసీ ప్రపంచకప్ టైటిల్. ఆతిథ్య భారత్ మూడోసారి ఈ కప్పు కొట్టాలని తలపిస్తుండగా, ఆసీస్ ఏకంగా సిక్సర్ కొట్టేందుకు ఉవ్విళ్లూరుతోంది. ఓటమెరుగని జైత్రయాత్రతో ఫైనల్లో ఫేవరేట్‌గా భారత్ నిలువగా.. ఈ టోర్నీల్లో విజయం సాధించటం తెలిసిన ఆసీస్ మరోవైపు. భారత్, ఆస్ట్రేలియా ఐసీసీ 2023 ప్రపంచకప్ ఫైనల్ నేడు. అంతిమ సమరానికి రంగం సిద్ధమైంది. అజేయ జట్టు ఆతిథ్య భారత్ సొంత అభిమానుల నడుమ దేశం గర్వపడే ప్రదర్శన చేయాలని చూస్తోంది. 120 కోట్ల భారతీయుల గుండె చప్పుడు నేడు మొతెరాలో వినిపించనుండగా.. ముచ్చటగా మూడోసారి కప్పు కొట్టాలని రోహిత్‌సేన తహతహ లాడుతోంది. ప్రపంచకప్‌లో పది మ్యాచుల్లో ఎదురులేని విజయాలు సాధించిన టీమ్ ఇండియా నేడు 11వ గెలుపుతో ప్రపంచకప్ ట్రోఫీకి చేరువయ్యేందుకు ఎదురు చూస్తోంది.

ఐసీసీ ట్రోఫీలు నెగ్గటం ఎరిగిన జట్టు ఆస్ట్రేలియా. ఐదుసార్లు ప్రపంచకప్ సాధించిన ఆసీస్ ఇటీవల టీ20 ప్రపంచకప్‌ను సైతం సొంతం చేసుకుంది. కంగారూల స్థాయికి తగ్గ ప్రదర్శనతో ఫైనల్‌కు చేరకపోయినా.. టైటిల్ పోరులో బరిలో నిలిచింది అరివీర భయంకర ఆస్ట్రేలియా. ఆఖరు బంతి వరకు పోరాడటం తెలిసిన పాట్ కమిన్స్ నేడు టీమ్ ఇండియా అత్యంత కఠిన ప్రత్యర్థి.

అహ్మదాబాద్ : అదే జోరు.. రెట్టించిన ప్రేరణ : ప్రపంచకప్‌లో టీమ్ ఇండియా ప్రశాంతత బాగా కలసొచ్చింది. నేడు టైటిల్ పోరు భావన అదనపు ఒత్తిడి దరిచేరకుంటే రోహిత్‌సేన ఓ మెట్టు ఎక్కినట్టే. బ్యాటింగ్ లైనప్‌లో అందరూ మంచి ఫామ్‌లో ఉన్నారు. కెప్టెన్ రోహిత్ శర్మ నిస్వార్థ ఆటతీరుతో ఆకట్టుకుంటున్నాడు. శుభ్‌మన్ గిల్ కీలక సమయంలో తనదైన ధాటి చూపిస్తున్నాడు. విరాట్ కోహ్లి పది ఇన్నింగ్స్‌లో ఏకంగా ఎనిమిది 50 ప్లస్ స్కోర్లు సాధించాడు. వాంఖడేలో చారిత్రక 50వ వన్డే సెంచరీతో భీకర ఫామ్‌లో ఉన్నాడు. టాప్-3 దండయాత్రకు శ్రేయస్ అయ్యర్, కెఎల్ రాహుల్ తోడయ్యారు. అయ్యర్ సిక్సర్ల మోత మోగిస్తుండగా, రాహుల్ సరికొత్త పంథాలో చెలరేగుతున్నాడు. టాప్-5 బ్యాటర్ల మెరుపులతో అదనపు బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ అవసరం ఇప్పటివరకు రాలేదు. నేడు ఆ అవసరం ఏర్పడినా.. సూర్య కుమార్ సిద్ధంగానే ఉన్నాడు. మహ్మద్ షమి ఆరు మ్యాచుల్లోనే 23 వికెట్లు పడగొట్టి ఔరా అనిపించాడు. బుమ్రా, సిరాజ్ తోడుగా షమి నిప్పులు చెరుగుతున్నాడు. ఈ పేస్ త్రయాన్ని ఎదురించి ఏ టాప్ ఆర్డర్ నిలువలేదు. కుల్దీప్, జడేజా మాయాజాలం సైతం మ్యాజిక్ షో తరహాలో నడుస్తోంది. సమిష్టిగా రాణిస్తున్న టీమ్ ఇండియాకు ప్రపంచకప్ ట్రోఫీ ప్రేరణ తోడైతే నేడు ప్రత్యర్థి నిలువగలదా?!

చరిత్ర తోడుగా..ఆసీస్: కంగారూలకు ప్రపంచకప్ ఆరంభం కలిసి రాలేదు. తొలి రెండు మ్యాచుల్లో ఓటములు. కానీ ఆ తర్వాత ఆ జట్టు పుంజుకుంది. వరుసగా ఎనిమిది విజయాలు సాధించింది. ఓటమి తథ్యమనుకున్న మ్యాచుల్లోనూ అసమాన విజయాలు సాధించి ఆశ్చర్యపరిచింది. తాజాగా ఫైనల్లోనూ ఆ జట్టును తక్కువ అంచనా వేస్తుండగా.. అందరికీ షాక్ ఇచ్చేందుకు సమాయత్తం అవుతోంది. స్మిత్, లబుషేన్ అంచనాలను అందుకోలేదు. వార్నర్, హెడ్ దూకుడులో నిలకడ లేదు. మాక్స్‌వెల్ మెరుపులు పరిమితమే. బంతితోనూ కమిన్స్, స్టార్క్, హాజిల్‌వుడ్ స్లో పిచ్‌పై ఏమాత్రం ప్రభావం చూపిస్తారో తెలియని అనిశ్చితి. అయినా, ఐసీసీ ప్రపంచకప్ ఫైనల్స్‌లో ఒత్తిడిని ఎదుర్కొనే అలవాటు ఆసీస్ సొంతం. గత చరిత్ర తోడుగా నేడు టైటిల్ పోరులో ఆస్ట్రేలియా విజయమే లక్ష్యంగా బరిలోకి దిగుతోంది.

పిచ్, వాతావరణం : భారత్, పాకిస్థాన్ గ్రూప్ దశ మ్యాచ్ జరిగిన పిచ్‌నే ఫైనల్‌కు సిద్ధం చేశారు. పాకిస్థాన్ 191 పరుగులకే కుప్పకూలగా, 30.3 ఓవర్లలోనే భారత్ లాంఛనం ముగించింది. ఫైనల్లో మరీ స్వల్ప స్కోర్లు నమోదు కాకపోయినా.. 320 పైచిలుకు స్కోరు గెలుపు ధీమా ఇవ్వగలదు. భారత్, ఆసీస్ టైటిల్ పోరుకు ఎటువంటి వర్షం సూచనలు లేవు. కానీ రెండో ఇన్నింగ్స్‌కు మంచు ప్రభావం ఉండనుంది. మంచు ప్రభావాన్ని తగ్గించేందుకు గ్రౌండ్ పచ్చికపై రసాయనాలు సైతం వాడారు. మ్యాచ్ ఆరంభంలో 33 డిగ్రీలు ఉండనున్న ఉష్ణోగ్రత.. రెండో ఇన్నింగ్స్ సమయంలో ఏకంగా 23 డిగ్రీలకు పడిపోనుంది.

తుది జట్లు (అంచనా) :

గ్రూప్ దశ ఐదో మ్యాచ్ నుంచి భారత జట్టులో మార్పులు లేవు. నేడు ఫైనల్లోనూ అదే ట్రెండ్ కొనసాగే వీలుంది. ప్రత్యర్థి ఆసీస్ కావటంతో రవిచంద్రన్ అశ్విన్‌ను తీసుకునే యోచన ఉన్నప్పటికీ.. ఇద్దరు సీమర్లతో బరిలో దిగటం సైతం ప్రమాదకరమే. ఆస్ట్రేలియా సైతం తుది జట్టులో మార్పులపై ఆలోచన చేస్తోంది. మార్నస్ లబుషేన్ స్థానంలో మార్కస్ స్టోయినిస్‌ను ఎంచుకునేందుకు మొగ్గు చూపుతోంది. కానీ స్లో పిచ్‌పై లబుషేన్ బ్యాటింగ్ నైపుణ్యం ఆసీస్‌కు అవసరం. దీంతో సెమీస్‌లో ఆడిన జట్లతోనే ఇరు జట్లు టైటిల్ పోరుకు సిద్ధం కానున్నాయి.

భారత్ : రోహిత్ శర్మ (కెప్టెన్), శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లి, శ్రేయస్ అయ్యర్, కెఎల్ రాహుల్ (వికెట్ కీపర్), సూర్యకుమార్ యాదవ్, రవీంద్ర జడేజా, మహ్మద్ షమి, జస్‌ప్రీత్ బుమ్రా, కుల్దీప్ యాదవ్, మహ్మద్ సిరాజ్.

ఆస్ట్రేలియా : డెవిడ్ వార్నర్, ట్రావిశ్ హెడ్, మిచెల్ మార్ష్, స్టీవ్ స్మిత్, మార్నస్ లబుషేన్, గ్లెన్ మాక్స్‌వెల్, జోశ్ ఇంగ్లిశ్ (వికెట్ కీపర్), మిచెల్ స్టార్క్, పాట్ కమిన్స్ (కెప్టెన్), ఆడం జంపా, జోశ్ హాజిల్‌వుడ్.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68